సృజన

ఆధునిక సాహిత్య వేదిక



సెప్టెంబర్ 1982

131

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

131 మాసపత్రిక సెప్టెంబర్ 198

కవర్ : పత్రికాస్వాతంత్ర్యం గొంతునులుముతున్న బీహార్ ప్రెస్‌బిల్

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సరచందా రు 20 ఈ సంచిక రు. 2

SRJANA is commended for use in Public Libraries in t State by the Director of Public Libraries, Andhra Pradesh, Hy Vide Ref. No. 182/A4/67, dated 22 9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrul Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 5060 for Venkataramana Mudranalayam, Warangal

Working Editor : Varavararao

పత్రికాస్వాతంత్ర్యం అంటే మొదట ప్రజలకున్న తెలుసుకునేహక్కు-స్వాతంత్ర్యంఅని గుర్తిస్తేతప్ప ఆ స్వాతంత్ర్యాన్ని సాధించి బాధ్యతతో నిర్వహించే కర్తవ్యాన్ని పత్రికారచయితలు నిర్వహించలేరు: పత్రికాస్వాతంత్ర్యం తమ స్వాతంత్ర్యంలో భాగంగనుక అదిసాధించడానికి తాముకూడ పోరాడాలని ప్రజలు గుర్తించలేరు.

పత్రికాస్వాతంత్ర్యం భావవ్యక్తీకరణకుండే మౌలికహక్కులోభాగం. మానవునికి జీవించడానికి, సంఘంపెట్టుకోవడానికి, తనభావాలు ప్రకటించుకోవడానికివున్న హక్కులు మౌలికమయినవి. ఏరాజ్యాంగమూ ఇచ్చినందువల్ల వచ్చినవికావు. మానవుడు ఉత్పత్తిక్రమంలో పాల్గొంటూ తనశ్రమద్వారా ఊహద్వారా నాగరికచరిత్రను నిర్మిస్తున్న క్రమంలో సాధించుకున్నవి. ఈ సహజమైన, నైసర్గికమైన హక్కులను నాగరికసమాజాలు, రాజ్యాలుగుర్తించక తప్పలేదు. అందుకే ప్రజలు తమకుతాము తెచ్చుకున్నవికాని ఎవరో రాజ్యాంగ రచయితలు ఇచ్చినవికావు ఈమౌలికహక్కులు.

ఈ మౌలికసత్యంమీద చాల దుమ్ముపేరుకున్నది. ఎన్నోముళ్ళు, రాళ్ళు, నెత్తురు, సంకెళ్ళు ఈసత్యాన్ని కమ్మేసినవి. ప్రజలు రోజూనిర్మిస్తున్న వార్తల్ని ప్రజలకుచేరవేసేబాధ్యత ప్రజలచేతుల్లో ప్రజలపక్షం వహించేవాళ్ళచేతుల్లో లేకుండా పోయింది. వార్తలంటే సమాచారానికి భూమిక ప్రజలుగాకుండా గుత్తపెట్టుబడిదారీ విధాన పుణ్యమాఅని పాలకులయినపుడు పాలకులు పాలుతాగితే రాసినపుడు కోపం రాదుగానీ ప్రజల నెత్తుటిలో స్నానమాడారని రాస్తేకోపంరాదా. (బీహార్ ముఖ్యమంత్రి జగన్నాధమిశ్రా మేకలనెత్తురుతో స్నానంచేసాడని రాసిన పత్రికారచయిత మేకకన్నా అమాయకుడు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక కార్యాలయం ముందు చాయ్ అమ్ముకునే సామాన్యుడు అంతులే సిమెంటు కుంభకోణం గురించి ఇన్ని కాగితాలు ఖరాబుచేయాలా అని ఆశ్చర్యపోయాడట. మంత్రులు, పాలకులు కాకపోతే మరెవ్వరు అవినీతికి, లంచగొండితనానికి, దౌర్జన్యానికి పాల్పడే అవకాశమున్నదీ అన్నది సామాన్యుని సందేహం.)

కారణాలు ఒకటికాదు చాలవున్నాయి, బీహార్ ప్రెస్ బిల్లు రావడానికి. రైల్వే సమ్మె, బీహార్ అసెంబ్లీ వ్యతిరేక ఉద్యమం, భోజ్‌పూర్ రైతాంగ పోరాటం - బీహార్‌లోని వర్గవైరుధ్యాలకు, వర్గసంఘర్షణలకు అస్పష్టాస్పష్ట వ్యక్తీకరణలే. జైళ్ళలో చిత్రహింసలు, కళ్ళుపీకించడాలు, రైతాంగంపై భూస్వాముల పోలీసుల

దారుణమారణకాండ-పై ఉద్యమాలకు ప్రభుత్వం చూపిన ప్రతిక్రియ ఈ పోరాట-అణచివేత చరిత్రను ప్రతిస్పందించాయని చెప్పకున్నా ఒకమేరకు దేశానికి అందించాయి పత్రికలు. ముఖ్యంగా బీహార్ జైళ్ళలో ఖయిదీలపట్ల ప్రభుత్వ దమననీతి, ఖయిదీల దయనీయస్థితి, భగల్పూరు ఖయిదీల నేత్రహింస- దేశవ్యాప్తంగా ప్రజలు దిమ్మెరపోయి ధిక్కారం ప్రకటించే స్థాయిలో పత్రికలు బయటపెట్టాయి. ఇది ఏ ప్రభుత్వాన్నయినా ఇబ్బందిపెట్టే విషయమే. అసభ్యకరమైన నిందాపూర్వకమైన వార్తలు ప్రకటిస్తే ప్రకటనకర్త, రచయిత, విక్రేతలను అరెస్టుచేసి శిక్షించేహక్కును బీహార్ ప్రెస్‌బిల్లు ఇప్పుడు ప్రభుత్వానికిస్తున్నది. ఈ బిల్లును బీహార్ అసెంబ్లీ అర్ధరాత్రి ఆమోదించింది. (మనకు "స్వాతంత్ర్యమూ" అర్ధరాత్రి వచ్చింది. పత్రికా "స్వాతంత్ర్యమూ' అర్ధరాత్రి పోయింది) ఇదివరలో ఖయిదీల కళ్ళుపొడిచిన ప్రభుత్వం ఇప్పుడీ బిల్లుద్వారా ప్రజల కళ్ళు పొడుస్తున్నది.

ఏది అసభ్యకరమైన వార్త ? ఏది నిందాపూర్వకమైన వార్త ? అన్నదానికి జగన్నాథమిశ్రా ఒక స్థానిక పత్రికరాసిన యజ్ఞంలో మిశ్రా రక్తంలో స్నానం చేసాడన్న వార్తను ఉదహరించాడు. ఈ పనిచేస్తే అసత్యంకానిది రాస్తే అవుతుందా ? చేయకపోతే పత్రికమీద పరువునష్టం దావావేయవచ్చు. అబద్ధమని నిరూపించి శిక్ష వేయించడానికి నేరశిక్షాస్మృతిలో ఎన్ని చట్టాలున్నాయి. ఈ బిల్లు ప్రవేశపెట్టడానికి ముందే పత్రికారచయితలను, ప్రచురణకర్తలను అరెస్టు చేయడానికి వీలుగా నేరశిక్షాస్మృతిని కూడ సవరించాడు జగన్నాథ మిశ్రా.

అయితే ఇది బీహార్‌కే పరిమితమైన సమస్యకూడకాదు. ఇంతకన్న క్రూరమైన చట్టాలతో ఎమర్జెన్సీలో ఇందిరా గాంధే పత్రికల నోళ్ళుమూసింది. కళ్ళముందు కనిపించే వార్తల్ని ప్రచురించడానికి వీలులేదని ఎప్పటికప్పుడు తాఖీదులుపంపుతూ కలాలు విరిచేసింది. పత్రికలోకి వెళ్ళాల్సిన ప్రతి అక్షరం ప్రభుత్వం కత్తెరనుంచి ఈగిపోవాలని ఆంక్షలుపెట్టింది. నిజంతెలుసుకోవాల్సిన ప్రజల మౌలికహక్కును నిర్దాక్షిణ్యంగా కాలరాచిదేశ వ్యాప్తంగా విపరీతంగా నీలివార్తలు ప్రచారంకావడానికి దోహదంచేసింది. ప్రజాచైతన్యం భయం, జుగుప్స, ఆందోళనవంటి తప్పుడు చైతన్యాలకు లోనవడానికి కారణమైంది. ప్రజల మనసుల్ని వికలంచేసి, శూన్యాన్నో హైన్యాన్నో, దైన్యాన్నో ఆ మనసుల్లో పూరించడానికి ఆ నియంత తానుచేయగలిగినంతా చేసింది. ఎమర్జెన్సీ తొలగిపోయి ఆ నిర్బంధాన్ని దేశవ్యాప్తంగా కేంద్రీకృతంగా అమలుచేయకపోయేవరకు ఇపుడు నిర్బంధాన్ని వికేంద్రీకరిస్తున్నది. కాశ్మీరు,

తమిళనాడు, బీహార్ మొదలైన రాష్ట్రాలద్వారా ఒక్కొక్కరాష్ట్రంతో ఒక్కొక్క నల్ల చట్టంద్వారా ప్రజాస్వామ్యహక్కుల్ని హరించడానికి కుట్రచేస్తున్నది. అందుకే బీహార్ ప్రెస్‌బిల్లు బీహార్ పత్రికల సమస్య మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా పత్రికలన్నిటిపాలిటి సమస్య అంటే ప్రజలందరి సమస్య.

అయితే పత్రికాస్వాతంత్ర్యం ఎవరికి? నిర్వహించే గుత్తాధిపతులకా? పత్రికా రచయితలకా? ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం ఈఅంశాన్ని ఫోకస్‌చేసి ఇవ్వాళదేశంలో పత్రికలన్నీ గుత్తపెట్టుబడిదారుల చేతుల్లోఉన్నాయిగనుక పత్రికాస్వాతంత్ర్యంఅంటే వాళ్ళస్వాతంత్ర్యమేనని, దానికొరకు గగ్గోలుపెట్టేవాళ్ళు అభివృద్ధి నిరోధకులని నమ్మించచూస్తున్నది. నిజమే. పత్రికా రచయితలకు పత్రికా యజమానులు స్వేచ్ఛ నివ్వడంలేదు. ఎక్కడా ఏచట్టంలో హరింపబడనప్పటికీ అలిఖిత రాజీవాదాన్నో, నిర్బంధాన్నో సంపాదకుడుమొదలు ప్రతిపత్రికారచయితా అనుభవిస్తూనేవున్నాడు దేశంలోని పత్రికలన్నీ పత్రికాయజమానుల ప్రయోజనావాహకాలు తప్ప వార్తాపత్రికలుకావు. చిత్తశుద్ధితో వార్తాపంపించడానికి ఛబీరాణివంటి వాళ్ళ మానభంగాలకు, ప్రాణభంగాలకు గురియయితే గ్రామీణ పత్రికారచయిత కావ ప్రకటనా స్వేచ్ఛనుకాపాడడానికి ఆయాపత్రికల యజమానులు ఏ భద్రతాచర్యలు తీసుకుంటున్నారన్నది సందేహమే.

అధికారంలోవున్న పాలకవర్గాలకు అమ్ముడుపోవాల్సిందిగా తమ ప్రయోజనాల దృష్ట్యా పత్రికారచయితలకు ఆదేశాలిస్తున్నవాళ్ళే పత్రికా యజమానులంతా. అయితే ఇవేవీ 'పత్రికాస్వాతంత్ర్యం' బూటకం కనుక పత్రికాస్వాతంత్ర్యం గురించిమాట్లాడి ప్రయోజనంలేదనే వాదానికి మనసునెట్టకూడదు. ప్రెస్‌బిల్లుతెచ్చి లేదా ఎమర్జెన్సీపెట్టి ప్రభుత్వం ఈగొలుసు పత్రికాయజమానుల స్వాతంత్ర్యాన్ని అరికట్టి పత్రికారచయితలకు స్వాతంత్ర్యాన్ని ఇవ్వదల్చుకున్నదా? పత్రికారచయితల స్వాతంత్ర్యాన్ని యజమానులనుంచి కాపాడే నిజమైనప్రేమతో ప్రభుత్వం ఈబిల్లుతెచ్చిందా పత్రికాయజమానులకు ఫోన్‌లుచేసి ఫలానా పత్రికారచయితను తొలగించుఅని ఎన్నిమార్లు ఎన్ని ప్రభుత్వాలఅధికార్లు తమపలుకుబలాన్ని ప్రదర్శించలేదు. ఎన్నిమార్లు ఆ ఆజ్ఞలను శిరసావహించి పత్రికారచయితలను బలిపెట్టి యజమానులు తమప్రభుత్వ విధేయతను ప్రకటించుకోలేదు, కనుక సమస్య పత్రికారచయితకో యజమానికో స్వాతంత్ర్యం అనేదికాదు, సమస్య- ప్రజలకున్న వార్తల్ని తెలుసుకునే స్వాతంత్ర్యం వార్తాపత్రిక యజమానికి లాభాలను, ఉద్యోగికి జీవనోపాధిని ఇవ్వడానికేవుండవచ్చు కాని ప్రజ

ఎకు వార్తలనివ్వడానికి వున్నది. ప్రజలకు విజ్ఞానవికాసాలనివ్వడానికి వున్నదనేమాట పెద్దదికావచ్చు. కాని కనీసం సమాచారం ఇవ్వడానికివున్నది. ప్రజలకుండే ఈ హక్కును ప్రజలు ముందుగా ముక్కుమీదగుద్ది గుర్తుచేయాల్సింది ప్రభుత్వానికి. ఎందుకంటే ప్రభుత్వం ప్రజలక్షేమాన్ని ఆలోచించికాక ప్రజలనుంచి తనక్షేమాన్ని ఆలోచించి నల్లచట్టాలుతెస్తుందిగనుక. ఈహక్కుకోసం పత్రికాస్వాతంత్ర్యంసాధించే ఆందోళనలో ఉద్యమంలో ప్రజలు పాల్గొంటున్నారంటే పత్రికా యజమానులకు ఏదివార్త ఏదికాదనే విచక్షణను వినియోగించాల్సిన బాధ్యతను గుర్తుచేయడానికేఅని గుర్తించాలి. ప్రజావ్యతిరేకవార్తల్ని ప్రచురించిన పత్రికలకు ఎప్పుడూకాకున్నా ఎప్పుడయినా ఒకసారి ప్రజలు బుద్ధిచెప్పిన సంఘటనలు లేకపోలేదు. అసభ్యకరమైన, నిందాపూర్వకమైన, కవ్వించేరచన వెంటనేఆకర్షించి ప్రగల్భానికో ప్రలోభానికో ప్రేరేపించవచ్చుగానీ అదివార్తకాదని, అది పత్రికా రచనకాదని, అన్నిటికంటే నిరలంకారంగా, నిరాడంబరంగా వుండేనిజం నిజమైనవార్తఅని పత్రికారచయితల చేత గుర్తింపచేయడానికే ప్రజలు పత్రికాస్వాతంత్ర్యంకోసం పోరాడాలి.

పత్రికలను సెన్సార్‌చేసే అధికారం ప్రజలది. ప్రభుత్వాలదికాదు. ప్రభుత్వాన్ని సెన్సార్‌చేసే, సెన్సూర్‌చేసే (కత్తిరించే, దించే) అధికారంకూడ ప్రజలదే అనేవిషయాన్ని ప్రతిక్షణం ప్రజలు ప్రభుత్వాలకు గుర్తుచేస్తేతప్ప ఒకసారి యాసిడ్‌తో మరొకసారి ప్రెస్‌బిల్లుతో మనల్ని గుడ్డివాళ్ళనుచేయాలని చూస్తుంది ఈ అధికార దుర్మదాంధ ప్రభుత్వం.

1-9-82 — సంపాదకుడు

బీహార్ ప్రెస్‌బిల్లుప్రకారం ఎవరైనా అసభ్యకరంగా, వ్యక్తులగౌరవాన్ని కించ పరిచేవిధంగా వార్తాపత్రికలలో లేదా మాస, పక్ష, వారపత్రికలలోగాని లేదా సర్క్యులర్ రూపములో అచ్చువేసినగాని అచ్చువేయడానికి కారకుడైనగాని లేదా ప్రజలదృష్టిలోపడు నట్లు ప్రదర్శించినగాని లేదా ప్రదర్శించడానికి కారకుడైనగాని, పంపిణీచేసినగానీ, పంపిణీచేయడానికికారకుడైనగాని ఏదేనిచిత్రము గీసినగాని లేదా ఏదేనిప్రింటుచేసినగాని లేదా ఏదైనా వ్రాతపూర్వకమైన డాక్యుమెంటునుగాని, ఏరూపంలోనైనా చలామణిలో ఉంచినట్లయితే అతన్ని మొదటినేరస్తునిగా పరిగణించి రెండుసంవత్సరముల జైలుశిక్ష లేదా జరిమాన లేదా రెండింటిని విధించవచ్చు. ఈబిల్లుక్రింద అరెస్టుఅయితే బెయిలుపై విడుదలకారాదు. కుటుంబవ్యక్తులకు తెలుపకుండాకూడ అరెస్టుచేయవచ్చు. ఈ బిల్లు ననుసరించి ఏదేనిజర్నల్ ఎక్కడప్రింటుచేసినగాని బీహారు చేరుకున్నట్లయితే అందులో విమర్శించినవారిని నేరస్తులుగాభావించి భారతదేశంలో ఏభాగంలోఉన్నా అరెస్టు చేయవచ్చు. ఆ నేరము బీహారురాష్ట్రంలోనే నమోదు చేయబడును.

తీర్మానం

కె. రాంమోహన్‌రాజు

రామయ్య షావుకారు సంతృప్తిగా తలాడించాడు వేలిముద్రవేసిన నర్సయ్యను చూసి. అతని తమ్ముడు వెంకన్నగూడ పక్కనేవున్నాడు. వాండ్లచేతిలో వెయ్యి రూపాయలు పెట్టి

"సరీగ్గ ఏంచుకోండ్లి అందరిముందచ్చే" అన్నాడు. మెత్తటి పరుపులమీద కూచున్న రామయ్యషావుకారు పెద్దకుండమీద చిన్నకుండ పెడితే ఎలావుంటుందో అలావున్నాడు. మెడలో ఎర్రదారానికి వేలాడుతున్న తెల్లని వెండి లింగంకాయ బొర్రమీద అని విశ్రాంతి తీసుకుంటోంది. చెవితమ్మెలకు రెండుపోగులు. నుదుట అడ్డంగా విభూతిపెండెకట్లు, బోడిగుండు.

అతని ఎదురుగా బండారు నర్సయ్య, వెంకన్న లిద్దరూ నిలబడి రూపాయలు లెక్కబెట్టుకుంటున్నారు. ఇద్దరూ అన్నదమ్ములు రైతులు ఆరెకరాల పిత్రార్జితపు మాగాణివున్నది. తాతలనాడు కట్టిన పెంకుటిల్లు ఒకటీ, ఈమధ్యనే దానినానుకుని కట్టిన రెండు నిట్టాళ్లగడ్డికప్పుగుడిసే వాళ్లఆస్తి. అదంతా ఉమ్మడిఆస్తే. నర్సయ్యకి యాభై ఐదేళ్లా, వెంకన్నకి నలభైఏళ్లావచ్చినా వాండ్ల పిల్లలు పెళ్ళీడుకి వచ్చినా కలిసే ఉంటున్నారు వేరుపడటం వాళ్లవంశంలోనే లేదు. ఇప్పుడు విత్తనాలకీ ఎరువులకీ అవసరమై షావుకారుదగ్గర అప్పుతీసుకుంటున్నారు. ప్రామిసరీనోటుమీద సంతకం నర్సయ్యదే ఐనా అప్పుతీర్చే బాధ్యత అన్నదమ్ములిద్దరిదీ.

అగడిలోనే పక్కకు పెద్దబల్లమీద పట్వారీ వెంకటేశ్వర్రావు, మాలీపటేలు నర్సరాజు కూచునివున్నారు. ఇద్దరికీ కోరమీసాలు, జులపాలజుట్లూ. ఇద్దరి మొహాల మీదా తిరుచూర్ణం నామాలున్నాయి.

నర్సయ్య వెంకన్న లిద్దరూ డబ్బు లెక్కపెట్టుకుని "సరీగనే ఉన్నదయ్యా" అని చేతులుజోడించి దండంపెడుతూ "ఇగ సెలవిస్తరా?" అని షావుకారినీ, పటేలు పట్వారీలనీ కలిపిఅడిగారు. షావుకారు తలవూపి "పోండ్రి ఇంకేంది? పైసలు చేతులబడె అగుతరా?" అన్నాడు చమత్కారంగా మాట్లాడుతున్నాననుకుని. ఆ చమత్కారం చదువురాని రైతులకి అర్థంకాక బయటికినడిచారు నవ్వకుండానే, వాండ్లు వెళ్ళిపోగానే పట్వారీ వెంకటేశ్వర్రావు అన్నాడు.

"షావుకారీ! నీపనంత అయిపోయేదాక మమ్మలనిట్నే కూసుండబెడ్తవా?"

షావుకారు చిరునవ్వునవ్వాడు. "తొందరెందుకండీ పంతులుగారు! మనం జర నిమ్మలంగ మాట్లాడుకుందామని మిమ్మల ఆపినగని- నాకేంసంబురమా?" అన్నాడు.

"తొందరగ వ్యవహారం పైసలజెయ్యి మేం బోవాలె" సర్పరాజు చిరాగ్గా అన్నాడు.

"సరె జెప్పుండ్లి ఏంజెయ్యమంటరు?" షావుకారు సర్దుకునికూచుంటూ అన్నాడు.

"మమ్మల అడుగుతున్నావేమయా? పనినీదామాదా! పట్టకాయితాలు తయారు గావాల్నంటె ఖర్చుగాదా. తహసీల్ దఫ్తర్‌ల నీ సుట్టమున్నడనుకుంటానవా? మూడు వెయిల ఖర్చున్నది. ఇగ ఆతర్వాత మాకిచ్చేది ఏమిస్తవోఇయ్యి. వట్టిగనే అయితయా పనులు?" వెంకటేశ్వర్రావు అన్నాడు.

షావుకారు మిడిగుడ్లువేశాడు "మూడువెయిలా?"

"ఏమయో నోరుదెరుస్తున్నవు? పావుతక్కువ పదెకరాలు జమీన్‌దొబ్బుకుంట మూడువెయిలు ఖర్చుబెట్టమంటె పాణంబోతున్నది! అదే జమీను కొంటె ఎంతయితదో ఎర్కేనా?"

"పైసలున్నప్పుడుగద కొనబొయ్యేది. గిప్పుడు ఈ పైసల్లేనికాలాన గంతరఖం నేను యాన్నుంచిదేవాలె?"

వింటున్న సర్పరాజుకి చిరాకు ముంచుకొచ్చింది. "సరె- ఈమాటజెప్పటం కోసమేనా రొండుగడియల్నుంచి కూసుండబెట్టినవు. లేకిముండకొడుకులొరిగినట్టు ఊకె పైసల్లేవు పైసల్లేవుఅని ఎందుకయా అంటవు? నీదగ్గరేమున్నదో ఎంతున్నదో మాకెర్కలేదా? నీకు ముద్దిలేస్తున్నదాలేదా జెప్పరాదు! అదే బూమి ఇంకోనికి దఖల్‌జేస్తె మాకుపైసలురావా?" కోపంగాఅన్నాడు.

షావుకారు పరుపుమీదినుంచి కొంచెంముందుకు వంగబోయాడు కానీ బొర్ర ఉండటంవల్ల వీలుకాలేదు. వీలైనంతవరకేవంగి రెండుచేతులు జోడించి "అయ్యా కోప్పడకున్రి. ఎర్రికోమటోనిమీద ఎగిరేంలాభం! నేనొక్కటంట కోపంరాదుగద" అని సర్పరాజు మొహంచూసి కోపంరాదని నిర్ధారించుకున్నట్టు మళ్ళీఅన్నాడు. "అది మాగానిభూమిఐతె మీరన్నట్టు మూడువెయిలుగాదు పైన ఇంకో పదిరూపాయలు

కర్చయినా ఫికరులేదు. అదికెలుకభూమి, ఎక్కన్నో శివార్లల్లఉన్నది. దాన్నిండ తుప్పలున్నయి, రొండుమూడు రాళ్లమిట్టలున్నయి. అవన్ని తర్వాత సాపుజేయించుకోవాలెగద, నీటిపారుతం లేనేలేదాయె. బాయిదీపియ్యాలె. ఇసుమంటి దానికి ఇంత ముల్లె బొయ్యాల్నా ? న్యాయంజెప్పుని. మీరుగనుక న్యాయమంటె అన్నంతఇస్త. ఇయ్యకపోయినా నా కెవ్వలుబిండి తీస్కపొయ్యే అజాదు మీకున్నది. మనమేం ఇయ్యాల గలిసినోల్లంగామ. మంసోపతి- మనయవారాలు మీకు దెలువకుంటెగద నేను జెప్పాలె"

వెంకటేశ్వర్రావు నర్సరాజు మొహంచూశాడు, నర్సరాజు కోపానికొచ్చాడు

"ఈ ఇచ్చకాలు బందుజేసి అసలుసంగతి మాట్లాడు. లేకుంటెఊకో. నీతోటి కానివోనిమాటలు మాట్లాడుకుంట కూసుంటానికి మాకేం పనిలేదనుకున్నవా ?" అని లేచి "నడవవయ్యపోదాం ! పీసుకోమటోనితోటి ఏందిముచ్చట్లు ?" అన్నాడు వెంకటేశ్వర్రావుతో.

షావుకారు గబుక్కున కొండమీంచి రాయిదొర్లినట్టు లేచినిలబడి గుమ్మాని కడ్డం నిలబడ్డాడు. గుమ్మంనిండా షావుకారే నిండుకోవటంవల్ల నర్సరాజుకి సందులేక ఆగిపోయాడు. షావుకారు నర్సరాజు చేతులుపట్టుకుని "అయ్యా మీరుపెద్దలు. కులం లోనైతేనేమి, అధికారంలోనైతేనేమి తమరు నాకన్న మించినోళ్లు. మీముందట నాతెలివెంత? నామీద మీకోపంవస్తె నేనుబతుకుతనా ? ఇప్పుడేమికార్యమో సెల వియ్యుని. చెయ్యకపోతె అడుగుని" అన్నాడు.

"మరైతె మూడువెయిలిస్తవా ?" వెంకటేశ్వర్రావు అన్నాడు.

"మీరు తప్పదంటె అట్లనేఇస్త"

"ఇయ్యమనేగదనయా అనేది" నర్సరాజు విసుక్కున్నాడు. షావుకారు గుమ్మంలోంచికదిలి లోపలికి వెళ్ళాడు. నర్సరాజు మళ్లీ బల్లమీదకూచున్నాడు. పది నిముషాలైనా షావుకారు లోపల్నుంచిరాలేదు.

"ఇంకా రాడేందయ్య !" వెంకటేశ్వర్రావు చిరాగ్గా అన్నాడు.

"పైసలియ్యాల్నంటె ప్రాణంబోతున్నది వీణికి" నర్సరాజు అన్నాడు.

"ఐనా మరి మనకు వీణితోని పనివున్నదిగద. కొంచెం ఓపికగుండాలెగని ఉకుకులు పెడితె ఎట్లనయా ?" వెంకటేశ్వర్రావు నర్సరాజుని మందలించాడు.

"ఆఁ పమన్నదని గౌరవం బోగొట్టుకుంటమా? ఊళ్లైమనలగాదని వీడేం జేస్తాడు?" నర్సరాజు కోరమీసంమీద చెయ్యివేశాడు. లోపల్నుంచి షావుకారు డబ్బు తీసుకునివచ్చాడు.

"ఆ పరమశివునికి గూడ ఇష్టమే ఉన్నట్టున్నది ఈ ధర. గల్లాల సరీగ్గమూడు వెయిలే ఉన్నయి." అన్నాడు డబ్బు నర్సరాజుకిస్తూ.

"మరి మా సంగతేంది?" వెంకటేశ్వర్రావు అన్నాడు.

"పనిగానియ్యవిర్రి మీసొమ్ము నేమంచుకుంటనా?" అన్నాడు షావుకారు.

* * *

బండారు నర్సయ్యకు అకస్మాత్తుగా ప్రాణంమీదికి ముంచుకొచ్చింది. అతనికింతకుముందు ఏజబ్బూచేసిందిలేదు. ఈరోజు తెల్లారేసరికే హఠాత్తుగా ఈఉపద్రవం వచ్చిపడింది. మనిషి మంచందిగి రెండడుగులు వేసినవాడల్లా అమాంతం విరుచుకుని పడ్డాడు. కాళ్లూ చేతులూ కొంకర్లుపోయాయి. అందరూ ఏమయింది ఏమయిందని హడావిడి చేసేలోపలే మనిషి విలువుగుడ్లువేశాడు. నోటివెంట సన్నసిధారగా చొర్లు కారుతోంది. అదరా బాదరా పడుకోబెట్టి మంచినూనెతెచ్చి కాళ్లకీ చేతులకీ రాసి మర్దనా చేశారు. కండరాలు పామిసతిచేశారు. అప్పటికి గూడా లాభంలేకపోయింది. కొంకర్లు తిరగటం ఆగిపోయిందిగాని కాళ్లచేతులు పడిపోయాయి. గురకలాంటి శ్వాసతప్ప మనిషిలో చలనంలేదు. నాటువైద్యుడువచ్చి నాడిచూసి "ఇంకో గంటో గంటన్నరో" అన్నాక ఇంటిముందు గడ్డిపరిచి దాన్లో చాపవేసి నర్సయ్యను పడుకోబెట్టారు.

ఉదయం పదిగంటలు దాటింది. ఎండ చింతచెట్టునీడని చీల్చుకురావాలని ప్రయత్నంచేస్తోంది. ఆనీడన చల్లగాపడుకున్న నర్సయ్యకళ్ళు గాజుకళ్లపడ్డాయి. పైకి విశాలాకాశంలోకి చూస్తున్నాడు. చింతచెట్టు జాలిగా అతనిమీదికి వంగింది. ఇంటిముందు నడుంఎత్తున్న రాళ్ళగోడఅవతల ఊరిజనం నిలబడిచూస్తున్నారు. పరిచయస్తులూ, ఊళ్ళోనిబంధువులూ నర్సయ్య మరణశయ్యచుట్టూ కూచున్నారు. తమ్ముడు వెంకన్న చేతులుకట్టుకుని నిశ్శబ్దంగా కన్నీళ్ళుకారుస్తూ కాళ్ళవైపు నిలబడి అన్ననిచూస్తున్నాడు. ఇంటివసారాలో ఆడవాళ్లూ పిల్లలూ గట్టిగాఏడుస్తున్నారు ఒకళ్ళనొకళ్ళు కావిలించుకుని. నర్సయ్య మరణశయ్యమీద ఏంఆలోచిస్తున్నాడో తెలీదు. అతడికి అసలు ఆలోచించేశక్తివుందో నశించిందోగూడా తెలీదు. కానీ ఆలోచిస్తే, మాత్రం ఇంకా పెళ్ళిళ్లకాని ఆడపిల్లలగూర్చి, వంశంలో మొట్టమొదటిసారి షావుకారు

దగ్గరచేసిన వెయ్యిరూపాయల అప్పుగూర్చి, తాను జీవితంలో సాధించాలనుకుని సాధించలేకపోయిన అనేక విషయాలగూర్చి ఆలోచిస్తూవుంటాడనేది సత్యం.

ఆ సమయంలో షావుకారురామయ్య అక్కడికి వచ్చాడు. అతడిచేతిలో దస్త్రం వుంది. అతన్ని అక్కడచూడగానే కొందరు అసహ్యించుకున్నారు.

"గీ సావుదగ్గరికి ఏడెందుకు వచ్చిండు ?"

"పైసలు బాకీవున్నడుగద నర్సయ్య- గందుకె నేమో !"

"వాడేసత్తాంటె వీనికేమిత్తడు ?"

"వానిదగ్గరేమున్నయి బల్లకాయలా ? నీయక్క దయ్యపుకొమటోడు సావు దగ్గరికి ఎమకింకరునోలెనే వచ్చిండు"

షావుకారు వినపడీ వినపడనట్టున్న ఈ మాటల్ని లెక్కచెయ్యలేదు. అక్కడ వున్నవాళ్ళంతా తనదగ్గర అప్పుతీసుకుని పత్రాలు రాసినవాళ్లే అందువల్ల తననెవ్వరూ పైకేమీ అని శత్రుత్వం కొనితెచ్చుకోరని అతడికితెలుసు. పరిస్థితి మరీ విషమిస్తే తొకముడవటం అతని పాలసీ.

వాకిట్లో ఆగి అందర్ని కలయజూశాడు షావుకారు. ఎవరూ ఆతన్ని పలకరించ లేదు. నర్సయ్యను పడుకోబెట్టినవైపు నడిచాడు. కాస్త అడ్డంగావున్నవాళ్ళు జరిగి దారి ఇచ్చారు. అతనిరాక వెంకన్నకి ఎందువల్లో భయం కలిగించింది.

అచేతనంగా పడివున్న నర్సయ్యను చూడగానే షావుకారుగుండె గుభిల్లుమంది. తనపైకం మునగదు గదా ! అనుకున్నాడు. ఇది ఉమ్మడికుటుంబ వ్యవహారం. పెద్ద వాడుకాస్తా గుటుక్కుమంటే వాడిమీన పెట్టినదంతా చిన్నవాడు ఇస్తాడోలేదో ! కాగితం మీద సంతకం తీసుకున్నాడుగాని జమానతు ఏమీలేదు. ఇప్పుడు ఎలాగైనా జుట్టు గుప్పిట్లోకి తీసుకోకపోతే ముందు ముందు కష్టం. వెంకన్నవైపు చూశాడు. నీళ్ళు నిండిన కళ్ళతో అన్నవైపు చూస్తున్నాడు.

"అయ్యో సూడువొరి. మాకున్న పెద్దదిక్కు దూరమైతాంది. ఎట్లయిపొయిందో సూశినావ్రి ? తెల్లారెటాల్లకు గిట్లతయారైండు ఇగ మాకెవడుదిక్కు ?" నర్సయ్య భార్య పీరమ్మ గోలుగోలున ఏడ్చింది షావుకారుని చూసి.

షావుకారు ఆమెని చీదరింపుగాచూసి నర్సయ్యవైపు విచారంగా చూస్తూ "ఇగ బతుకుడు అబద్దం" అన్నాడు వెంకన్నతో. వెంకన్న విచారంగా తలూపాడు. షావు కారు ఉస్సురని నిట్టూర్చి "పిలిస్తె పలుకుతాండా ?" అన్నాడు.

"పలుకుడులేదు ఏంలేదు. సూష్ణజాత్తాండుగంతే" ఎవరో అన్నారు. షావుకారు కళ్ళు వెలిగాయి. గొంతుసవరించుకుని "నర్సయ్యా"అని పిలిచాడు. నర్సయ్య గాజు కళ్ళు షావుకారువైపు తిరిగాయి. ఆకళ్ళలో షావుకారునీడ పడగెత్తిన పాములా ప్రతి ఫలించి నర్సయ్య మొహంమీద భయంలాపరుచుకుంది. ఇక ఆలస్యంచేస్తే లాభం లేదని షావుకారు వెంకన్నని పక్కకి పిల్చాడు.

"ఇగో- నన్ను కఠినం ముండకొడుకనుకో, పీనుగాడ్డికొడుకనుకో, నువ్వే మన్ననుకోగని- మీఅన్న సూడబోతె జీవినిలిచెటట్టులేదు. నేనా పైకంఇచ్చికూసున్న. ఖరీఫ్ పంటలమీద ఇస్తనన్నపైసలు మల్ల రబ్బీపంటలు లాబోతానయి ఇంతవరకు జాడలెవ్వు. వడ్డీతోటిగలిసి అడ్డికి పావుశేరుఅయినయి. మీరా సూడబోతె విరుబడని సంసారం. మీఅన్నబోతె పరిస్థితి ఎట్లుంటదోఏమో! ఇంటికి పెద్దోనితోని ఒక్క ముద్ర కాయితంమీద ఏపిచ్చుకుంటె నాకునిచ్చింత. ఇగో- కాయిదం. ఇక్కడనువ్వు ముద్రెయ్యి. ఇక్కడ నర్సయ్యతోని ఏపిచ్చు" అన్నాడు.

వెంకన్న నిర్ఘాంతబోయాడు. వచ్చినవాడు మనిషా- యముడా? అవతల అన్నచావుబతుకుల్లోవుంటే కాగితంమీద వేలిముద్ర అంటాడేమిటి! చచ్చేమనిషిని గూడా వదలకుండా కాగితంమీదముద్ర వేయించుకోవటం ఎక్కడైనావుందా? కోపంతో ఒళ్ళుతెలియలేదు అతనికి.

"ఏమయ్యా సావుకారీ, పొద్దున్నే కల్లుగిల్ల తాగివచ్చినవా? ఎటువంటి సమయంల ఏం మాట్లాడుతావవు? ఇక్కన్నుంచి పోముందుగాల. ఏదో సూశి పొయ్యేటానికొచ్చినవనుకున్నగని గిందుకొచ్చినవనుకోలే. నీబాకి యాడికిపోదుగనిపో. తీసుకున్నంక ఇయ్యకబోతమా మాఅన్నతీస్కుంటేంది, నేనుతీస్కుంటేంది? పోపో" అన్నాడు.

షావుకారు ఈ మాటలకి చలించలేదు. అతడిలాంటివి ఎన్నోచూశాడు.

వెంకన్న అరుపులకి దూరంగా ఉన్నవాళ్ళు కొందరు దగ్గరికొచ్చి నిలబడ్డారు. షావుకారు వాళ్ళలో ఇద్దరిని సంబోధిస్తూ అన్నాడు.

"సూశినావయ్య బాలయ్యా! నువ్వుగూడ ఇను గోపయ్యా! వీండ్లకు పెట్టుబడి పెట్టిన. తీసుకున్నోడు సచ్చిపోతాండు. ఉన్నోడు తిరుగబడితె రేపునాగతేం గావలె? గందుకే గీ కాయితంమీద గింత ఏలు ఒత్తుతె నాతొవ్వల నేనుబోత. నీకుదీరినప్పుడే ఇయ్యవచ్చు. పైసలు నేనిప్పుడే ఇయ్యమంటలేనుగద. ఇప్పుడు గీద గింత ముద్ర

ఏత్తె నాతొవ్వల నేనుబోతి. ఏమున్నదిదీన్ల ? లొల్లిబెట్టి కోమటోడు లావటోడని బదునాంజేసుడు దప్ప!"

విషయం అందరికీ అర్థమయింది. కానీ ఇంత అన్యాయాన్ని సహించటం వారికి చాతకాలేదు. అందుకే గోపయ్య అన్నాడు.

"సావుకారీ! నీగ్గూడ గింతనన్న ఇదుండాల్నయా. అప్పతల ఇంటికి పెద్దోడు అందర్ని ఎడబాశిపోతాంటె గిటువంటప్పుడు నువు నిశాని బెట్టుమనుడు ఏమన్న బాగున్నాది ?"

షావుకారు గోపయ్యని వంకర చూపుచూశాడు. అతనుగూడా తనదగ్గర అప్పు తీసుకున్నాడు. ఆ విషయం గుర్తుచేద్దామని "గోపయ్యా నువుగూడ గట్లమాట్లాడుతె ఎట్లజెప్పు ? నేనంత కవికారం లేనోన్నా ? ఆనాడు నువు నాదగ్గెరకొచ్చినప్పుడు మారు మాట్లాడకుంట, జమానతుగూడ లేకుంట వట్టిసంతకం పెట్టిచ్చుకోని పైసలిస్తిగద! వస్తువుబెట్టుమన్ననా ? జాయిదాదు బెట్టుకుంటనన్ననా ? కాయిదంమీది గీతలు ఎవరి అవుసరాలెటువంటియోనని సూశే ఇచ్చినగని ఇంకేమన్న ఉన్నదా ?" అన్నాడు.

గోపయ్య ఏమీ అనకముందే మళ్ళీ సాగించాడు "ఇన్నిరోజులు నర్సయ్యను నేను పైసలడిగిన్నా ? వాయిద దాటిపొయినాగూడ వడ్డిచెల్లగట్టుమని గూడ అడుగలాలే ఇప్పుడు కాయం దాటిపోతాంది గనుక నాకింత బాద. నాకు బాదుంటదా లేదాచెప్పుండ్రి. బాత తండుర్లిబు ఇచ్చిపోయిన పైకం. దాన్ని కాపాడి మల్లఅవుసరం ఉన్నోనికి ఇచ్చి వాని అవుసరం ఎల్లదియ్యాల్నా వద్దా! ఊరంత సావుకారు సావుకారని ఏఅవుసర మచ్చినా నామీద పడ్తడు. నాపైసలేమొగిల్ల తలుగబడుతయి మీరేజెప్పుండ్రి న్యాయం"

వెంకన్న అన్నాడు "సావుమక్కంల మేముంటె నీ లామాండమేంది ? మా బండారోల్ల వంశంల పైసలెగ్గొట్టినోడెవ్వడు ఇంతవరకూలేడు. చెయ్యక చెయ్యక నీదగ్గర జన్మల మొదటిసారి అప్పుజేత్తె ఈ రకంగ గొంతుమీదకూసుంటావు ? ఇంత మందిముందట జెప్తానగద, నీపైసలు నేనయినా తీరుత్తగని ఇగపో."

షావుకారు పట్టువిడువలేదు. "నీమీద నమ్మకంలేకనా నేనుచచ్చింది. యవ్వారం అన్నంక నోటిమాటలతోటి జరుగుద్దా ? నువ్వన్న గామాటే గీ కాయిదంల రాశిపున్నది. గాడగింతంత ఎబుటత్తరాదు. అయిపాయె మీ వంశంసంగతి నాకు దెల్వదా! దర్మరాజువంశం. మిమ్ముల అనుమానిస్తె నేను పాపంలపడిపోనా ? ఇసుమంటి టయింల వచ్చుడు నాకు సంబురమా ? నేను ఎంతబాదపడుకుంట అనారాయణునికెరుక" అంటూ మళ్ళీ కాగితంఅందించాడు.

చుట్టూవున్న వాళ్లు ఎవళ్ళకివాండ్లే మధనపడుతున్నారు.

"గిసుమంటిదెక్కడన్న జూశినమా. గిదేంపంచాయిది?"

"అరే గీ కోమటోన్ని బొక్కలిరుగదన్నాలారి. ఏమొ లావునకొరిలుజేత్తాండు"

"ఎహె నోరుముయ్యి. వానికినపడగల్ల. కోపంతోటి ఏదన్నజేత్తడువాడు"

"ఉఁ లొట్టపీసుతియ్యి"

వెంకన్న ఏమీఅనకముందే నర్సయ్యభార్య వీరమ్మ వచ్చింది. ఆమెజుట్టు ఊడిపోయి వేలాడుతోంది. మొహంఉబ్బి కళ్లుఎర్రబడి శోకదేవతలాగావుంది.

"సావుకారీ! నువ్వు పురుగులుపడిపోతవు- నీ పైసలకోసం మా కష్టసుఖం జూడకుండ మాట్లాడ్తాన్నవు—" అందామె.

షావుకారు అందరివైపుతిరిగి "సూశినారయ్యమీరు! మొగోడు సమదానం జెప్పలేక ఆడోల్లను ఎగబెడ్తాండు నామీదికి- గిట్లేఉంటదా ముచ్చట! నేనట పురుగులబడుతనట- ఇచ్చిఅడుగబోతె గిన్నిమాటలబడాల్నా! అంత రేశం ఉంటె నా పైసలు ఉచ్చలపడెయ్యవర్రి- కడుక్కోనితీసుకుంట" అన్నాడు. చుట్టూఉన్నవాళ్ళు ఆమెని పక్కకిలాక్కెళ్ళారు. ఆడదానివి నీకెందుకు ఈ వ్యవహారాలని చివాట్లేశారు.

"నువేందమ్మా! నేనున్నగద. సూస్కోలేనా, పో" అన్నాడు వెంకన్న వదినతో.

బాలయ్య, గోపయ్య వెంకన్నను పక్కకు పిల్చారు. "ఈ కోమటోనితోటి ఇప్పుడు లొల్లెందుకు- ఏలిముద్రి ఏపియ్యరాదుర" అన్నారు.

"మీరెట్లజెప్తెతాట్రి ఈ ముచ్చట! అన్న సావుబతుకుల్లఉంటెనేను ఆ పని ఎట్లజేపియ్యాలె" అన్నాడు వెంకన్న.

"వారీ! ముందుకాలం అలోశిచ్చిచెప్తావ- ఏమి మనుసులపెట్టుకోకుంట ఆ కాయితంమీద వాడడిగినట్టు జేపియ్యి లేకుంటె రేపటికాలాన సావుకారోడు ఏంజేసినా జేత్తడు. వానిసంగతి మనకుతెల్వదా! తర్వాత సంగతి ఏమన్నయితె సూస్కుందాం మేమందరంలేమా!" బాలయ్య అన్నాడు.

షావుకారు ఇదంతా గమనిస్తూనే వున్నాడు. వెంకన్న అతని దగ్గరకువచ్చి చేయిచాపి "కాయిదం తే" అన్నాడు.

షావుకారు కాగితం గబుక్కున అందించాడు. పాముపడగలా లేచింది ఆ తెల్ల

కోర్టుస్టాంపు కాగితం వెంకన్నకళ్ళకు. అన్న మరణశయ్య దగ్గరికి నడిచాడు అతనికి దుఃఖం ఆగలేదు చేతిలోని స్టాంపుకాగితంవంకా అన్నవంకా చూశాడు. షావుకారు వచ్చి వెనకనే నిలబడ్డాడు. కళ్ళుతుడుచుకుని "యాడబెట్టాలె విశానీ" అన్నాడువెంకన్న.

"నీదిగిఢ- మీఅన్నదిగాఢ" షావుకారు చూపించాడు. జేబులోంచి పెన్నుతీసి వెంకన్న వేలికి సిరాపూశాడు.

వెంకన్న ముద్రవేశాడు. అన్నచేతినిలేపి బొటనవేలు నిలబెట్టాడు. షావుకారు దానికిగూడా సిరాపూశాడు. తమ్ముడు తనచెయ్యిపట్టుకుంటే నర్సయ్య కళ్లతిప్పి చూశాడు. ఏంచెప్పదలుచుకున్నాడోగానీ మాటకుబదులు గురకలాంటిశ్వాస ఎక్కువైంది షావుకారినీ, వెంకన్ననీ మార్చి మార్చి చూశాడు.

షావుకారు గాభరాపడ్డాడు, "జెల్దికానియ్యి"అని నర్సయ్య వేలుపట్టుకున్న వెంకన్నచేతిని కాగితంమీద అదిమాడు. వెంటనే గభాల్న కాగితం అందుకుని దప్త్రంలో పెట్టుకున్నాడు. ఏదో అనబోయేంతలోనే అందరూ గొల్లుమన్నారు.

ఆ వేలిముద్ర వెయ్యటంకోసమే ఇంకా బతికిఉన్నట్టున్న నర్సయ్య ఆ క్షణాన్నే కన్నుమూశాడు.

ఆ గోలలో షావుకారు జారుకున్నాడు. రైతులుఏదో తెలియనికోపంతో కాండ్రించి ఉమ్మేశారు. చింతచెట్టు నిర్ఘాంతపోయినట్టు నిలుచుంది.

* * *

నర్సరాజు పూజగదిలోవున్నాడు ఇంటిముందర ఎవరో కేకేశారు. "ఎవర్రా అది ?" నర్సరాజు గదిలోంచే గర్జించాడు.

"కాపుదానవోల్లు బొంచెను" వెట్టి మాదిగవాడు వాకిట్లోంచి చెప్పాడు.

"ఐతె ఏందట ? ఏంగావాలె !"

"ఏంలేదయ్య. తోట్లబండిన కూరగాయలు తెచ్చిచ్చిపోను వచ్చిన్రి" వెట్టివాడన్నాడు.

"మంచిది. అవి తీస్కోని అరుగుమీదపెట్టు" నర్సరాజు ఆదేశించి మళ్లీ పూజలో మునిగాడు. అతని పూజ పూర్తికాకముందే వాకిట్లోంచి వెట్టివాడు మళ్ళీ కేకేశాడు "అయ్యా సావుకారు రామయ్య వచ్చిండు"

నర్సరాజు పూజగదిలోంచి బయటికి వచ్చాడు. ఎదురుగా కచేరీబల్లమీద షావుకారు రామయ్య కూచునివున్నాడు. నర్సరాజు ఎర్రని పట్టుధోవతి వాడికట్టుకుని వున్నాడు. దానిమీద తెల్లపంచె అడ్డకట్టుకట్టాడు. భుజాన జంధ్యం, నుదుటిమీద తిరునామం.

"ఇప్పుడే పూజల్నుంచివస్తున్నరా ?" షావుకారు నవ్వుతూ అడిగాడు.

"ఊఁ" అని కుర్చీలోకూచుని అడిగాడు నర్సరాజు "ఏమొ ఇట్లవస్తివి ! ఏం పనిబడె ?"

షావుకారు ఇకిలించాడు "ఎహ్హెహ్హె.... ఇచ్చికూసున్నంక పనిదప్పతాది ? వసూలుకు తిరుగుడే పనమకుంటేఎట్ల ?"

నర్సరాజు గతుక్కుమన్నాడు. తానుగూడా బాకీవున్నాడు. అడబ్బు ఆదగడాపికే రాలేదుగదా! ఇప్పుడుచస్తే కాణీలేదు. ఐనా గంభీరంగా మీసాలుమెలిపెడుతూ అడిగాడు.

"ఈ ఇచ్చకాలకేందిగని అసలు సంగతిజెప్పు" "సంగతేమున్నది ? యాసంగి సంక్రాంతుర్లకు పైసలిస్తనంటిరి. మృగశిర కార్తెజొచ్చింది, ఒక్కసారి యాజ్జేద్దామని వచ్చిన" షావుకారు సూటిగానే చెప్పాడు.

నర్సరాజు షావుకారు మొహంలోకి చూశాడు, ఆ మొహంలో వినయం, భయభక్తులుతప్ప ఏమీ కన్పించలేదు. "ఔరా ! కోమటిబిడ్డనఁపిచ్చుకున్నవు" అని మనసులో అనుకుని "అనుకోంగనె పనులైతయా ? చెయ్యిసాపుకొంగనె ఇద్దామని ఊకున్న. ఉండనియ్యరాదు- ఇయ్యకపోతనా ?" అన్నాడు.

"అట్లంటె కుదుర్దా ? ఇతర ఆసాములకిస్తనని మాటిస్తిని. వచ్చేటియి వస్తెనేగద ఇచ్చేది. అన్నితల మంది నామీదనే ఆశలుపెట్టుకోని కూసునిరి. వాళ్ల పనులాగయా ? పండిచ్చేరైతులకుగాకుంట సాయం ఇంకెవనికి జేస్తం ?" షావుకారు అన్నాడు.

"ఏమయో ! ధర్మశాస్త్రాలు మాట్లాడుతున్నవు ? నువు రైతులకు సాయం జేస్తానవా- వడ్డీలవ్యాపారం జేస్తానవా! ఇనెటోడుంటె ఎన్నయినా చెప్పెటట్లేవున్నవూ ?" నర్సరాజు అన్నాడు.

"అన్ని దెలిశిగూడ మీరు గట్లంటె ఎట్ల ? మీరిచ్చేటివి కిందబెడితె కండ్లకద్దుకోని తీసుకుంట. ఆ పైసలు నలుగురు ఆసాములకిస్తె ఇంతపెట్టుబడిపెట్టి పంట

పండిస్తరు. వాళ్లింతదింటరు- ఊకికింతబెడ్తరు. కార్తెమీద ఆదుకోకుంటె పెద్దోళ్ల మయిఉండి ఏంలాభం ?" షావుకారు మాటలకి నర్సరాజు చికాకుపడ్డాడు.

"ఐతె ఇప్పుడేమంటవయ్యా !"

"నేను అనేటోన్ని మీరు వినెటోల్లా ! ఎంతమాటన్నరూ ? నాబాద చెప్పు కుంటాన. ఈ చిక్కులకెల్లి బయటపడేశే బాధ్యతమీది." షావుకారు చేతులుజోడించాడు నర్సరాజు మీసాలు మెలిదిప్పుతూ ఆలోచించాడు.

తాను వూరికిపటేలు అన్నమాటేగానీ ఎక్కడిదబ్బూ ఖర్చులకిచాలదు. తాను వూరికిపెద్దగనుక ఇతర మోతుబరులముందూ, తోటి పటేళ్ల పట్వారీలముందూ డాంబి కంగా వుండటంకోసం ఖర్చుచెయ్యాలి, ఖర్చుకు డబ్బులేకపోతే అప్పుచెయ్యాలి. ఈ చుట్టుపక్కల పదివూళ్లకి షావుకారు రామయ్యే దిక్కు. అందువల్ల అతని దగ్గర అప్పుచెయ్యనివాడులేడు. తానేగాక పట్వారీ వెంకటేశ్వరావు గూడా షావుకారుదగ్గర పెద్దమొత్తమే అప్పుచేసివున్నాడు.

పదినిముషాలుచూసి షావుకారు అన్నాడు. "ఏమిచెప్పకపోతిరి ?"

నర్సరాజు షావుకారును గుర్రుగాచూశాడు. "ఇప్పుడు ఇట్లవచ్చికూసోని చెప్ప మంటె ఏంజెప్పుతరు ? దేనికైనా సమయసందర్భాలుండాలె" అన్నాడు.

"అయ్యా ! పెద్దలు- ఊరికిఅధికార్లు. మీరేగిట్ల మొండిచెయ్యిజూపుతె నాకు దిక్కేది ? ఉన్నపైసలు అటిటుతిప్పుతెనేగద నాకు నాలుగుపైసలులాబం ?" షావుకారు వినయం చూస్తున్నకొద్దీ నర్సరాజుకి ఒళ్ళుమండుతోంది. గొంతుపెంచి కఠినంగా అన్నాడు.

"ఏమయ్యా ! మొఖంసూడకుంట మాట్లాడుతున్నవు ? సంవత్సరంకింద నీకు పదెకురాల పడావుభూమి దఖల్‌జేసింది మర్శిపోయినవా ? ఇగ పనులేపడయా నా దగ్గరికిరావా ! ఇయ్యాలేన్ని ఊర్లనుంచి పోతున్నట్టు మాట్లాడుతున్నవు. పటేలు పట్వార్లను సక్తుజేస్తె ఊరి వ్యవహారాలుసాగుతయా ?"

షావుకారు భయపడ్డాడు. వ్యవహారం తెగేటట్టు ఉందనుకున్నాడు. "క్షమిం చాలె- మిమ్ముల గంతమాటనెటోన్నయిన్నా ? నాకు ఎల్లకఅడిగినగని ఎల్లుతె అడుగు దునా ? ఐనా మీదగ్గరిపైకం యాడికిపోద్ది ? ఏదన్న నా పనిబడ్డప్పుడు కష్టసుకాలు ఆలోశించకుండ మీరు జేశిపెడ్తలేరా ? మీకు ఎల్లనప్పుడు నాకష్టం నేనేపడుత. నా

అవుసరాలకు అవ్వతల్లోల్లను బాధపెట్టుడెందుకు! సరె కానియ్యుని్రి. మీరుఇయ్యరా నేను దీస్కోనా!" అన్నాడు.

నర్సరాజు తలవూపాడు. "మంచిది. ఇగవో. నాకుపనున్నది" లేవబోయాడు.

"అయ్యా ఇంకొక ముచ్చటున్నది............" ఏదోచెప్పబోయాడు కాని అంతలో గేటుదాటుతూ పట్వారీ వెంకటేశ్వర్రావు కన్పించాడు. చెప్పబోయేవాడల్లా ఆగి "నేనుమల్ల తమ దర్శనంచేసుకుంట"అని లేచాడుషావుకారు. వెంకటేశ్వర్రావు అరుగుఎక్కుతుంటే "దయుంచాలె"అని అతనికీ నర్సరాజుకీ దండంపెట్టి గునగునా నడుస్తూ వెళ్ళిపోయాడు షావుకారు. వెంకటేశ్వర్రావు కుర్చీలోకూచుని

"నీదగ్గరికిగూడ వచ్చిండావీడు! ఐతె సంగతంత ఎరుకయిఉండాలె"అన్నాడు

"సంగతా! ఏందది!" నర్సరాజు అడిగాడు.

"కొమటోడు ఏదో పెద్దపనిమీదవున్నడు. దానికి ముందు ముందు మనసాయం గావాల్సి వచ్చేటట్టున్నది. అందుకే మన ఇండ్లసుట్టు దిరుగుతాండు. ఇప్పుడు ఆ పనేదో మనంజెయ్యాలె. లేకుంటె బాకిపైసలు అడిగేటట్టున్నడు. అటుఇటు ఇరకటంల బెట్టిండు మొత్తానికి!" అన్నాడు వెంకటేశ్వర్రావు.

"అట్లనా?" సాలోచనగాతలూపి "ఐనా వాణితోనిమనకు పమంటది. మన తోటి వాణికుంటది. మనకు నష్టంరానిపనులు జేస్తేంది?" అన్నాడు నర్సరాజు. వెంకటేశ్వర్రావు చిరునవ్వునవ్వాడు.

o o o o

పట్వారీ వెంకటేశ్వర్రావు ఇంటిచావడిలో పటేలు నర్సరాజు, షావుకారు రామయ్యా, సాతాని రంగయ్యా కూచునివున్నారు, ఈరోజు బండారు నర్సయ్య తమ్ముడు వెంకన్నను ఊళ్లో పంచాయితీపెట్టి ఈ పెద్దలంతా విచారిస్తారు. ఫిర్యాదీ షావుకారు రామయ్య ఈ పెద్దలందర్నీ కూడగట్టుకుని పంచాయితీ ఏర్పాటుచేశాడు.

"కాయిదాలన్ని తయారుగున్నయా?" వెంకటేశ్వర్రావు అడిగాడు.

"ఆఁ ఇగో" అని ఒక మామూలుకాగితం, ఒక కోర్టుస్టాంపుకాగితం ఇచ్చాడు షావుకారు.

"మొత్తానికి మంచిగున్నదయ్య నీకత. మరివాడు మధ్య మధ్య కొంటినవడ్లు ఇతరదినుసుల సంగతేంది- అవి లెక్కజూపుతవా?" నర్సరాజు అడిగాడు.

షావుకారు నీళ్ళునమిలి "ఆఁ. అవెంతలెక్క? వాటికి కాయితమా కతుకా! ఏలెక్కకొస్తయి" అన్నాడు.

చిరునవ్వునవ్వి "సరె ఇగపానిగి. యాల్లయితాంది. అందరువచ్చి కూసున్నరు గావచ్చు" లేచాడు సర్పరాజు

పంచాయితీ స్థలం ఊరిప్రైమరీస్కూలు. ఆరోజు ఆదివారం కావటంవల్ల స్కూలులేదు. ఆవరణలో చెట్లనీడన జనమంతాచేరారు, అరుగుమీద రెండుచాపలు వేసి వున్నాయి అప్పటికే గ్రామీణులంతా వచ్చిచేరారు. పెద్దమనుషులురాగానే చుట్టలు, బీడీలు ఆర్పి అందరూ సర్దుకునికూచున్నారు. పటేలు పట్వారీలు ఇద్దరూ చాపలమీద కూచున్నారు. షావుకారు రామయ్యా, సాతానిరంగయ్యా చెరోవైపు నిలబడ్డారు. కూచున్నాక "అందరూ వచ్చినట్టేనా?" వెంకటేశ్వర్రావు అడిగాడు.

వెంకన్న అన్నాడు "అందరం వచ్చినం"

"ఎవరు మాట్లాడకుండ్రి. ఆఁ. పంచాయితి మొదలైతాంది" సర్పరాజు హెచ్చరించాడు.

"మీపెద్దమనుషులెవర్రా?" వెంకన్నని అడిగాడు వెంకటేశ్వర్రావు.

"ఎవరులేరు. మాకుమేమే పెద్దమనుషులం" వెంకన్న అన్నాడు.

సాతాని రంగయ్య రెండడుగులు ముందుకేశాడు. "పంచాయితి మొదలుబెట్టే ముందు దరావతుపెట్టాలె. రెండు పార్టీలోల్లుగూడ దరావతు కిమ్మతు రెండువందల చొప్పున పంచుల దగ్గర పెట్టాలె" అన్నాడు.

షావుకారు వెంటనే రెండువందలు తీసిఇచ్చాడు వెంకన్న "నాదగ్గర పైసల్లేవు" అన్నాడు.

"పైసల్లేవంటె పంచాయితి ఎట్లయిద్ది?" సాతాని రంగయ్య అన్నాడు.

"కాకపోతేపోనీ తిండికే లెవ్వంటె దరావతు యాడదేవాలె" వెంకన్నలేచి ధోవతి చెంగులు దులుపుకుని వెళ్ళటానికి సిద్ధమయాడు. అతనితోపాటు గోపయ్యా, బాలయ్యా మరికొంత మందిలేచారు. షావుకారు గందరగోళపడ్డాడు.

"అరె! నాసొమ్ము ముంచుతవా ఏంది?" అరిచాడు. "అయ్యా! అప్పులి అప్పు. వానితరుపు దరావతుగూడ నేనే ఇస్తగని పంచాయితి కానియ్యండ్రి" షావుకారు మరో రెండువందలు తీసిఇచ్చాడు.

"ఏమిటీట?" అని వెంకన్న కూచున్నాడు. అతనితోపాటు లేచినవాళ్ళంతా వినగ్గాకూలబడ్డారు. పటేలు పట్వారీలు వాళ్ళని ఓరకంట గమనించి మొహాలుచూసు కున్నారు.

ధరావతుడబ్బు పటేలుకిచ్చాడు సాతాని రంగయ్య. మళ్ళీ మందివైపుతిరిగి

"అమ్మలారా! అయ్యలారా! ఈ సభల నాలుక్కాలాలకు జెండినోల్లుఉన్నరు. ఇటువంటియొక్క సభల మనపెద్దలు పటేలు సర్వరాజుగారు పట్వారీ వెంకటేశ్వరావు గారు పెద్దలుగా కూకూనిఉన్నరు. వారియొక్క వ్యవహారములగూర్చి ఊరంతటికీ ఎరికే. వారు ఒకరిమీద పక్షపాతం ఇంకొకరిమీద కోపము ఉన్నటువంటివారుగాదు. వారు ఇక్కడ విషయములన్నీ వివరముగా చర్చించి న్యాయం ఎటున్నదో అటుతీర్పు చెప్పగలవారు. ఈ యొక్కతీర్పునకు షావుకారు రామయ్యగారున్నూ, బండారు వెంకన్నగారున్నూ కట్టుబడి వుండాలె. దీనికి సమ్మతమేనా?" అనడిగాడు.

షావుకారు "సమ్మతమే" అన్నాడు. వెంకన్న తలూపాడు. జనంఅంతా ఏం జరుగుతుందోనని ఉత్సుకతతో కూచున్నారు. ఎక్కడా అలికిడిలేదు. అంతమంది పిల్లలున్నా ఏఒక్కడూ తల్లి పాలకోసం ఏడవటంలేదు. రంగయ్య మళ్ళీ సాగించాడు.

"ధర్మమంటే ఎటువంటిది? దానిమీదనే మన ఏడేడుపద్నాలుగా లోకాలు ఆధారపడి నడుస్తున్నయి. అటువంటి ధర్మాన్ని మనం కాపాడాలె ధర్మం తప్పిన వారు ఎటువంటి రౌరవనరకముల పడుతరో మీకందరికీ ఎరికే దీనికి ఒక శాస్త్రం జెప్పుత" అని ఆగి ఊపిరితీసుకున్నాడు. జనం ఉగ్గపట్టుకుని వింటున్నారు

"ఒకసారి ఒక అడివిలోపల ఇద్దరు మనుషులు నడిచిపోతున్నరు. ఒకడు నడిమయిసువాడు ఒకడు నవయువకుడు. అప్పుడు వారికి ఆనేలమీద రెండు కములైనటు వంటియొక్క అడుగుజాడలు కనబడ్డయి అవి అంతకుముందు నడిచిపోయిన ఇద్దరు ఆడవాండ్లని ఒక అడుగులయొక్క జత పెద్దదిగనూ మరియొక అడుగులజత చిన్నదిగనూ ఉన్నవిగనుక పెద్దవాడు చిన్నవానితో అన్నడుగదా, ఈ పెద్దఅడుగుల ఆడామెను నేను పెండ్లిజేసుకుంట, ఈ చిన్న అయినటువంటియొక్క అడుగుల ఆడిదాన్ని నువ్వు పెండ్లిజేసుకో అన్నడు దానికి చిన్నవాడైనటువంటి వాడు ఒప్పుకున్నడు. పెద్దఅడుగు లది పెద్దవయసు ఆడిది చిన్నఅడుగులది చిన్నవయిసు ఆడిది అని వాండ్లనుకున్నరు. అట్లనుకోని అదే అడివియొక్క మార్గమున తొందరగపోయి వాండ్లు ఆయొక్క ఇద్దరు స్త్రీలను కలుసుకున్నరు. అప్పుడక్కడ ఎంత విచిత్రమైన సంగతి జరిగిందంటె పెద్ద

అడుగుల ఆమె చిన్నవయిసుది చిన్న అడుగుల అదిది పెద్దవయిసుది అయివున్నది. అప్పుడేమిచెయ్యాలె? ముందేమొ మాట అనుకొనిరి. తప్పవద్దుగద. అందుకోసం ఆ యొక్క ముందు అనుకున్నమాట ఏదైతెవున్నదో దాన్ని నిలబెట్టుటంకోసం ఆపురుషులు ధర్మం తప్పక ముందుమాట ప్రకారమే పెద్దదాన్ని చిన్నవాడూ, చిన్నదాన్ని పెద్ద వాడూ పెండ్లిజేసుకున్నరు. ధర్మంఅంటె అటువంటిది. మాట అన్నతర్వాత తప్పుటం పాపం. ఇప్పుడు మనందరం ఇక్కడ జేరింది గూడ ఇటువంటి యొక్క ధర్మం నిలుపుటానికే. కాబట్టి ఇరుపక్షముల వారు తాము ముందు ఏదైతె అనుకున్నరో, రాసుకున్నరో దానికి కట్టుబడి దాన్నంత ఈ పెద్దలముందు, ఈ మందిముందు పెట్ట వలశింది''

సాతాని రంగయ్య ఉపన్యాసం ముగించి నిలబడ్డాడు. "ముందు షావుకారు రామయ్య ఈపంచాయితికి ఫిర్యాదజేశిండు గనుక అతడే ముందువిన్న వించుకుంటడు" నర్సరాజు అనగానే షావుకారు రెండుచేతులు జోడించి పెద్దమనుషులకూ సభకూ నమ స్కారంచేసి దోసిలి అలాగేపట్టి నిలుచుని అన్నాడు

"సభలోపల ధర్మదేవత ఉన్నదంటరు. అటువంటి సభకు నా ఫిర్యాదును విన్నవించుకుంటాన. ఇక్కడున్నవాండ్లంతా నాకు న్యాయం కలిగించాలె

బండారు నర్సయ్య, బండారు వెంకన్న ఇద్దరు నాదగ్గెర నేటికి సరీగ్గ రెండు సంవత్సరములకింద మూడువెయిలరూపాలు అప్పుదీస్కున్నరు. ఆ అప్పు దీస్కున్నప్పుడు అన్నఅయినటువంటి బండారు నర్సయ్య నోటురాసి ఇచ్చిండు. దానిమీద తమ్ముడు వెంకన్న నిశానిగూడ ఉన్నది. ఆ తర్వాత నర్సయ్య సచ్చిపోవు టాన్కి ముందు, అంటె నేటికి సరీగ్గ సంవత్సరం కింద తాను ఉంకో సంవత్సరం తర్వాత గనుక అప్పుతీర్చలేకపోతె అసలు ఫాయిదాల కింద తనవంతు పొలం మూడెకురాలు నాకు సమస్త హక్కు భుక్తములతోటి స్వాదీనం జేస్తననీ దానికి ఎవరు ఎటువంటి అభ్యంతరమున్నా పెట్టరనీ కోర్టు కాయిదంమీద రాశిఇచ్చిండు అకాయిదం మీద తమ్ముడు వెకన్న ఒప్పుదల నిశానీగూడ ఉన్నది. ఆ కాయిదం రాశినంక నర్సయ్య సచ్చిపోయిండు. పెట్టినగడువు అయిపొయినంక నేను వెంకన్నను పొలం స్వాధీనం జెయ్యమంటె అటువంటిది నాకెర్కనేలేదంటడు అందువల్ల నాకు ఎంతో అన్యాయం జరుగనున్నది కాబట్టి ఈ పంచాయితి సభకు చెప్పుకుంటాన. ఆ రెండు కాయిదాలుగూడ పెద్దమనుషుల దగ్గర్నే ఉన్నయి" అని ముగించి దోసిలిని ముడిచి మరోసారి సభకూ పెద్దలకీ నమస్కరించి చేతులుకట్టుకుని పక్కకు నిలబడ్డాడు షావుకారు.

మంది మొహాలుచూసుకున్నారు "గిదెక్కడి ముచ్చట ?"

"సర్పడు గిట్లెప్పుడుజేశె ?"

వెంకన్న కోపంతో వూగిపోతూలేచాడు. "మంచిముచ్చట జెప్పినవయా షావుకారీ ! జోర్‌దార్‌కత అల్లినవుగని అంత ఎడ్డిమొకపోడు ఎవడులేడిక్కడ। మాఅన్న నేను నీదగ్గెర ముందుగాల వెయ్యిరూపాలే దీస్కున్నం. దానికి నోటురాశిఇచ్చినం. అందుకుసాక్షులు అగో ! పెద్దమనుషులమని కూసున్న వచేలు పటువార్లే. వాల్ల ముందట్నే పైసలిస్తివి ఆకరుకు మాఅన్నను కిందేశినప్పుడు బలవంతంగ స్టాంపు కాయిదంమీద సచ్చినపీనుగతోవి ఏలిముద్రేపిచ్చుకున్నవు. అండ్లేమున్నదో నేనడిగిన్నా-నువుజెప్పినవా ? తెల్లకాయిదం. ఇప్పుడు మాఅన్న కాయిదం రాశిచ్చిండంటున్నవు. అప్పుడు నువ్వే బలవంతంగ ఏలిగుర్తులేపిచ్చుకుంటివి- అందుకుసాక్షులు ఇగో ఈ పందంతఉన్నరు- ఇన్నితీర్ల అబద్దాలుజెప్పి ఎవనికొంప ముంచుతవయా ?"

షావుకారు గుండెలు బాదుకున్నాడు- "ఇగోసూశినావ్రి ? గిట్లమాటదివ్వుతె ఇగ న్యాయమేంజరుగుద్ది ? రాశిచ్చినకాయిదాలే అబద్దమైతయా ?"

"మరి ఈ కాయిదాలల్ల సావుకారు జెప్పినట్టేఉన్నది గదరా !" వెంకటేశ్వర్లు అడిగాడు.

"అట్లంటరేందండి ? ఆనాడు వెయిరూపాలు దీస్కోంగ మీరు అక్కన్నే ఉంటిరి. సూడలేదా ? అప్పుడు వెయ్యి ఇప్పుడు మూడువెయిలెట్లయితయి ?" వెంకన్న కోపంగా అన్నాడు.

"ఆనాడు మేమక్కడఉన్నది నిజమేగని ఎంతదీస్కుంటున్నరని మిమ్ముల అడిగినమా, ఎంతఇస్తున్నవని సావుకార్ని అడిగినమా ? అడుగంది మాకెట్లదెలుస్తది ? మాపనిమీద మేం ఉన్నం- మీపని మీరుజేస్కున్నరు" నర్పరాజు అన్నాడు.

"ఆనాడు అన్నిజూశి ఇయ్యాల మాటదివ్వుతె ఎవడేంజేత్తడు ? సావుకారి పెద్దోడుగనక పెద్దమనుసులంత అటేమాట్లాడుతరు నాఅటువంటి బక్కరైతును. కాపుడానవోన్ని ఎవడాదుకుంటడు ? కష్టకాలాన మారెక్కలే మాకుసుట్టాలు, బందుగులు- ఇప్పుడేజెప్తాన- పెద్దమనుసులు ఎసుమంటోల్లన్నగానీ ఏమన్నగానీ సావుకారి జెప్పినముచ్చట్ల ఒక్కటిగూడ నిజంలేదు- కాని ముచ్చట్లుజరుగయి- అయినె మా అన్నకిచ్చిన వెయ్యిరూపాలఅప్పు ఎన్నడో దీదేపొయింది- రెండుసంవత్సరాల కాన్నుంచి బాకికిందికి అప్పుడిన్ని అప్పుడిన్ని మొత్తం రెండుపుట్లవడ్లు కల్లంమీదనే

గొలిశన, మక్కలు, పెసర్లు ఎవ్విపండుతె అవ్వి కూరగాయలతోసహా ఇంటికీదీస్క-పొయిఇచ్చిన. అవన్ని ఇచ్చినోన్నె లేదో అడుగునిరి. రైతులందరు సాక్షంవున్నరు. వాటన్నిటికి దరగట్టునిరి. నా వెయిరూపాల బాకీదీరిందో, ఇంకనాకే ఎదురుదేల్తదో చెప్పునిరి" వెంకన్న అన్నాడు.

వెంకన్న ఆపగానే గోపయ్యలేచి అన్నాడు "ఇప్పుడు ఎంకన్నజెప్పింది అంత నిజమే. వడ్లుగొలిశియ్యంగ నేనుగూడ శానసార్లు జూశిన"

షావుకారు గుండెబాదుకున్నాడు. సాతానిరంగయ్య కల్పించుకున్నాడు. "మరి కొయిదాలమాటేంది?"

"అన్ని దొంగకొయిదాలు. తెల్లకొయిదాలమీద ఎలిముద్రి లేపిచ్చుకోని గింతకు దెచ్చిండు. నువ్విదువరదాక దర్మం దర్మంఅని కానితీర్గ ఒర్రితివిగద గిదేనాదర్మం. కల్లునీల్లకొశపడి పంచాయితులు నడుపుతానావు! ఎవనికిదెల్వది నీసంగతి?" వెంకన్న అన్నాడు.

"అరేయ్ ఎంకా! మాటలు నిమ్మలంగమాట్లాడు. ఇక్కడ మేం పెద్దమనుషులంత్రై వున్నంరా!" వెంకటేశ్వర్రావు మందలించాడు.

"మాగఉన్నరు పెద్దమనుషులు. లంగపంచాయితులు పెట్టిచ్చి మందికొంప ముంచెటానికి. ఈ సావుకారి ఇట్ల దొంగకొయిదాలుపుట్టిచ్చి ఎందరిపొలాలు జప్తు జేస్తున్నడో ఎన్నడన్న అడిగినారి? ఎందుకడుగుతరు! మీరందరొక్కటేనాయె! ఇయ్యాల సావుకారికి ఏదో అన్నాయమైపోతాందని పంచాదిపెట్టినారు? ఏందయ్యా మీరుజెప్పేన్యాయం- ఇగజెప్పుండిరి" వెంకన్నమాటలకు నర్సరాజుకు కోపంవచ్చింది.

"ఏమిరా! పురుగు మెసులుతాందా? ఉచ్చనీచంమరిచి మాట్లాడుతున్నవు-బొక్కలిరుగుతయిమల్ల" అన్నాడు.

"ఏందయ్య పటేలా! అన్నాయం జరిగినోనిమీదనేనా మీజులుమంత! ఇదేందయాఅంటె బొక్కలిరుస్తారు? ఏదీ ఏపాటిజేత్తరో ఇగజెయిరిరి- నీయక్క! గబ్బుకోమటోడు వూరంత దోసుకుంటాంటె ఈ పెద్దమనుషులట పంచాదులుపెట్టి తీరుమానాలు జేత్తరట తీరుమానాలు!" బాలయ్య విసురుగాలేచి ముందుకొచ్చాడు.

అతడి వెనక గోపయ్య మరి నలుగురైదుగురు రైతులు లేచివచ్చారు. పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించాడు నర్సరాజు. ఇంకా వుంటే అవమానం తప్పదని అనుకున్నాడు. ఏమీ జరగకముందే జారుకోవటం మంచిదని బింకంగా "అరే! ఇదేం

కథ :

'బంధం

ఎన్నారెస్

కొండకీకెలుబెట్టినా ఒగలమాట ఒగలకు ఇనబడెటట్టులేదు- అసలే కపడా కాతంచె, మొత్తంకాతల లూములన్ని పాతమిషిన్లే- కట్టరకట్టర గల్లరగల్లర బల్లర బల్లర ఒకటేలొల్లి- సాలుకు 18 లూములుచొప్పున 13 సాల్లున్నయి- సాలుసాలుకు మిషిని మిషినికి నడుమ మనిషిబట్టె సందున్నది.

లూములఅడుగున నిలువెత్తులోతు అవ్వజాలున్నయి- మోకాలుబంటి నీల్లున్నయి- నిలబడ్డకాడ గొట్టాల్లనుంచి సల్లగ గాలిత్తాంది- గీ గాలిగొట్టాలు పాపం ! పనోల్ల కోసమే పెట్టిండ్లని అందరు అనుకుంటరు- గని అవి మిషిన్లమీదిబట్ట సాపుగరావాల్నని, పోగులు బూరుబూరురేగకుంట వుండాల్నని పెట్టినయి- గట్లపెట్టకుంటె మిష్నిమీదెక్కి పోగులు పుట్టపుట్టతెగి, తెగినపోగు ఏకినదూదోలె బుచ్చుకపొయ్యి, అంత బూరురేగుతది- చేతికిరాదు. గందుకనె గీ గాలిగొట్టాలుబెత్తరు- దీన్ని వెదర్ కండీషనో యేమొ అంటరు- సన్నటిది దొడ్డుది గిట్లనడిచే పోగునుబట్టి యీ గాలి, సల్లదనం యెక్కువ తక్కువజేస్తరు.

పనిరా ? ఇక్కడ అందరు మాతిర్మానానికి ఒప్పుకుంటమని చూసుంటిరి. మల్లగిదేంది! ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతాన్రు. గిసుమంటి దానికి పెద్దమనుషులెందుకు ? మా గౌరవం కాపాడకపొయినంక ఇంకమేం జెప్పే తీర్పేమున్నది ?" అని వెంకటేశ్వర్రావు కేసి తిరిగి

"లేవవయ్యా పోదాం. ఏంజేసుకుంటరో జేస్కోనియ్యి ఇగ" అని లేచాడు. వెంకటేశ్వర్రావు గూడా లేచిపోబొయ్యాడు.

నర్సరాజు తన చేతిలోని కాగితాలు షావుకారుకు అందివ్వబోతుండగా వెంకన్న పరుగునవచ్చి ఆ కాగితాలు అందుకుని అడ్డం నిలువు పరపరాచింపేశాడు. షావుకారు గుండె అగినంతపనయింది. పటేలు పట్వారీలు, సాతాని రంగయ్యా శిలావిగ్రహాల్లా నిలబడిపోయారు. వెంకన్న జనంకేసితిరిగి "గిదే పంచాయితి తీర్మానం" అని "లేర్రి - నడువుర్రి" అని ఆముక్కలుగాల్లోకి ఎగరేశాడు. జనంవెళ్ళిపోతుంటే కాళ్ల కింది మట్టి గోధూళిలా అలుముకుంది. ఆధూళితెరల్లోంచి కాగితం ముక్కలు కింద రాలుతున్నాయి.

ఒక్కొక్కలు రొండ్రొండు లూములమీద పనిజేస్తాండ్రు- లూములసుట్టు బల్లి పాతరతీర్గ అన్ని పోగులే- అంతగజిబిజి గజిబిజిగున్నది.

“బట్ట మంచిగత్త లేదంటరు. తోకమట్టంటరు, తొల్దండేరంటరు- నీయక్క- మిషిన్లు మార్పియ్యండ్రి అంటెయినరు- యిగొ గిదెగోస- నీయక్క- ఓమిషిన్ని యిర్గనేగొడ్త యిగ” నొసలుగొట్టుకుంట యీరన్న గట్టిగనె అంటాండు- గని సూపె టోల్లకు ఆయినె నోట్లెవోట్లెనె యేందో అనుకుంటాండు అనిపిస్తది. జోట కూసున్న దట- నడుమ జోటెలుప సరిపోగులు గోయింద- “యింకేమున్నది, పూటగుంజుద్ది- పోగులెక్కించి పొతంజేసెటాల్లకు పాపయ్యపానం కొలికిలకత్తది” అనుకుంట లూము యెనుక బీడిముకొనబొయిండు- ఆడ మోటరున్నది- పంచె దగ్గెరగట్టుకొని బీడు కొద్దిగ సల్లిడిసిండు- అంతకుముందె అచ్చులుకొంచెం యెన్కకుజరిపిండు- సట్టరు సందు అచ్చులసందులకువంగి పోగులుయేర్తాండు- నడుము టింగుమంటాంది- గింతల మిల్లుసీటిచ్చింది- అందరు చాయలుదాగబోతాండ్రు- యీరన్నగూడ యిడిసిన అంగి జేబులకెల్లి ఓ పావులపైసలున్ను ఓబీడీ తీసుకొని నడుముబట్టుకొని నడ్డిరిసి కాల్లు తిమ్మిరిబట్టి ఒక్కొక్క-అడుగేసుకుంట క్యాంటీనుమొకాన బొయిండు. అందరు యెవలకు వాల్లె పైసలు ఆడయిచ్చి చాయలుదెచ్చుకొని టేబులుకాడకూసోని తాగుతాండ్లు యీరన్న తెచ్చుకున్న చాయతాక్కుంట యెదురుంగ తోటి జోడాయినెతోటి “యెట్లనె గిట్లయితె, వాడేమొ పొగుబొయింది, కర్సులత్తానయి, కుమాషులుబడ్డయి అదయింది ఇదయిందని రిమార్కులాత్తడు- మిషిన్లేమొ గిట్లసతాయిస్తానయి- యిగగిట్నె వుంటద మరి మనకత” మిషిన్ల జోటగూసున్నదని, పూటపనిబాయెనని మిడుక్కుంట చెప్పుకున్నడు.

“యేందో యేమొ, దర్మంజెప్పు దర్మరాజాంటె దుడ్డెబర్రె నాదేనన్రి యూనియనోల్లు- వాల్లువాల్లు ఒక్కటయి మనల్ని గిట్ల సంపుక తింటాండ్లు- మనం సత్తె వానికేంది బతుకుతె వానికేంది- అప్పులోడు వసూలుజేసినట్టుగ జీతాల్నాడు మిల్లు గేటుకాడ కూసోని చందాలు వసూల్జేసుకుంటె అయిపాయె వానిపనిదీరె- యిగ మన తిప్పలు వాల్లకెందుకు” బీడి అంటుబెట్టుకుంట ఒగలకొగలు అనుకుంటాండ్లు.

“గంతేనానె, మొన్న యూనియనోల్లు స్టయికుజేత్తం అని మీటింగులుబెట్టిరె! గదేందో యెరికేన? మన పెసిడెంటు కొడుకు అమిరికల సదువబోతాండట- మరి

వూ కెనేఅయిద్ద? ముప్పయివేలరూపాలు- మసల్కి అడ్డంబెట్టుకొని బెదిరిచ్చుక దొబ్బిండట గది, గట్లున్నది కొడుకు తమాషె" యింకొగాయినె నడుమవచ్చి యిప్పి చెప్పిండు.

గిర్ని కూతబెట్టింది.

"హయ్యొ హయ్యో! చొచొచొచొ! వాడు అపాత పెసిడెంటు గుద్దేలుగను కుంటె- గుద్దేలుగు చేతులకెల్లి తోడేలునోట్లె బడ్డట్టాయెర మనబతుకు- ఛి, ఛి, ఛీ" నెత్తిగొట్టుకుంట లేచిండ్లు- కాతలకు పొయిండ్లు.

లూములకు యెవలకు వాల్లెపొయ్యి ఒడిసిన ఊశెలు తీసుకపొయి నిండుకండెలు తెచ్చుకోవాలె- గిండ్ల గంటటయిము పీక్కపోద్ది- గట్లనె ఒగాయినె కండెలుమోసుకొని లూముల సందులకచ్చి, రొండుమూడు కండెలు దీసెటాల్లకు పక్కలూములకెల్లి ఒడిసెల గుండోలె జోట రంయినవచ్చి ఆయినె కంతకు దలిగింది. "అవ్వ, సత్తినే!" అన్నడు గంతె- ఆ సందుల బడిపొయిండు. గిది జూసినపక్కాయినె ఆ కాతలున్న ఒగ ఇనుప కంబాను 5 నెం- పానరుతోని ఠన్ ఠన్ ఠన్‌మని కొట్టిండు. గదొక్కటె కాతల అందరికి ఇనబడ్తది. అందరు లూములు బందుజేసి వురికచ్చిండ్లు. దెబ్బదలిగి నాయినెను అమాంతం లేబట్టుకచ్చి ఇవుతల పండబెట్టి, ఒగలు చెవులు మూసిండ్లు- ఒగలు మొకంమీన నీల్లుజల్లిండ్లు- ఒగాయినె పెయిమీని పంచెకొంగుతోని గాలిసురు తాండు- కాల్లుజేతులు సూత్తాండ్లు, నల్తాండ్లు. యేందో యేందో యెటుతోచనోల్లు సుట్టు ముసురుకున్నోల్ల సందులకెల్లి ఇట్నుంచి ఓపారి అట్నుంచి ఓపారి సూత్తాండ్లు- సుట్టు తిరుగుతాండ్లు. దెబ్బదలిగినాయినె కొద్దిగ మెసిలిండు. గింతల ఒగాయినె మంచి నీల్లున్న చా దెచ్చిండు. "జరుగుండ్లి జరుగుండ్లి" అనుకుంటవచ్చి తలాపున కూసున్నా యినెకు చాయందిచ్చిండు. "అరేయ్ మీరు కొద్దిగ దూరంజరుగుర్రి- గింత గాలత్త లేదు- ఇగో పోశన్న, గింత తుక్కుబట్కరాపోయె పీనితలాపున బెడ్దాం" అని చెప్పి తీసుకచ్చిన తుక్కును తలకాయెకిందబెట్టి గప్పటిదాక వుంచిన అయినె తొడనుదీసిండు. ముందుగాల గిన్ననిన్ని గిన్ననిన్ని నీల్లుతాగిచ్చి అటెనక చెంశెతోని ఒక్కొక్కసుక్క చా నోట్లె యిడుస్తాంటె, సుట్టు ఆరాటంతోని సూపెటోల్లు గుటుక్కలేత్తాండ్లు. నిక్కి నిక్కి సూత్తాండ్లు- అందరి మొకాలు యిచారంగున్నయి- "అవ్వొ, ఆయ్యో, ఓ నాయిన, ఓ అవ్వ, అబ్బా...." తనుసుకుంట మూలుక్కుంట మెల్లెమెల్లెగ కండ్లు దెరిసిండు- ఆయినెకంతలనారాలు పొంగి నొప్పితోని బాదపడ్తాండు- గని సుట్టు మిట్టమిట్ట సూపెటోల్ల మొకాలు నవుమొకాలయినయ్, గడిసేపటికి అండ్లోమొండిరకం

గుంపులకెల్లి ఇవతలికచ్చి "ఇగ బారక్, వానికిగ రాతగొట్టిన సావులేదు, పాన్రి" అనుకుంట తాల్లబేన్క-బోయిన ముడ్డిపంచెను సాపుగయిప్పుకుంట చెవులున్న బీడిముక్క-దీసి యెవల్నో అగ్గిపుల్ల అడిగి అంటుబెట్టుకున్నడు.

గప్పుడు కపడాకాత సూపరువైజరు ఆపీసులకెల్లి బొత్తమీది పాయింటుజారి బోంగ మీదికి యెగేసుకుంట మెల్లెగవచ్చిండు- "క్యా హువారె సబ్‌లోగ్ ఇదర్ జమాహువాహై- క్యా, క్యాహువా, చోక్‌రేకో మార్‌లగ్గయా? అఁ! క్యోంనైలగ్‌తా కామ్‌పర్ పీకెఆతా, కుచ్ గాండ్‌కబర్‌హై మాకెలాదెకో" అనుకుంట మల్ల ఆపీసులకు బోయిండు- ఆపీసుల యిస్క-సీస యి-క పురాగ అయిపోలె.

"నీయవ్వ! మిషిన్లిరగ్గొట్టి కుప్పబెడ్తె గప్పుడు దెల్తదిర, పీకెఆయె గీకెఆయె వాడుయింట్ల ఇయ్యాల గంజన్న తాగిండొలేదొగాని, తాగచ్చిండంటండు- తాగుడు" బీడీఅంటుబెట్టుకున్నోడు తుపుక్కు-నఊంచి అన్నడు. గిది వీల్లుమాట్లాడెబాస అ సూపరువైజరుకు తెలువదిగని, వాల్ల బంట్లుపుంటరుగద, యెక్కి-చ్చిచెప్పిండ్లు "సార్ వాల్లు మిషిన్లు యిరగ్గొడ్తరట" అని- "అచ్చా!" అనుకుంటపోయిండు.

మొత్తం కాతలోల్లు మీటింగు బెట్టుకున్నరు- మోటరుపట్టాలమీద, లూములకు సైకులకు జాలీలుగొట్టియ్యాల్ననీ, లూములకాడికి కండెలుదెచ్చియ్యటానికి మనిషిని బెట్టాల్ననీ, లూములు కరాబుండి జోటగినకూసుంటె లూముబాగయ్యేదాక అయిన కైముకు కట్టియ్యాల్ననీ, అసలు మొత్తం పాతమిషిన్లన్ని మార్చియ్యాల్నని- ముక్యంగ జీతాలు, కూల్లు రూపాయికి రూపాయిపెర్గాల్నని డిమాండులు తీర్మానం జేసుకున్నరు- దెబ్బతాకినోని గురించిగూడ అనుకున్నరు.

డిమాండ్లు మిల్లు మేనేజుమెంటుకు, లేబరు కమీషనరుకు పంపిండ్లు. ఇంతకు ముందు కార్మికులకు తెలువకుంటనే మూడేండ్లు యే డిమాండ్లుజెయ్యమని యూనియ వోల్లు ఎగ్రిమెంటు అయిండ్లట- గందుకనె ఇన్నిరోజులు ఏంజేసేటట్టు లేకుండె- ఎగ్రిమెంటు అయిపోంగనె డిమాండ్లుబెట్టిన్రి- ఈసారి యూనియనోల్ల ఎత్తులు సాగనియ్యలేదు కార్మికులు- అయితె ఎన్నిదినాలుగడిసినా పడీసప్పుడులేదు, ఇగ గిట్లయితె కలువదని మొత్తంకార్మికులు వాల్ల అలిపిల్లలతోని మిల్లుగేటుముంగట మేనేజరును గెరావుజేసిండ్లు- రొండుమూడుగంటలు ఎండల ఎటు కదలనియ్యలేదు- యింతల పోలీసులచ్చిండ్లు- ముఖ్యమైనోల్ల ఇద్దర్ని బిలిసిండ్లు- వాల్లు సంగతంత చెప్పిండ్లు- "అచ్చ అచ్చ, లేబరు ఆపీసరుతోని మీటింగు యేర్పాటుజేపిస్త- యిగ మీరు యిండ్లల్లకుబోండ్లి" అని పోలీసాపీసరు నడిమిల మాట్లాడి పంపిచ్చిండు.

మూడోనాడు లేబరాపీసుల మీటింగు.

పర్దలేఁటట్టి అబ్బరి తలుపు నూకేసుకుంట లోపలికిబోతె పెద్ద టేబిలు- ఎదురుంగ లేబరుఆపీసరు- ఆయినె పక్కాపొంటి మెత్తటి కుర్చీల మిల్లు డైరెక్టరుసాబు- ఆయినెకు ఈ బాసల్ది ఆ బాసల, ఆ బాసల్ది ఈ బాసల చెప్పేటానికి ఒగాయినె. ఆ పక్కానె ఇంకొగలు వాల్లతరుపోల్లు, యిగ ఆఫీసరుకు ఎదురుంగ అయిదు కుర్చీలల్ల కార్మికులు. యూనియను పెసిడెంటుకు హైదర్రాబాదల పనున్నదని రాలేదట- వచ్చిన సెక్రెటరి నామ్‌కెవాస్తె కూసున్నడు- అసలు ఈ మీటింగుబెట్టుడు వాల్లకు యిస్టంలేదు. లోపల గోడపొంట గూడ కొందరు కార్మికులు అడిగి నిలుసున్నరు.

ప్యాక్టరీ యిన్‌స్పెక్టరు గూడ అడకూసున్నడు. గాయినె యాడాదికి ఆర్నెల్లకు ఎన్నడు మిల్లుకు చెకింగుకు రానేరాడు- ఎన్నడన్న వచ్చిండంటె సక్కాగ మిల్లు ఆపీసులకే- ఆపీసుల ఆయినె మాట్లాడుకునేదేందొ మాట్లాడుకున్నడంటె యిగ మల్ల సక్కాగ యెల్లుడె- కాతలమొకాన కన్నెత్తి చూసిందిలేదు, చెకింగు చేసిందిలేదు.

మీటింగు చాలయింది.

ఆపీసరు వీల్లముచ్చట వాల్లముచ్చట తెల్లకాయిదాలమీద ఒకపేరాసుడు రాత్తాండు.

మోటరు పట్టాలమీద, లూముల పైడులకు జల్లీలు బెట్టిస్తమన్నరు-

లూముల కాడికి తండెలు తెప్పిస్తమన్నరు- దానికి నూకుడుబండి యేర్పాటు చెయ్యాల్నంటె గూడ 'సరె' అన్నరు-

దెబ్బ తలిగినోనికి ఇంతో అంతో ఇప్పిస్తమన్నరు-

జోట గూసున్నప్పుడు అయిన టైముకు కట్టిచ్చుడు గురించి ఆలోచించుకోటానికి టైమడిగిండ్లు.

ఒక్కొక్కటి యింటాంటె కార్మికుల మొకాలు సంబురంతోని కలకల్లాడ్తానయ్. మనమూటే గెలిసిందని మన్నుల పొంగిపోతాండ్లు. నాలోగ్రిజులాగినా పలితం దక్కిందని లేబరుఆపీసరు గూడ మన గురించి చాన చెప్పివుంటడని అయినె చాన మంచోడని అనుకుంటాన్రు.

తర్వాత "పాత లూములు, మిషిన్లు మార్సుడంటె మాటలుగాదు. మెల్లెమెల్లెగ మారుస్తం" అన్నరు-

"నిజమే గద, మార్చుడంటె మాటలా- సరెతియ్" అనుకున్నరు కార్మికులు.

యిగ జీతాలు, కూల్లు-

"అడిగెటానికి బుద్దుండాలె- మీకోసం, కార్మికులకోసం గవుర్నమెంటు చట్టం చేసింది- దేశంల దరలు బెరిగితె, పెరిగిన దరల పకారంగ డి.ఏ బెంచుమని పత్రొక్క మిల్లోని తంయ్యే పలగ్గొట్టి యిప్పిస్తాంది గవుర్నమెంటు. మేం గాదంటానమ ? దాని పకారంగా ఇస్తనేవుంటిమి- దీంట్ల మీరు యింత యేం మాట్లాడినా చట్టాన్నికాదనోల్లు అయితరు- బాగ ఆలోచించుకోండ్లి- మీ మంచికె చెప్తున్నం" అన్నరు.

ఇదేందిరో యేమొ సట్టమని చిక్కులబెడ్తాండొ అనుకున్నరు-

"సట్టవేందిర సట్టం, రూపాయిబెట్టి యెటు దిప్పితె అటు మలుగుతది సట్టం" గోడపొంట నిలబడ్డోల్ల యెవడో అన్నడు.

"ఏమ్, ఎవలది- బయటికి నడ్వండి- గంత దెల్సినోల్లు గీడికెందు కచ్చిండ్లు" ఆపీసరు.

"గల్లదుగుండ్లి బొంకేను- పనిలేకచ్చిండ్లు" ఆమాట యెవలనన్నడొ ఆపీసరుకు అంతుపట్టలె- కొంచెం కండ్లులేబట్టి చూసిండు- ఆమాట అన్నాయినె జేబుసదురుకుంట బీడిముక్క యెనుకులాడుకుంట లేశిపోతాండు.

"అదిగాదుసార్, గీ సట్టాలు పట్టాలు మాకోసం జేసినయికావు- యివి పేట్ల కోసం జేసినయి- గిదే సట్టం జెయ్యకముందు ఇంట్ల ఒక్కడు పనేత్తె కుటుంబమంత తినేది- ఇప్పుడు ఇంట్ల అందరు జేసినా తిండికెల్తలేదు- యిగ మరి దరల పకారంగ కూలెక్కడ బెరిగిందొ మాకైతె దెల్తలేదు" కార్మికుడు.

"గచెట్లనయ్య- అక్కడ పైసపైస లెక్కగట్టి పెరిగినరేట్ల పకారంగ మీకు డి. ఏ పెంచుతాండ్రుగద, దాన్ని మనం కాదనగలమా ?" లేబరాపీసరు.

"అయ్యా నాదొక్కముచ్చట- కొంచెం మంచిగ మన్సులబెట్టాలె"

"పర్వాలేదు- చెప్పవయ్యా" ఆపీసరు.

"గీ డిఏలు గిఏలు చెయ్యకముందు మా జీతం 150 రూ. లుండె- అప్పుడు ఆ జీతంతోని మొత్తం బియ్యమేతీసుకుంటె, అప్పటిదర 32 లేక 33 రూ. బస్తా చొ॥ యెంతలేదన్న నాల్గున్నర బస్తాలచ్చేటియి. యిప్పుడు మాజీతం 460/- రూ. అంటె మూడువంతులు బెరిగింది. కని యిప్పటి మాజీతంగన్క మొత్తం బియ్యమేకొంటె బస్తన్నరకంటె యెక్కువరావు. మూడుబస్తాలబియ్యం మాయం. యిగ పెరిగిన దరల పకారంగ యేడబెరిగిందొ మీరేచెప్పాలె" కార్మికుడు.

"ఇగోమిష్టర్, నీపేరేందొ. (చెప్పిండు) అచ్చ, ఎల్లయ్యా : గవర్నమెంటు సూపెట్టే దరలపట్టిక సరిగలేదంటవా ?"

"కరక్టేసార్"

"మరి డిఏ లెక్క తప్పంటవా?"

"లేద్సార్- గని గండ్లోతిర్కాసున్నది."

"యేంటిది?"

"గీ డిఏ సట్టంజేసినప్పుడు మా జీతంమొత్తంమీద డిఏ పెంచేటోలు. సగం సగంజేసి, సగంమీద డిఏ అన్నరు, సగంబేసికన్నరు. ఈ బేసికన్నది పోలియో రోగమచ్చిన కాలోలె కుర్సయింది. డిఏమొ లెక్కప్రకారం బెరిగింది. అట్లబేసికని ఇదని లేకుంట కలిపిస్తున్న జీతాన్ని అప్పట్నుంచి లెక్కగట్టండిసార్. మీకేదెల్తది" ఎల్కయ్య.

"యే సబ్ బక్వాస్ సున్‌నేకెలియె ముఝె వక్త్ నహీ హై- బొంబై మె డైరెక్టర్స్ మీటింగ్ హై- హమ్ జారైం-" మేనేజుమెంటు లేచిపొయింది.

లేబరాపీసరు "లేకుంఉందయ, యేమైు అన్నిమొండిసవాల్లు జేత్తరు. వాల్లు పెదపెద్దోల్లు పనులుండయ? యిగ నీకోసం కూసుంటరా వాల్లీడ- మీకు మాట్లాడె తరీకదెల్వదయ- మిషిన్లిరగ్గొడతమన్నరట గద- యేదో అయ్యా అప్ప అనాలె, పైసో రొండుపైసలో రాబట్టుకోవాలె" అన్నడు.

"అంటె అన్నోల్లంత మిషిన్లిరగ్గొత్తరా సార్- యింట్ల పొలగాండ్లు వూకె సతాయిస్తాంటె "పీనియవ్వ, పోరన్ని రొండుగాల్లుబట్టి బండగొట్టి" అంటరు- గని గంతల్నె ఆ పోరడె పోటాట్టియిదాకిపడ్తె వాల్లపానాలు తండ్లాడ్తయ్- జెప్పనలేవట్టి ఎత్తుకుంటరు- గంతేగని మేము మిషిన్లిరగ్గొట్టెటోల్లం గాదుసార్- కష్టంజేసి కూలడుగుతానం అయ్య అప్ప అనుడెందుకు, అడుక్కతింటానమ?"

"నాదేంబొయింది, పోండ్లి పోండ్లి- కన్సిలేసున్ మీటింగు ఫేలయిందని రాశిపారేత్త- యిగ కోర్టులెంబడి దిరుగుండ్లి"

"పెదపెద్దోల్లట- పెద్దపెద్దోల్లు ఎట్లయిందో?" ఒకడు.

"అవన్ని యిక్కడ మాట్లాడకండి- మంచిది యిగ మీరుయెల్లిపొండి, యెల్లండి" లేబరాపీసరు.

* * *

మాడిపోయిన గడ్కకుండను అంపలికాడవంగి కశికెతోవి గీకుతాంది బుచ్చవ్వ. పెద్దపోరి సారవ్వ గుట్టకు పిడ్కలేరబొయింది. రొండోడు రాజిగాడు ఒర్రెల ఎర్గ

బోతాండు- చిన్నోడు సీనిగాడు అవ్వ సింగులుబట్టుకొని ఓచేత యిరిగిపోయిన గంటె బట్కోని దాన్నిదీన్ని కొడ్తాండు- "యెహె ససరాదుర, అయింతకంచుడు నాశిన మైతది" అనుకుంట పొలగాన్ని దూరంగొట్టింది- సద్దులయ్యాల్లయితందని ఓపారి మిల్లు గేటుమొకాన దడిగట్టిన తంగేడుపొర్కలమీదికెల్లి లేశిసూసింది. గేటులకెల్లి పట్టాల మీన టిప్పర్రైలు కాలిపెయినబొగ్గు తీస్కత్తంది. ఆబొగ్గు ఈడ ఒర్రెపొంట పోస్తరు- గదె గుట్టలు గుట్టలు అయింది. ఆడోల్లకు మొగోల్లకు గవ్వేపాయికాన్లు అక్కడ. మల్ల నడుంవంచిగీకుతాంది. గింతల మిల్లులకెల్లి "గుఁయ్యి"మని ఒకటే మోత- యాల్లగానియాల్ల గిప్పుడు గిదేందని అందరు పనిడిసిపెట్టి ఇవుతలకచ్చి సూత్తాండ్రు. యింకేమున్నది "వురుకుండ్రి వురుకుండ్రి, మిల్లుకాలిపోతంది, యెగిరి పోద్దట, ఊరికూరే లేశిపోద్దట- వురుకుండ్రి వురుకుండ్రి" అని ఒర్రుకుంట ఒగాయినె ఆ గుడిసెల్లకెల్లి ఉర్కతాండు. మిల్లుమొకాన సూపెటాల్లకేమున్నది గేట్లన్ని బార్లా దీసున్నయి- అన్నికాతలల్లకెల్లి మంది ఒక్కపారే గుబెల్లున బైటికచ్చిండ్లు- అంత అల్లిబిల్లి అల్లిబిల్లిగ వుర్కతాండ్లు- అక్కడ ఆసిడ్టాంకి లీకయిందట- బుస్సుమని పొగలెల్లుతానయ్- ఆపొగ యెవలుగింతబీల్చినా యిగవాల్లు అక్కన్నే అయిపోతరట- గ పొగలు యెక్కువయి యెక్కువయి చిన్నగ చిన్నగ మంటలుబుట్టినయ్- అది టాంకీకి అంటేటని మొదలయింది. యిగ ఆయింత టాంకీదాకచ్చిందంటె అమిరికోని బాంబుకంటె యెక్కువనే యేగుద్దట యింకేమున్నది ఊరుకూరు బూడిదకుప్పోలె లేశిపోద్దట- మిల్లుల డేంజరుసైరను బెట్టిన్లు. అందరు పనులిడిసిపెట్టి యెక్కడోల్లక్కడ పరారుగమ్మని, మిల్లుమొత్తం గాలికిడిసిపెట్టి మేనేజుమెంటోల్లు ఆపీసర్లు పెద్ద పెద్ద ఇంజనీర్లు సూపరువైజర్లు అందరు వాల్లకున్నకార్లు, జీపులు, మోటరుసైకిల్లు యేసుకొని తుపాకిగుండుకు అందకుంట గేట్లకెల్లి గుంయ్ గుంయ్న మాయమైండ్లు. కార్మికులందరు ఆగమాగమైతాండ్రు- గుడిసెల్లజనం దొరికినకాడికి చెంబో కడుముంతో అందుకొని చిన్నచిన్న పోరగాండ్ల సంకలేసుకొని, జెర పెద్దపోరగాండ్ల చెయిబట్కోని గొరగొర గుంజుకుంట ఒకటే ఉరుకుడుబెట్టిన్రు.

అందరు గుట్టమొకాన ఉరుకుతాండ్లు- గుట్టకు పిక్కలేరబెయిన సారవ్వ మిల్లు కాతయిని యిటుజూత్తె యేమున్నదీ యిగ ఓ తుపాను గాలికి ఆకులు గొట్టపొయినట్టుగ ఊరుకూరె మనుషులంత కొట్కత్తినట్టు కనపత్తంది- ఉర్కెటోల్లుర్కంగ శాతగానోల్లు ఒర్రెపొక్కల్ల దాక్కున్నరు. ఒకిగొడిగి పన్నరు- ఆడ మిల్లుల ఆసిడ్ టాంకికి దగ్గెరి కత్తంది- దాన్ని జూత్తాంటె యెవలకు వురికెటానికి కాల్లుగూడ లేత్తలెవ్వు- యేందో పిరికిజొచ్చింది. యిగ నిమిషాల మీదున్నయి పానాలు- అగో డాం అంటది అయిపాయె

కవితలు :

చెరపాట

దామెర రాములు

మోటబావులదగ్గర
పంటచేలకు నీళ్ళు పెడుతున్నప్పుడు
పంటనోటికందని రైతన్నకి
సిపాట
మోటబొక్కెన కంఠంనుంచి
పోరాట గలగలల్ని విన్పించటం
చూశాం ...

కోండ్రులేసిదున్నిన నల్లరేగళ్ళ
తొలకరిజల్లుతో పులకరిస్తున్నప్పుడు
కమ్మటి వానవాసన
సిపాటల పరిమళాల్ని పంచటం మేం
అనుభవించాం....

అయిపాయె అనుకుంటాండ్లు- అట్ల బొయ్యేటోల్లు బొంగ పానాలకు తెగిచ్చిన కార్మికలు గూడ వున్నరు- యింజనీర్లందరు పొయినా దాని సంగతి కొద్దోగొప్పో తెల్సినోల్లున్నరు. అయితె గింత గాలి మింగకుంట టాంకికాడికిబొయి ఆసిడ్ కంట్రోలర్ బిన తిప్పాలె- దైర్నంజేత్తండ్లు- యెన్క-ముందయితండ్లు- యెట్లయిన పొయినపానం బోనేపోతది అని నిండముసుగు కప్పుకున్నరు- ముక్కులు బాగ గట్టిగ మూసుకున్నరు- సావుకు తెగిచ్చిపొయిండ్రు- మంటలు బెర్గినయ్- పొగ నిండుకుంటాంది- టాంకి కాడ ఆగంల కంట్రోలర్ బిన గూడ జెప్పున దొరుకుతలేదు- అసలే తత్తరపాట్లున్నరు- ఆటీటనంగ ఒగాయినెకు దొరికింది- యిగ బలంకొద్ది దాన్ని గట్టిగ ఒప్పిండు- కండ్లు మూసుకొనే వున్నడు- మొస ఆపుకొనేవున్నడు- యెంబడె మల్ల యెన్కకు దూరం వురికచ్చి బోర్ల బొక్కలపడ్డడు- అడ నోరుదెరిసి ఒగరుగొడ్తాంటె నోటెకు మన్నుబోతాంది- "హేయ్ హేయ్- బందయింది బందయింది" దూరంనుంచి సూసెటోల్లు మొత్తుకుంటాండ్లు. ఉర్కెటోల్లు ఆగిపొయిండ్రు- ఆగినోల్లు ఆగినకాన్నె మొసలుపోత్తాండ్రు- నిలబడ్డోల్లు నిలబడ్డకాన్నే కూలబడి ఒగరుకొడ్తాండ్లు- ఒర్రె పొక్కల్ల పన్నోల్లు మెల్లెంగలేత్తాండ్లు పోరగాండ్ల దగ్గెరికి దీసుకొని గుండెలకు అదుముకొని మల్ల కండ్లజూత్తమనుకో లేదనుకుంట యేడిసేటోల్లేడ్తాండ్లు- ఆసిడ్ టాంకి బంజేసిన ఆయినెకుగూడ అందర్ని జూపెటోల్లకు మొకం సంబురంతోని యెలిగిపోంగ కండ్లల్లకెల్లినీల్లు టపటప రాలినయ్

బస్తీలలో కార్మికుల పేటలలో
గుక్కెడునీళ్ళకోసం క్యూలుకట్టినవాళ్ల
మిన్నంటేధరల్ని భూమ్మీదకిదించేవాళ్ళ
జీవన్మరణ సమస్యలతో
విసిగి విసిగి వేసారి
సమర సన్నద్ధులౌతూన్నవాళ్ల
గొంతుగొంతులో
నీ గీతం గర్జించటం
విన్నాం....

ఈ దేశంలో....
తాము జీవించలేకనేకాదు-
జీవితం సాగించలేనివాళ్లకోసం
పోరాటంసాగించిన కొడుకులూ కూతుళ్లూ
బూటకపు 'సంఘర్షణ'లో తుపాకిగుళ్ళకి
గిలాగిలా కొట్టుకుని నేలకొరుగుతూ
విడుస్తోన్న తుదిశ్వాసల్లో
నీపాటల నాదాల్ని విన్నాం.

భూమిసమస్య అటోయిటో
భూమ్మీదనే తేల్చేసుకోవాలనీ
నాగేటిచాళ్లలో
నడుంకట్టినడుస్తోన్న
గుంపులు గుంపులుగా
జైయిళ్లలో విందుతోన్న
కల్లోలిత రైతాంగ
హోరు....
నీపాట
ఆపాట మూగవోవటం
మేమూహించలేం....

విముక్తగీతంపాడిన నేరంగా
కళాయుధంవాడిన ద్రోహంగా
నినుబోనెక్కించినపుడు
సంకెళ్ళలో ధ్వనించిన
చట్టంపై సమ్మెటపోటైమ్రోగిన
ప్రాణప్రదాయిని
ఉద్వేగభరిత
ఉత్సాహసరిత
నీగీతం
గొంతుకలోనే నిలిచిపోవటం
మేమెట్లాఊహించేది ?
ఎట్లా సహించేది ?

పోరుకోసం
నువ్వుపాడిన-
పాటకోసం....
పోరుబాటలో మేం
ఊపిర్లు పరుస్తాం....

నేను నావాళ్లని వెదుక్కుంటాను

సాగర్

నేను నావాళ్ళని వెదుక్కుంటాను
నా అక్షరాలని
సమేకమై నడుస్తున్న నావాళ్ళల్లో చదువుకుంటాను
అప్పుడు అక్షరం వాళ్ళఅడుగులకి జాడ
రోడ్డుమీద నడుస్తుంది
వానలోతడిసి
ఎండలో ఎండిపోతుంది
శత్రువు నిర్బంధంలోచిక్కి చివికిపోతుంది
అయినా అక్షరం నడుస్తూనే వుంటుంది !

అప్పుడు నేను శబ్దంతో, ఒప్పందం చేసుకుంటాను
వాళ్ళవూపిరికి ప్రతిస్పందించమని కోరుకుంటాను
ఒకోసారి ఆలోచనలని బతిమిలాడ్తాను
ఒరిగిన అన్నలరూపాలు చిత్రించమంటాను
వాళ్ళతో అల్లుకపోయిన అక్షరం
నన్నుచూసి గంభీరంగా నవ్వుతుంది
తా వాన్ని తనగుండెల్లో దాచుకుంటుంది
అప్పుడు ఎంతగానేను తల్లడిల్లిపోతాను!

ఒకోసారి అక్షరం
"ఎదురుకాల్పు"ల్లో తలకిందులవుతుంది
ప్రతితూటాకీ ఒకో అక్షరం దూరమవుతుంది
ప్రజలగుండెల్లోంచి ఆ అక్షరం ఎంతకూనాకు దగ్గరకాదు
వాళ్ళని పెనవేసికోపోయిన దాని అనురాగానికి సిగ్గుపడ్తాను!

అప్పుడు నేను అక్షరమవుతాను
దుఃఖంతో గొంతుపూడుకపోయినా నేను సొల్లుపోను
ముందుకు సాగిపోతుంటాను
నడవాల్సినదూరం ఎక్కువున్నప్పుడు
నడక కష్టమనిపించదు
అక్షరంవెనుక అక్షరంవుండనేవుంటుంది
అప్పుడది మాటవుతుంది, పాటవుతుంది
తోటి నేస్తమవుతుంది, చేతిలో పుస్తకమవుతుంది
ఇప్పుడు నేనెంతమాత్రమూ భయపడను
శత్రువుమీద ఎదురుదాడికోసం సిద్ధంగావుంటాను
అప్పుడు నాకుకొమ్ములూ, దీర్ఘాలూ, వత్తులేకాదు
వెనువెంట ఆయుధాలూ వుంటాయి!

[కా॥ బత్తుల బక్కయ్యకి అంకితం]

షోకుపిల్లి

నక్సల్బరీనుంచి ఇంద్రవెల్లిదాకా
ఎన్నోకొన్ని వాడి కలంపేల్లే
ప్రతిఅక్షరం రాజేసిన విప్లవకణిక
ప్రతిశీర్షిక ముట్టించిన డైనమెట్
లావానిప్పుక్కిటపట్టి చదువుతాడుకవిత
ఈదేశం నన్ను విద్రోహినివ్వదంటాడు
సందర్భంఏదైనా కొటేషన్లకి కొరతుండదు
చిరుగడ్డం యిస్త్రీమడతతో
కడిగిన ముత్యంలావుంటాడు
అంతా సజావుగానేవుంది
కానీ
ఎక్కడో ఏదోఅయింది
రోడ్లమీద జనంవరద
ఏమిపోగొట్టుకొన్నారో
ఏది రాబట్టుకోవాలనుకొంటున్నారో
చేతుల్లోమొలిచిన ప్లేకార్డ్సు చెబుతున్నాయి
నీరుకావాలని
కష్టంచేరకు పిడికెడు మెతుకులురావాలని
చెదిరినరక్తం చిందించినచెమట కట్టిన
గుడిసెబతుకుకూల్చే హక్కెవరికీలేదని
మొన్నోవూరేగింపుసాగింది.
అన్నిదారులు బంద్అయినచోట
పోరాటమే చివరిదారని
శత్రువుచేత ఆయుధంవున్నంతవరకూ
సాయుధంకాకతప్పదని
మానానికీ ప్రాణానికీ పిడికెడుమెతుకులకీ
ఆయుధం కావలాని
బతుకుబడిలోనేర్పిన ఓనమాలు
రాయించిన ప్లేకార్డులు

ఉలికిపడ్తోన్న నినాదాలతో
గుడిసెలోళ్ళనుంచి గల్లీలోళ్ళదాకా
వాడవాడగరీబోళ్ళు గొంతుకెత్తి సాగారు.
ఊరేగింపుకవితకి మంచివస్తువే.
గొంతుకిఎంతోపని
వేలికళ్ళల్లో వొడువాటి ఛాయాచిత్రం.
ముందూవెనకా అంతటా
తానేవూరేగింపై కదిలాడువాడు
రానేవచ్చిపడిందంతలో తా'కాసు'లమూక
పర్మిషన్ లేదన్నారు
వూరేగింపులో తీవ్రవాదులున్నారన్నారు
ఇంకా ఏమన్నారో వినేలోపే
లాఠీపై లాఠీవిసిరారు
గోలీవెనక గోలీపేల్చారు
జనం పరిగెత్తారు
జనం చెప్పులు రాళ్ళూరువ్వారు
జనం బూతులు విసిరారు
జనం చేయగలిగినంతచేశారు
ఊరేగింపులో మనవాడూవున్నాడు మర్చిపోకండి.
వాన్ ఆగిఆగగానేవాడు
నినాదంకన్నా వేగంగా ఎటోపోయాడు.
యుద్ధకాలపు విలేఖరిలా
జరిగేదంతా 'వీక్షించాడు'
తద్రితకి నిర్వచనం తెలిసినవాడు
మాటలకి పదును పెట్టుకొంటున్నాడు
బహూపరాక్ !
బహూపరాక్ !

— జమీర్

దృక్పథం :

జాతుల సమస్య

కె. వి. రమణారెడ్డి

ఈ విషయానికి సంబంధించి 'సృజన'లో జరుగుతూన్న చర్చదృష్ట్యా నాలుగు మాటలు రాయాలనిపిస్తూంది.

మునుముందుగా, పారిభాషికపదాలూ వాటిఅర్థాలూ కొంతచిక్కు కలిగిస్తున్నాయి. ఇంగ్లీషుపదాలకు సమానార్థకమైన తెలుగుపదాలు వాడుకలోవున్నా, వాటి అర్థచ్ఛాయల విషయంలో భేదాలులేకపోలేదు. 'నేషన్' అనేది 'నేటస్'నుంచి వచ్చిన ఇంగ్లీషుశబ్దం, 'నేటస్' పుట్టుకకు సంబంధించినమాట. అయినా ఇది 'రేస్' అనేదానికి సరిపోదు. గురజాడ అప్పారావురాసిన 'జాతం'అనేది 'నేటస్'ను సరిపోలవచ్చు. అయినా ప్రపంచంలో ఏజాతీ ఒకేమూలంనుంచి ఏర్పడిందని అనలేము. స్టాలిన్ నిర్వచనంలోని నాలుగుఅంశాలతో 'నేషన్'ను నిర్వచించవచ్చు. అయితే, కొందరు సోవియట్ కామ్రేడ్లుచేసిన లోపాన్నెత్తిచూపుతూ, జాతికీ రాజ్యాంగయంత్రానికీ ముడిపెట్టడంగురించి స్టాలిన్ లేవనెత్తిన అభ్యంతరాన్ని జాగ్రత్తగా పరిశీలించవలసివుంది. తనదైన స్వతంత్ర రాజ్యాంగయంత్రం సాధించుకోలేక, ఒకస్థిరమైన భూభాగంలో చాలాకాలంగా నివశిస్తూ, ఒకవిధమైన భాష, సంస్కృతికలిగి, ఆర్థికంగా కూడా ఒకపాటి ఐక్యతను సాధించుకున్న ప్రజాసముదాయాన్ని 'నేషన్' అనిబూర్జువా రాజనీతివేత్తలు భావించరు. దాన్ని 'నేషనాలిటీ'అని వ్యవహరిస్తారు. నేషనాలిటీ+రాజ్యాంగ యంత్రాంగనేషన్ అంటారు.

'నేషనాలిటీ' అనేమాటకు వేర్వేరుఅర్థాలున్నాయి. 'ఉపజాతి' అనేదొక్కటే ఆమాటకు అర్థమనుకోవడం సరికాదు. జాతిభావాన్ని వర్ణించడానికికూడా ఆమాటను వాడడం జరుగుతూంది. జాతిభావమూ జాతీయవాదమూవేరే. అన్యప్రాంతంలో స్థిరావాసంచేస్తూ, భిన్నమైనభాషనూ సంస్కృతినీకలిగి, ఆర్థికంగానూ రాజకీయంగానూ కూడా వేరనిపించే మరొక ప్రజాసముదాయాన్ని వేరొకజాతిగా ఉంచుతూ, తామంతా ఒకేజాతికి చెందినవారమని భావించే ఒకానొక ప్రజాసముదాయానికి జాతిభావమున్నట్టు లెక్క.

ఈ 'సెమాంటిక్' ప్రస్తావనతర్వాత గుర్తించవలసిన అంశం ఏమిటంటే, నేషన్ (జాతి) అనేది యూరపుచరిత్రలో మధ్యయుగాల చివరిదశతాలూకు భౌతిక పరిస్థితులనుంచి పుట్టుకొచ్చినభావం. భూస్వామికయిగంలో అదిలేదు, భూస్వామ్యాన్ని

'సంఘటిత అరాజకం' (arpanised anarchy) అని వర్ణించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వాధికారం ఒకనిర్దిష్ట భూభాగంలో అంతటా వ్యాపించనీకుండా, ఎక్కడికక్కడ స్థానిక భూస్వాములు సొంత సేనలతో న్యాయస్థానాలతో యథార్థంగా చిల్లరమల్లర ప్రభువుల్లావుంటూ రాజకీయసమైక్యాన్ని అసాధ్యంచేస్తూ వచ్చారు. అప్పట్లో దేశాభిమానం వుండేదేమోగాని జాతిభావంలేదు. దేశంలో ఏప్రాంతానికాప్రాంతం స్వతంత్ర రాజ్యంలాగుండేదిగనక, దేశాభిమానంకంటెకూడా ప్రాంతీయాభిమానం బలీయంగా వుండేదని అనవచ్చు. వర్తక, వాణిజ్యాలు సాఫీగా దేశమంతటా సాగాలంటే, యీ స్థితి అడ్డంకిగావుండేదిగనక, కొత్తగా బస్తీలలో తలెత్తసాగిన బూర్జువావర్గం యీ అరాజకాన్ని తొలగించేందుకు, నిరంకుశ కేంద్రప్రభుత్వాధికారాన్ని స్థాపించగోరిన రాజులకు వత్తాసిగా నిలిచింది. భూస్వామ్యవ్యవస్థ పతనానికి తాను రాజులతో సహకరించింది. భూస్వామ్యవర్గం అణచివేతకుగురైన ప్రజాసామాన్యం కూడా యీ పరిణామాన్ని కోరుకొంది. ఇరుగుపొరుగుదేశాల రాజులు దీర్ఘకాలం సాగించిన రాజవంశాల యుద్ధాలలో— ఉదాహరణకు, ఇంగ్లాండు, ఫ్రాన్సుల మధ్య నూరేళ్ళపాటు సాగినయుద్ధం— యీ జాతిభావం బలపడింది. అయితే ఇలాంటి యుద్ధాలవల్ల రాజవంశాలకు చేకూరిన సత్ప్రయోజనాలు ప్రజలకందరికీ చేకూరాయని చెప్పడం సత్యదూరం. కాకుంటే, కొందరు రాజులు తమదేశాలకు చెందిన వర్తకులకూ వ్యాపారులకూ పరదేశాలతోనూ ఖండాంతరాల్లోనూ సదుపాయాలు కలిగించేందుకు పరదేశాల రాజులతో పోటీపడుతూవచ్చారు. ఈ పోటీ ఎన్నోయుద్ధాలకు అవకాశం కలిగించింది. పైకి రాజులు రాజులు కుమ్ములాడుకుంటున్నట్టు కనిపించినా, నిజానికి వీటివల్ల బాగుపడింది వ్యాపారబూర్జువావర్గమే. దీనిపెట్టుబడుల్లోనూ లాభాల్లోనూ రాజులకు వాటా వుండేదికూడా. కొంతకాలానికి భూస్వాములు కూడా యీ కొత్తవర్గంతో చేతులుకలపడం జరిగింది. స్థూలంగా చెప్పవలసివస్తే, నేషనలిజంకూ బూర్జువావర్గ ప్రాబల్యానికీ విడదీయ రాని సంబంధం ఉంది.

పారిశ్రామిక విప్లవం తర్వాత వ్యాపారబూర్జువావర్గాన్ని వెనక్కునెట్టి పారిశ్రామిక బూర్జువావర్గం పైకివచ్చింది. మంత్రులనూ, రాజులనూ, మొత్తంగా ప్రభుత్వాలనూ అది తన ధనాధిక్యతద్వారా లోబరచుకుని, జాతీయవాదం పేరుతో తన స్వలాభాన్ని పెంపొందించుకోసాగింది. ప్రజాసామాన్యం చాలాకాలందాకా యీ మోసాన్ని గుర్తించలేదు. కాని, అమెరికన్ స్వాతంత్ర్య యుద్ధం నుంచి ఫ్రెంచిమహా విప్లవం దాకా క్రమంగా జాతీయవాదం నిజస్వభావం తెలిసిరాసాగింది. ఫ్రాన్సులో

భూస్వామ్యాన్నీ నిరపేక్షరాజరికాన్నీ ప్రజాసామాన్యం సహకారంతో కూలదోసిన బూర్జువావర్గం కొద్దికాలంలోనే ప్రజాసామాన్యాన్ని కాదని, రాజ్యాధికారాన్ని చేబట్టింది అయితే విప్లవ భావజాలంలో ప్రధానాంశాలకింకా ప్రజాకర్షణవుండేది. ఫ్రాన్సును రాజకీయంగా సమైక్యజాతిగా రూపొందించి, ఫ్రెంచి విప్లవ వ్యతిరేకమైన అన్యదేశాల రాజులను ఓడించేందుకని సైనిక మహాశక్తిని నిర్మించి, మొదట్లో రిపబ్లికన్ ఫ్రాన్సు యూరపులో చిన్ని చిన్ని సకళ్లను సృష్టించింది. అయితే నెపోలియన్ చక్రవర్తి అయ్యాక, ఇతర యూరపియన్ దేశాలతో భూస్వామ్యవ్యతిరేక సంస్కరణలు కొన్ని జరుగుతూవచ్చినా, 'ఫ్రెంచి ప్రజల చక్రవర్తి'నని బిరుదువచ్చిన నెపోలియన్‌లో అను వంశిక సామ్రాజ్యకాంక్ష పెచ్చుపెరిగి, అన్యదేశాలలోనూ తనవారిని సామంతరాజులుగా చేస్తూ వచ్చిన ఫలితంగా, ఆ దేశాలలో జాతియాభిమానం వెల్లివిరిసింది. ఆ దేశాల రాజులు దాన్ని సొమ్ముచేసుకున్నారు. జర్మనీలోని లీప్‌జిగ్‌లో నెపోలియన్‌ను ఎదుర్కొని ఓడించారు. ఆ యుద్ధాన్ని 'జాతుల యుద్ధం' అని వర్ణించడం జరిగింది చివరికి వాటర్లూ యుద్ధంలో నెపోలియన్ మన్నుగరిచాడు. నెపోలియానిక్ యుద్ధాల పర్యవసానంగా వియన్నాలో జరిగిన శాంతి సమావేశం జాతిసూత్రానికి తిలోదకాలిచ్చి రాజుల, భూస్వాముల ఆశయాలకు అనుగుణంగా యూరపుఖండంలో సరికొత్త రాజకీయవ్యవస్థను ఏర్పాటుచేసింది. నాటినుంచీ (1815) 19వ శతాబ్ది అంతందాకా ఆ ఖండంలో జరిగిన అనేకయుద్ధాలు వియన్నా ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగినవే.

19వ శతాబ్దిలో జాతియవాదం పతంస్థాయి పొందిందని అంటారు. బెల్జియం స్వాతంత్ర్యం., గ్రీస్ స్వాతంత్ర్యం., జర్మనీ రాజకీయ ఏకీకరణ, ఇటలీ రాజకీయ ఏకీకరణ, పోలండు మొదలు ఐర్లాండు దాకా 1848లో జరిగిన అనేక పోరాటాలు, 19వ శతాబ్ది చివరిభాగంలో టర్కీ-సామ్రాజ్యాధికారానికి వ్యతిరేకంగా బాల్కన్ ద్వీపకల్పంలో ఎన్నో చిన్న చిన్న జాతుల ప్రజలు రాజకీయ స్వాతంత్ర్యం కోసం చేసిన యుద్ధాలు, ఆస్ట్రియా పెత్తనానికి వ్యతిరేకంగా, రష్యా పెత్తనానికి వ్యతిరేకంగా 'జాతుల బందిఖానాలు' అని వర్ణించబడిన ఆ మహాసామ్రాజ్యాలలోని చిన్నదేశాలు జాతియవిముక్తికోసం సాగించిన ఉద్యమాలు- వీటినన్నిటినీ మార్క్స్, ఎంగెల్సులు సాకల్యంగా పరిశీలించడం జరిగింది. బాల్కన్ ద్వీపకల్పంలో 'స్లావ్' జాతి ప్రజలు నివసించేదేశాలు టర్కీతో విరోధించినప్పుడు, దాన్ని సాకుగాతీసుకుని అటు రష్యాగానీ ఇటు ఆస్ట్రియాగానీ స్వప్రయోజన దృష్టితో టర్కీతో యుద్ధానికి తలపడినప్పుడు టర్కీని సమర్థించకుండానే రష్యా, ఆస్ట్రియాల కుతంత్రాలను ఎండగట్టారు. అలాగే

ఆ ద్వీపకల్పంలో చిన్న చిన్న 'స్లావ్' జాతి దేశాలమీద 'సకలస్లావ్' (పాన్‌స్లావ్) రాజ్యాన్నొకదాన్ని ఏర్పాటుచేయాలని ప్రయత్నించినప్పుడు కూడా మార్క్సు, ఎంగెల్సులు నిర్విమర్శగా దాన్ని సమర్థించలేదు. 20వ శతాబ్దంలోకికూడా దిగివచ్చిన యీ స్వార్థప్రయత్నాలతోబాటు, దాదాపు అర్థశతాబ్దకాలంగా తన అభ్యుదయస్వభావాన్ని కోల్పోయి పెట్టుబడి ఏరుమతులతో సామ్రాజ్యవాదంగామారిన బూర్జువావ్యవస్థ, తన జాతీయవాద విభేదాలను సాయుధవిరోధాలుగా పెంచుకున్న యుద్ధప్రయత్నాలు, మొదటి ప్రపంచయుద్ధానికి దారితీశాయి. యుద్ధానంతరం వెర్సెయిల్సులో జరిగిన శాంతిసంధి ఏర్పాటు, యూరపులో కొన్ని దేశాలకు రాజకీయ స్వాతంత్ర్యాన్ని గుర్తించినా, వలస దేశాల కోరికలను మాత్రం తృణీకరించింది. రష్యన్ జారిజాన్ని కూలదోసి ప్రపంచ చరిత్రలో తొలిసోషలిస్టురాజ్యాన్ని స్థాపించిన సోవియట్‌రష్యా, లెనిన్ సారథ్యంలో జాతులసమస్యను ప్రపంచ విప్లవ ఉద్యమంలో అంతర్భాగంగానే ఎంచింది. రెండో ఇంటర్నేషనల్‌లో కూడా జాతులసమస్యను బాగా పట్టించుకున్న బోల్షివిక్‌పార్టీ నాయకత్వం మూడవ ఇంటర్నేషనల్‌లో 'కలోనియల్ థీసెస్' ద్వారా జాతులసమస్యకు ఉచితమైన ప్రాముఖ్యాన్నే ఇచ్చింది. ఇది మార్క్సిజానికీ లెనినిజానికీ విహితమైన విషయమే. సిద్ధాంతాన్నీ ఆచరణనీ వేసుచెయ్యని శాస్త్రంగనక మార్క్సిజంలో జాతుల సమస్యకు ప్రముఖస్థానమేఉంది.

ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టువ్యవస్థ విజయంపొందేరోజు యిప్పట్లో లేకపోయినా, జాతివైషమ్యాలు ఎక్కువ తక్కువలు సమసిపోయేది అప్పుడేనని స్టాలిన్ చారిత్రిక ఆశాభావం ప్రకటించడం విపరీతమేమీకాదు. వసుధైక కుటుంబతత్వం (కాస్మోపొలిటనిజం) భావానికీ ప్రపంచ సోషలిస్టువ్యవస్థ భావానికీ భేదంవుంది. మొదటిది బూర్జువావర్గ ఆదర్శం. స్టాలిన్ దీనితో సిద్ధాంతరీత్యా ఆచరణరీత్యా పోరాడవలసివచ్చింది. వెండెల్‌విల్కీ 'వన్‌వరల్డ్' అమెరికన్ సామ్రాజ్యవాద సర్వాధిపత్యానికి ప్రతిబింబమే. రెండో ఇంటర్నేషనల్ రోజుల్లో కార్ల్‌కౌట్స్కీ ఒక విచిత్రమైన వాదం చేశాడు. మొత్తం ప్రపంచాన్ని రెండేరెండు మహారాజ్యాలమధ్య పంచి వాటిపెత్తనానికి లోబరిస్తే యుద్ధాలబెడదే ఉండబోదన్నాడు. యుగోస్లావ్ కమ్యూనిస్టు నాయకుడైన ఎడువార్డ్‌కార్డెల్జ్ 'సోషలిజమ్ అండ్ వార్' అనే పుస్తకంలో, సోషలిస్టు వ్యవస్థలో సైతం జాతీయవైషమ్యాలవల్ల యుద్ధాలు తప్పవని సిద్ధాంతం చేశాడు. సోషలిజం కావలసిందల్లా రివిజనిజమైతే, విదేశాంగ వ్యవహారాల్లో 'హెజిమొనిజం' లాంటి పెడధోరణులు ప్రత్యక్షంగా సామ్రాజ్యవాదానికి పర్యాయపదాలేనన్నమాట నిజమే. తప్పు సోషలిజంది మాత్రం కాదు.

సోషలిస్టురాజ్యం ప్రతిదీ ఏకజాతిరాజ్యం కాని స్థితిలో, అందులో వివిధ జాతులకు చెందిన ప్రజలమధ్య సామరస్యాన్నీ సంఘీభావాన్నీ సమైక్యాన్నీ చేకూర్చ గలిగింది, సోషలిస్టు వ్యవస్థకు సహజలక్షణంగా ఉండవలసిన ప్రజాస్వామికమే. సోవియట్ రష్యా ఏర్పడకముందు చిన్నచిన్న రష్యనేతరజాతుల ప్రజలను రాజకీయంగానూ ఆర్థికంగానూ మాత్రమేగాక సాంస్కృతికంగాకూడా అధీనం చేసుకునేందుకు జారిష్టు ప్రభుత్వం రష్యనీకరణ (రుస్సిఫికేషన్) విధానాన్ని వుద్దేశపూర్వకంగా అమలుపరిచింది. అలాంటి ప్రయత్నాలను లెనిన్ హర్షించలేదు. అలాంటి రష్యనేతర అల్పజాతి వుద్యమం జార్జియన్ జాతియోద్యమం, మరి స్టాలిన్ దానిలో నుంచే సోషలిస్టు వుద్యమంలోకి వచ్చాడు, సోవియట్ రష్యాలో జనాభారీత్యా సంస్కృతిరీత్యా అభివృద్ధిపొందిన 'గ్రేట్ రష్యన్' జాతికీ తదితర జాతులకూ మధ్య ఇప్పుడు పూర్తి సామరస్యం, సమానస్థాయిలేవు. బూర్జువా జాతియోద్యమాలనో మరొకటనో యీ చిన్న జాతుల అసంతృప్తిని అణిచివెయ్యటం జరుగుతూంది. ఇది రివిజనిజం జాతిసమస్య విషయంలో పొందుతూన్న వైఫల్యమే.

వెనకబడిన దేశాలు రాజకీయ స్వాతంత్ర్యంకోసం జాతియోద్యమాలను సాగిస్తున్నప్పుడు వాటికి అండదండలివ్వవలసిన సోషలిస్టురాజ్యాలు సహాయం పేరుతో సహకారం పేరుతో తమ ఆర్థికదోపిడీకి వాటిని గురిచేస్తూ రాజకీయప్రాబల్యం సంపాదించుకుని, తమ సైనికవ్యూహంలో వాటిని పాత్రలుగా వినియోగించుకుంటున్నాయి. జాతీయ స్వాతంత్ర్యోద్యమాలనూ విముక్తిపోరాటాలనూ వెన్నుపోటుపొడుస్తూనే పైకిమాత్రం బడుగుదేశాల మిత్రులమని కితాబులు పొందుతున్నాయి. ఈ ఉద్యమాలనూ పోరాటాలనూ ముందుండి నడుపుతున్నది ఆయాదేశాల బూర్జువావర్గాలేనని అనలేము. భూస్వామ్యవర్గాలు, తెగపెద్దలు, మతాధికారులు, నడుపుతున్న ఉద్యమాలూ పోరాటాలుకూడా ఉన్నాయి. అంతమాత్రాన వాటిని కొట్టివెయ్యడం మార్క్సిస్టు - లెనినిస్టులకు తగనిపని. ఎందుకంటే, అంతిమంగా లాభపడేది ఆ దేశాల ప్రజాసామాన్యమే. అందుచేత, మొత్తం ప్రపంచానికి సంబంధించి జాతిసమస్య గురించి సార్వత్రికమైన సూత్రీకరణ చెయ్యడం, మార్క్సిజం - లెనినిజంకే వ్యతిరేకం.

అసమానాభివృద్ధి పెట్టుబడిదారీవిధానంలో తప్పనిసరిఅనడం నిర్వివాదమేగాని, పెట్టుబడిదారీ విధానంలక్షణాలలో కొన్నయినా మిగిలివున్నంతకాలం సోషలిస్టువిప్లవం వచ్చిన దేశంలోకూడా అదివుంటుందా, లేదాఅనేఅంశం చర్చనీయంకాదనగలమా? గ్రామానికీ నగరానికీమధ్య యింకా వైరుధ్యంవుంటూ, అభివృద్ధిక్రమంలో వ్యవ

సాయానికీ పరిశ్రమలమధ్య అసమానత వుండకపోతుందా ? పరిశ్రమోత్పత్తి వస్తువులకూ వ్యవసాయోత్పత్తి వస్తువులకూ మార్కెట్‌ధరల్లో సమతూకంవుంటుందా? దానినటుంచి, సోషలిష్టువిప్లవం జరగకముందునుంచికూడా ఒకదేశంలో పెట్టుబడిదారీ విధానం ఒకానొకప్రాంతంలో అభివృద్ధిపొందినంతగా మిగిలినప్రాంతాలలో పొందనప్పుడు, ముందుమిగిలినప్రాంతాలు వెనకబడిన ప్రాంతాలమీద తమ ఆర్థికఆకత్యాన్ని ఏదోరూపంలో చలాయించవా ? రష్యాలో ఉక్రెయిన్‌లాంటి వ్యవసాయిక ప్రాంతాలనటుంచి, ఆర్మీనియా, జార్జియా, అగర్‌బైజాన్, టర్క్‌మానియా వగైరా ప్రాంతాల సాంస్కృతిక పరిస్థితేగాక ఆర్థికపరిస్థితి గ్రేట్‌రష్యాపరిస్థితి ఒకటిగానే ఉందా ? వెకబడివున్న (సాపేక్షంగానైనా) యీప్రాంతాలకుచెందిన ప్రజలు ఏసైబీరియాతో ఆర్క్‌టిక్‌ప్రాంతానికో రష్యన్‌నగరాలకో కూలీలుగా పనివాళ్లగా వలసలు వెళ్లిరావడంగురించి చదువుకుంటున్నాం. అందుచేత అసమానాభివృద్ధి అనేది ఇలాంటి పరిస్థితులలో ఆంతరంగిక వలసలపద్ధతికి ఆస్కారమిస్తుందని నిర్ధారణచెయ్యగలమా ? పేరుఏదైనాకావచ్చుగాని, వాస్తవం ఏమిటనేది అసలుప్రశ్న. పెట్టుబడిదారీ విధానంలో నిస్సిగ్గుగా నగ్నంగాజరిగేదే, పరిణతిపొందని సోషలిస్టు విధానంలో ఒకదేశంలోగాని, కోమెకాన్‌లాంటి అంతర్జాతీయసంస్థలద్వారా పలుదేశాలమధ్యగాని అవాంఛనీయమైన ఈ పరిస్థితిని కొనసాగించడం ముసుగులోజరుగుతున్నదనేఅనాలి.

II

పిరమిడ్‌ఆకృతిలో జాతులదొంతరగా మనదేశంలోని జాతివిషయాలను సురా వర్ణించారంటే, భావసంబంధమైన చట్రం (Concystnol framework) ఒకటి అవసరమనుకునే ఆధునిక విద్యాధికుల 'అకేడమిక్' పద్ధతికి అనుగుణంగానే జరిగి వుంటుంది. దానివల్ల గజిబిజి ఏర్పడితే వేరేవిషయం. భారతదేశంఅనేది ప్రదేశపరమైన మాటే (only a geographical expression) తప్ప, భారతజాతిఅనేది ఏదీ లేదని బ్రిటిష్ వలసాధిపతులు అంటూవచ్చారు. వెనకటికి ఏన్నోరాజ్యాలుగా చీలి వుండిన ఇటలీగురించి ఆస్ట్రియన్ సామ్రాజ్యాధిపతులు వాడినమాటేగాని ఇది కొత్తదేమీకాదు. ఆధునికమైనఅర్థంలో, సమైక్యభారతజాతి లేదనడానికీ, వలసాధిపతులు హిందూ, ముస్లిం మతవర్గాలను (religious communities) భిన్నజాతులని భావించడమే కారణం. ముస్లింలీగ్ 1940 నాటి లాహోర్‌సమావేశంలో ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రకటించడానికి ఎంతోముందునుంచీ వలసాధిపతులు తరుచూ ఈమాట అంటూ రాలేదా ? దేశంలో 'నేషనాలిటీస్' (ఉపజాతులు), 'నేషనల్‌గూప్స్' (జాతీయ

బృందాలు) అసంఖ్యాకంగా వుండటట్టి, యీ విభిన్నత దృష్ట్యా సమైక్యతలేదని భావించేవాళ్లు. ఇది వైవిధ్యమేగాని (డైవర్సిటీ) విభిన్నత్వంకాదనీ, వైవిధ్యంలో ఏకత్వం (unity in diversity) ఉందనీ బూర్జువాజాతీయవాదులు, అంతకంటె ముందునుంచీ బూర్జువావర్గ భావప్రచారకులూ (Ideologues) అనేవాళ్లు. ఇంతకీ భారతజాతి వున్నట్టా, లేనట్టా?

హైందవ పునరుద్ధరణవాదకాలంలో, భారతజాతి భావాన్ని నిరూపించేందుకు తాత తాతలనాటికతలు తవ్వితలకెత్తే ధోరణి ప్రస్ఫుటమైంది. వేదాలలోని నదీసూక్తం, దేశప్రజలందరూ అభిమానిస్తారనిచెప్పే భారత, రామాయణాలు, కట్టూబొట్టూ మాటా నడకావేరైనా సర్వసాధారణమనిచెప్పే హిందూమతం, సంస్కృతి, యిలాంటివాటిని ఎత్తిచూపుతూ వచ్చారు. హిమాలయాలనుంచి సముద్రందాకా ఉత్తరదక్షిణాలుగా వ్యాపించినదేశాన్ని భారతదేశమనీ, దాని "సంతతి"ని భారతీయులనీ అనాదిగా పేర్కొంటూవచ్చిన శ్లోకాన్ని చూపారు. జాతిభావానికీ దీనికీ తేడావుంది. ఆర్యభాషా ప్రజల విస్తరణకు ముందునుంచీ మనదేశంలోని ఎన్నెన్నినరవర్గాలకు (Races) చెందినవారొచ్చి చాలావరకు నిలిచిపోయారని చరిత్రపూర్వయుగంనుంచీ విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు చూపవచ్చు. వారిసంస్కృతిమీద ఆర్యసంస్కృతిని బలవంతాన మోపడంజరిగినా, అవి ఒకదాన్నొకటి ప్రభావితంచేసుకున్నమాట నిజం. ద్రావిడసంస్కృతికూడా ఒకప్పుడు దేశాన్నంతటినీ కమ్మేసుకునివుండేది. ద్రావిడులకంటె ముందుగానే మనదేశానికివచ్చిన నీగ్రాయిడ్, ఆస్ట్రిలాయిడ్, వగైరా ప్రజా సమూహాల జీవనవిధానం అరణ్యాల, పర్వతాల ప్రాంతాలలో సముద్రంలో దీవిగడ్డలలా కొనసాగుతూవచ్చింది. అందుచేత ఆర్యుల దండయాత్రతోనూ విస్తరణతోనూ భారతీయమని చెప్పదగినజాతి అవతరణను లంకెవెయ్యడం తగనపని. జాతిభావం వుండివుండవచ్చు. జాతిలేదు, ప్రాచీనచరిత్రలోగాని, మధ్యయుగాలలోగాని, ఏ సామ్రాజ్యమైనా దేశంమొత్తాన్ని రాజకీయంగా ఏకంచెయ్యలేదు. బ్రిటిష్ సామ్రాజ్యం ఆపని చేసింది. ఆర్థికంగా దేశాన్నంతటికీ ఒకే మార్కెట్‌ను రూపొందించింది. సైనికబలంతో దేశాన్ని బంధించింది. 'పాక్స్ బ్రిట్టానికా' (Pax Brittanica) అన బడే బ్రిటిష్‌శాంతి దేశానికి శ్మశానశాంతిగా మారింది. ఈ పరాధీనతఫలితంగా, అనేకప్రాంతాలలో సంస్థానాధీశులో పాలెగాళ్ళో కొండతెగలవాళ్లో రైతాంగమో చేస్తూవే వచ్చిన తిరుగుబాట్లను అణిచి సమాజంలోని వివిధావయవాలను గాయపరిచి కట్టివేసిన ఫలితంగాకూడా, క్రమంగా వలసాధిపతులకు వ్యతిరేకంగా తామంతా ఒకటేనన్న

భావం మనప్రజలలో ఇంగ్లీషుచదువుకుని వృత్తులతోనో నౌకర్లతోనో బతికే మధ్య తరగతివారికి కలిగింది. మతరాజకీయసంస్థలు కొన్నికాంగ్రెసుకి ముందునుంచీ దేశవ్యాపితంగా తమ కార్యకలాపాలు సాగించాయి. సంపదసా్రవం (Drain), కరువు కాటకాలు, శిస్తుపన్నులుఘోరాలు, దమనచర్యలు, యిలాంటివన్నీ బూర్జువావర్గమంటూ ఒకటి నిశ్చితమైనరూపంలో తగుబలంతో మనసమాజంలోతలెత్తి కాలునిలబొక్కకోక ముందుగానే, జాతీయవాదాన్ని విజృంభింపజేశాయి. జాతీయభావం జాతీయత అయింది.

వందేమాతరమ్ ఉద్యమం, హోమ్‌రూల్ పోరాటం, సత్యాగ్రహ ఉద్యమాలు దీన్ని పెంచిపోషించాయి. కాంగ్రెసు సంస్థ నిర్మాణంతోనే 1919 నాటికి ముఖ్యమైన మార్పులు కొన్నివచ్చాయి. ప్రాంతీయ భాషను ఆధారంచేసుకొని, ఆ ప్రాంతానికి ప్రత్యేక కాంగ్రెసు సంఘాలను ఏర్పాటుచెయ్యడం వాటిలో ఒకటి. బెంగాలు విభజన రద్దుకాగానే (1911) బలవంతంగా పశ్చిమబెంగాలులో భాగాలైవుండిన బీహారు, ఒరిస్సాలకు మళ్ళీ ప్రత్యేకత ఏర్పడి, మొదట బీహారుకూ తర్వాత ఒరిస్సాకు పది యిరవైయేళ్ళకు బ్రిటిషిండియాలో ప్రత్యేక రాష్ట్రాల ప్రతిపత్తి కలిగింది. 1913 లగాయతు ఆంధ్రులు పుమ్మడిమదరాసు రాష్ట్రంనుంచి విడిపోయి వేరేరాష్ట్రంకావాలన సాగారు. అస్సాముకూడా బెంగాలునుంచి విడిపోయింది. దేశంలోని వివిధ ప్రాంతా లలో భిన్నమైన భాషలుమాట్లాడే కోట్లాది ప్రజల సముదాయాలను జాతులనడం సబ బేనా? ఉపజాతులు (నేషనాలిటీస్) అంటేనే వాటి విశిష్టత భంగపడుతుందా? 'ఉప' అన్నంతమాత్రాన ఉపనదుల్లాంటివేననిగానీ భారతజాతికి ఉపాంగాలేననిగానీ భావించ వలసిన అవసరంలేదు. నిజానికి యిలాంటి ప్రాంతీయ జాతిరూపాలు మధ్యయుగాల ప్రారంభానికిగాని రూపొందలేదు. అంతకుముందునుంచీ దేశంలో జనం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వస్తూపోతూ (Intenal Migration) వచ్చారు. భూస్వా మికవిధానం పునాది సమాజం లోలోతులకు దిగి సామంతరాజ్యాలు ఎక్కడికక్కడ దాదాపుగా స్వతంత్రించాకనే, ప్రాంతీయజాతి నిర్మాణాలు స్థిరమైన రూపాలుపొందాయి. కొన్ని శతాబ్దాల పర్యంతం వీటిలో దేనికది విడివిడిగావుంటూ నిశ్చితమైన జాతిలక్షణా లలో కొన్నిటినైనా సంతరించుకోగలిగినా, వివిధ ప్రాంతాలమధ్య వర్తక వాణిజ్యాలు గానీ సైనిక, రాజకీయ, మత, సాంస్కృతిక సంబంధాలుగానీ అసలే లేకుండాపోలేదు. 19వ శతాబ్దం అంతంనుంచీ, మరీ ముఖ్యంగా ఈ శతాబ్దం రెండో దశాబ్దంనుంచీ, ప్రాంతీయజాతి రూపాలమధ్య రాజకీయ అన్యోన్యత ఎక్కువై, విశాలమైన భారత జాతిలో తాము అంతర్భాగాలేనన్న భావంవ్యాపించింది. సామ్రాజ్యవాద వ్యతిరేకత

దీనికి ఎక్కువ దోహదం చేసింది. ఆధునికనాగరికతా వ్యాప్తికూడా వివిధ ప్రాంతాలను దగ్గరకు తెచ్చింది.

అయితే యీ ప్రాంతాలన్నీ ఒకేస్థాయికి చెందినవికావు. అలాకాకపోవడానికి కారణం, సహజంగానే భూసారంలోనో ప్రకృతివనరులలోనో వాటిమధ్య తరతమ భేదాలుండడం ఒకటి. అసహజంగా, చారిత్రిక కారణాలవల్ల పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలోకి కొన్ని ప్రాంతాలు వచ్చినంత త్వరగానూ తేలికగానూ మరికొన్ని రాలేక పోవడం ఇంకోకారణం. కొన్నిటిలో భూస్వామిక అవశేషాలు మిగిలివున్నంత బలంగా మరికొన్నిట్లో మిగలలేదు. స్వదేశసంస్థానాలుగా వుండి విలీనమైన ప్రాంతాలలో అభివృద్ధి మరీ వెనకబడివుంది. వీటన్నిటికీతోడు, కొన్నిప్రాంతాలు చాలా పెద్దరాష్ట్రాలుగా వుండటంమూలాన, పార్లమెంటులో వాటి సంఖ్యాబలం మిగతప్రాంతాల బలంకంటె ఎంతో ఎక్కువ కావటంకూడా గమనించదగిన అంశమే. సముద్రతీరం లేకుండా దేశంమధ్యనూ కొసనూ వుండిపోయిన ప్రాంతాలలో కొండతెగలు తమ తమ జీవిత విధానాలను కొనసాగించుకుంటూ వస్తున్నాయి. తమ ప్రాంతానికే చెందిన సావుకార్లు కాంట్రాక్టర్లు, ఆఫీసర్లు వగైరాలతోబాటు, కేంద్రప్రభుత్వాధికారాన్ని అమలుపెట్టే అధికారులూ అన్యప్రాంతాలకు సంబంధించిన వ్యాపారులూ పరిశ్రమాధిపతులూ ఈ తెగల జీవనవిధానాన్ని క్రమేపీ క్లిష్టంచేస్తున్నారు. జాతులనండి, ఉపజాతులనండి, తెగలనండి, జాతీయబృందాలనండి, ఏమైనాసరే, అన్నీ ఒకేస్థాయికి చెందనిస్థితిలో దొంతర్లు తప్పడంలేదు.

ఒకే దేశంలోని ప్రాంతాలలో ఒకటి మరొకదాన్ని దోపిడీ చెయ్యడంగానీ మరో దానిమీద పెత్తనం జరపడంగానీ అబ్బురంకాదు. సమాజంలో ఒకవర్గం ఇంకో వర్గాన్ని దోచుకుంటున్నట్టే, పెట్టుబడిదారీ విధానంలో స్వపరభేదం లేకుండా దోపిడీ సాగుతుంది. అధికారంలోవున్న బూర్జువావర్గం తన స్వప్రయోజనాలను "జాతీయవాదం" ముసుగులో కొనసాగించుకుంటూనే, జాతిలో ఈ అక్రమాన్ని కొనసాగిస్తుంది. దానిది పిరమిడ్ అగ్రం - శిఖరాగ్రం. దోపిడీ అవుతున్నవారిది పిరమిడ్ పునాది. ఇది ఎంత విశాలమో అది అంత సంకుచితం. పెట్టుబడిదారీ విధానం తలెత్తకముందునుంచీ దేశంలో ప్రాంతీయాధిపత్యాలు ఏదోరూపంలో వుంటూనే వచ్చాయి. జాతిదురభిమానం (షావినిజం) విషయంలో బెంగాల్‌ది ముందంజ. స్వాధిక్యతగా అది బైటపడుతూ వచ్చింది. అస్సాం, త్రిపుర, మేఘాలయ వగైరాలన్నీ దీనికి గురైనవే. వైష్ణవ మతవ్యాప్తి దీనికి దోహదం కలిగించింది. వలసలువెళ్ళి అన్యప్రాంతాలలో స్థిరపడి

పరాయివాడి కొలువులో తమ విద్యాధిక్యతమూలంగా ఉన్నతస్థానాలు సంపాదించుకుని క్రమంగా ప్రాంతీయభాషను అణగదొక్కేవిధంగా తమభాషను, తమసంస్కృతిని పైకితెచ్చుకోవడం, ఆర్థికంగా యింగ్లీషువాడితో కలిసిగానీ సొంతంగాగానీ కంపెనీలు పెట్టి వ్యాపారంసాగించడం, అంతిమంగా ఆ యితరప్రాంతాల జాతీయవ్యక్తిత్వానికే ప్రమాదంకలిగించడం- యిలాంటివికృతమైన ఫలితాలుకలిగాయి గనకనే జాతుల సమస్య ఈశాన్యప్రాంతంలో తీవ్రరూపం ధరించవలసివచ్చింది. బెంగాలీలనేకాదు, పరాయివారెవరైనాసరే తమ జాతీయవ్యక్తిత్వానికీ విశిష్టతకీ ఎసరుపెట్టేవిధంగా తమ తమప్రాంతాలలో ఆధికప్రాబల్యం సంపాదించినప్పుడు, ఆయాప్రాంతాలలోని ఉప జాతులుగాని, జాతిబృందాలుగాని ప్రతిఘటించి పోరాడడం న్యాయమే.

ఎన్నడో హర్షవర్ధనుడి హయాంలో కామ్‌రూప్‌పేరుతో తక్కినదేశాలతో సన్నిహితసంబంధం కలిగివుండిన అస్సాంప్రాంతం, షాన్‌జాతికీ మంగోలాయిడ్ నరవర్గానికీచెందిన ఆహోమ్‌రాజులువచ్చి ఆక్రమించుకునేంతవరకూ భారతదేశంలో రాజకీయంగా అంతర్భాగమై ఉండలేదు. ఆహోమ్ వంశంరాజులు క్రమంగా హైందవీ కరణకులోనై, యిరుగుపొరుగుప్రాంతాలతో ఎలాగో బర్మాతో అలాగే సంబంధాలు కొనసాగించుకుంటూనే, మొగలుసామ్రాజ్యవిస్తరణను విరోధించగలిగారు. అయితే దేశం బ్రిటిష్‌వలసగామారాక, 19వ శతాబ్దంలో రెండోదశాబ్దితర్వాత బర్మాను జయించగోరినప్పుడు, అస్సాంనుఆక్రమించడం సైనికవ్యూహరీత్యా అవసరమైంది. బ్రిటిషిండియన్ సామ్రాజ్యంలోకి అలారెండుదఫాలుగా బలవంతాన వచ్చిచేరిన అస్సాం రాజకీయంగా తనప్రత్యేకతను సాధించుకునేందుకు చాలాకాలంపట్టింది. బర్మాకుపడమట టిబెట్‌కుదక్షిణాన, బెంగాల్‌కు ఈశాన్యాన సముద్రానికి ఉత్తరానవున్న సువిశాలమైనప్రాంతంగా అస్సాం, కొంతకాలం బెంగాల్‌తోకలిపీ మరికొంతకాలం తక్కినస్థాయి పరిపాలనాయూనిట్‌గా వుండిపోయింది. ఈకాలంనుంచే బెంగాలీల వలసలు మొదలయ్యాయి; ఇటీవలిదాకా సాగుతూనేవచ్చాయి. విద్య, వుద్యోగాలు, ఆర్థికఅవకాశాలు- యీ అన్నివిషయాలలోనూ అస్సామీలది అస్సాములోకూడా కింది చెయ్యే. పోనీ, తమప్రాంతంలో వుంటూవచ్చిన కొండతెగలజనాలపట్ల అస్సామీలు ఉదారంగా ప్రవర్తించారాఅంటే, అదీలేదు. దోపిడీకిలాముగురౌతూ ఇతరులను తామే తొక్కిపెట్టారు. అస్సామీలకు బెంగాలీలంటే ఎంతసరిపడకుండా వచ్చిందో, కొండ తెగల జనాలకు అస్సామీలంటే అంతేసరిపడకుండా వచ్చింది. చివరికి, యీతెగల ప్రాంతాలను అస్సామునుంచి విడగొట్టి ప్రత్యేక పరిపాలనాయూనిట్లుగా ఏర్పాటు

చెయ్యకతప్పలేదు. అస్సామీలకు బెంగాలీలంటేనే ద్వేషమూ, భయమూ లేవు. మార్వాడీలన్నా, నేపాలీలన్నా, అన్యప్రాంతీయులెవరన్నా అంతే.

అస్సాంలో యిప్పుడు సాగుతూన్న వుద్యమానికి ప్రాంతీయ బూర్జువా వర్గం నాయకత్వం వహించడంలో ఆశ్చర్యమేమీలేదు. అంతమాత్రాన దాన్ని బలపరచక పోవడం సముచితంకాదు. ఆ వుద్యమం వెనక ప్రజాసామాన్యం మూకీమద్దతులేనే లేదా? ఆ వుద్యమం ఫలవంతమైతే, ప్రాంతీయ ప్రజాసామాన్యానికి నష్టమా లేక కొద్దిపాటి వెసులుబాట్లూ సౌకర్యాలూ సదుపాయాలూ లభించవా? కొండతెగల జనాల పట్ల అస్సామీల అక్రమ పెత్తందారీ ధోరణిని ఖండిస్తూనే, అన్యప్రాంతీయులైన వారి మీద టెర్రరిస్టు వాదులనుకూడా గర్హిస్తూనే, అన్యప్రాంతాల ప్రజల ప్రాబల్యంనుంచి బైటపడేందుకు అస్సామీ బూర్జువావర్గం నాయకత్వాన, విద్యార్థులూ సాహిత్యకారులూ సారథ్యాన, ఆ వుపజాతి నడిపే వుద్యమాన్ని బలపరచకపోవడం సరైందికాదు. బెంగాలీలు అధికసంఖ్యలో వున్నంతమాత్రాన, అస్సాంలో బెంగాలీభాష ఒకప్పుడైనా అస్సామీభాషతో సమానప్రతిపత్తి కలిగివుండడం, బెంగాలీ సంస్కృతి యింకా ప్రాబల్యంతో వుండడం, వుద్యోగాలూ ఆర్థిక వసతుల విషయంలో అస్సామీలు వెనకబడివుండడం, చివరికి జనాభా విషయంలోనూ పశ్చిమబెంగాలు, బంగ్లాదేశ్‌నుంచి వచ్చిన వలసదార్ల సంఖ్యాధిక్యం ఫలితంగా అస్సామీలు తమ ప్రాంతంలోనే మైనారిటీ కాగల ప్రమాదం ఏర్పడడం, బ్రహ్మపుత్రనదీ ప్రాంతంలో బాంగ్లాదేశ్ రైతాంగం భూమిసాగుదార్లు కావడంవల్ల కొన్ని సత్ఫలితాలు కలిగినా అస్సామీ రైతాంగానికి ఆ ప్రాంతం మూతబడే అవకాశాలుండడం- యివన్నీ చిన్న విషయాలేమీకావు, సెన్సస్ లెక్కల తబిశీల్ల తేలికగా తీసివెయ్యవలసినవికావు. అస్సాంలోని టీ కంపెనీలలో ఎక్కువభాగం అన్యప్రాంతీయులవి. కలప కంపెనీలూ అంతే. పౌరసత్వం విషయంలో 1961 నుంచి అస్సాంలో వున్నవారికి ఆ హక్కు యివ్వడమా లేక, 1971 నుంచి వున్నవారికే యివ్వడమా అనేది, ఆ ప్రాంతం పరిపాలనలో ఎవరిది పై చెయ్యికాబోతుందన్న విషయాన్ని నిర్ణయించగలదు. అపారమైన సహజవనరులు గల ప్రాంతం గనక, అంతిమంగా యిది ఆర్థిక ప్రాబల్యానికి సంబంధించిన విషయం. అస్సాంలోనేగాదు, ఈశాన్యభారతంలో తక్కిన ప్రాంతాలలో జనసాంద్రత తక్కువై అక్షరాస్యతనుంచి ఆధునిక పరిశ్రమా నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం కూడా అంతంతగా వున్నందుచేత, అన్యప్రాంతాలకు చెందిన వణిక్కులుగానీ వుద్యోగులుగానీ కాంట్రాక్టర్లుగానీ వచ్చి ఈ జనాలను ఏదోవిధంగా దోచుకునే అవకాశాలు హెచ్చు. ఈ

ప్రాంతాల యువకులు యిలాంటి పరిశ్రమలలోనూ ప్రాజెక్టుల్లోనూ వుద్యోగాలు సంపాదించుకునే అవకాశాలు తక్కువ. లంచగొండితనం, ఆర్థిక అవినీతి ప్రాంతీయ సాంప్రదాయిక రాజకీయజీవులను భ్రష్టుపట్టించి, వారంటే జనాలకు అవిశ్వాసం కలిగించాయి. పార్లమెంటరీపార్టీ అంటేనే అరికాలిమంట నెత్తికెక్కించిన ఫలితంగా, యువకుల నాయకత్వాన సాయుధ తిరుగుబాటు పరిస్థితిఏర్పడి, ఎంత చల్లార్చుదామన్నా చల్లారని దావానలం అయింది. ఈ పరిస్థితిలో నాగా, మిజో వగైరా జనాల తిరుగుబాట్లని బలపరచటంతప్ప మార్క్సిస్టు - లెనినిస్టులకు గత్యంతరంలేదు. నిజానికి యిది అంతర్జాతీయ సమస్యలలో ఒకటైంది. భారత బడాబూర్జువా - భూస్వామ్య ప్రభుత్వం బర్మాలో సైనికాధిపతుల ప్రభుత్వమూ ఈతిరుగుబాట్లను అణిచేందుకు వుమ్మడిగా చెరోవైపునుంచి సైనికపథకాలను అమలుపెడుతున్నాయి. అలాగే బంగ్లాదేశ్, పాకిస్తాన్, చైనాలనుంచి యీ తిరుగుబాట్లకు ప్రత్యక్షంగానో మరోవిధంగానో ప్రోత్సాహంలభిస్తూంది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలద్వారా, పాకిస్తాన్‌ద్వారా, ఇప్పుడు బాంగ్లాదేశ్‌ద్వారా అమెరికన్ సామ్రాజ్యవాదం, భారతప్రభుత్వం కార్యకలాపాలద్వారా రష్యాసామ్రాజ్యవాదం ఈశాన్యభారతం భవితవ్యంలో తగుల్కొనివున్నాయి. కాబట్టి ప్రపంచవిప్లవంలో అంతర్భాగంగానే ఈ సమస్యను చూడవలసివుంటుందితప్ప విడిగాకాదు.

ఈశాన్యప్రాంతంలోనో మరోప్రాంతంలోనో సాగుతూన్న జాతీయపోరాటాలను సమర్థించడం ఎంతవిధాయకమో, ఎన్నోదశాబ్దాలతర్వాత రూపొందిన భారత జాతీయతను పరిరక్షించుకోవడంకూడా అంతేవిధాయకం. భారత జాతీయతఅంటే బడాబూర్జువా - భూస్వామ్యవర్గాల పరిపాలనధరించే జాతీయవాదం ముసుగుమాత్రం కాదు. ఈ పాలకవర్గాలు భారతజాతీయతకు ద్రోహంచేస్తున్నాయి. వాటి దళారీ స్వభావమే ఇందుకుకారణం. జాతీయత పాలకవర్గం గుత్తసొమ్ముకాదు. అది ప్రజల సమైక్యానికి సంబంధించింది. రానున్న నూతనప్రజాస్వామిక వ్యవస్థలో పీడిత ప్రజలచేతికి రాజ్యాధికారంవచ్చినపుడు, ఈ జాతీయతను వాళ్ళు పెంపొందించుకుంటారేగాని విచ్ఛిన్నంచెయ్యబోరు. బలప్రయోగంద్వారాగాక, దోపిడీద్వారాగాక, ప్రాంతీయ దురభిమానాలద్వారాగాక, ఆధిపత్యం ద్వారాగాక, సామరస్యంగా న్యాయంగా, జాతులసమస్యను పరిష్కరించేప్రయత్నం వాస్తవంగా మొదలయ్యేది అప్పుడే.

పుస్తక సమీక్ష :

ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర (రెండవభాగం)

మొదటిభాగాన్ని సమీక్షిస్తూ, ఇది వాస్తవానికి ఆంధ్రప్రాంతం చరిత్రకాదనీ, మన దేశంలో అన్నిప్రాంతాలచరిత్రకూ సామాన్యమయిన పరిణామక్రమానికి ఆంధ్ర ప్రాంతాన్ని ఒక ఉదాహరణగాతీసుకుని ఇచ్చిన వివరణఅనీ అన్నాము. మార్క్సిస్టు దృక్పథంనుండిచూస్తే ఈ రెండవభాగం అసలు చరిత్రేకాదు. మార్క్సిస్టు చరిత్రకారుడు చరిత్రచెప్పకూడదు, వ్యాఖ్యానించాలి. ఏంజరిగిందోకాదు, ఎందుకుజరిగిందో చెప్పాలి. చెప్పేది రాజులచరిత్రకావచ్చు, భట్రాజులచరిత్రకావచ్చు, ఆర్థికరంగాన్ని (ముఖ్యంగా దోపిడీసంబంధాల్ని) ప్రాతిపదికగా వివరించాలి. అంతేగాని సీదాసాదా బూర్జువాచరిత్రరాసి విరివిగా 'ఫ్యూడల్' అన్న మాటను ప్రయోగించినంతమాత్రాన అది మార్క్సిజం అనిపించుకోదు. అట్టవెనకాల ప్రకాశకులు, తొలిపలుకులో రచయిత, చెప్పుకోకపోతే ఆయన 'ఒకస్పష్టమయిన, నిర్దిష్టమయిన' సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని పుస్తకంరాసారని ఏపాఠకుడికీ అనిపించదు. భూమిలో వ్యక్తిస్వత్వంఉందా లేదా అన్నపట్టింపుఒకటే. మొదటిభాగంనుండి రెండవభాగానికి వచ్చాక రచయిత మిగుల్చుకున్న మార్క్సిజం, అడపదడపా వ్యక్తపరచిన రాచరికవ్యతిరేకతగూడా బూర్జువాలక్షణమేగాని ప్రత్యేకించి మార్క్సిస్టుగుణంకాదు.

వ్యవసాయాన్ని రాజులు అభివృద్ధిచేస్తారు: మతసామరస్యాన్ని రాజులూ సుల్తానులూ సాధిస్తారు: విజయనగర రాజులు పోర్చుగీసు వర్తకులతో సత్సంబంధాలు నెలకొల్పడం 'పచ్చెపు దొంగల్ని తమతో సమానుల్నిగా గౌరవించడం', పంటలో పదింటతొమ్మిది వంతులవరకు పన్నుగా దోచుకున్న విజయనగర పాలకవర్గం కన్న పోర్చుగీసు వర్తకులు పెద్ద దొంగలా? విజయనగర రాజులతో కలహించిన కొండవీటి వేమారెడ్డిని గురించి రచయిత వ్యాఖ్య: 'బహమనీ సుల్తానులనుండి దేశాన్ని స్వతంత్రం చేయడానికై ఇతరులను కలుపుకోవాలనిగాని, విజయనగర హిందూ రాజులతో చెలిమిచేసుకోవాలనిగాని, వేమారెడ్డి ఎప్పుడూ ఆలోచించలేదు'. తెలుగువాళ్ళు (లేకపోతే హిందువులు) పరిపాలిస్తే దేశం స్వతంత్రమూ సుల్తానులు పరిపాలిస్తే అస్వతంత్రమూ అనుకోవడం శాస్త్రీయమా? 1950 లలో 'విశాలాంధ్ర' వేడిలో ఏటుకూరి బలరామమూర్తిగారు తాత్కాలికంగా మార్క్సిజాన్ని పక్కనపెట్టి తెలుగు జాతిభక్తిని సిద్ధాంతంగా ఆంధ్రుల చరిత్ర రాసిన మాట వాస్తవమే. కాని ఆవేడి చల్లారి బూడిద అయిన 30 సంవత్సరాల తర్వాత గూడ కాకతీయులను, విజయనగర రాజులను, కొండవీటిరెడ్లను, 'తెలుగుజాతి' నాయకులుగా పరిగణించి ఆ నాయకత్వం

వారు సమర్థవంతంగా నిర్వహించనందుకూ, వాళ్లకు కలలోగూడతోచని ఆశయాల్ని వాళ్ల సాధించనందుకూ, వాళ్లను దుయ్యబట్టడం న్యాయమా?

'చరిత్ర అంటే రాజుల చరిత్రకాదు' అని మొట్టమొదట అన్నది మార్క్సిస్టులు కాదు బూర్జువాలే. అవి, వాళ్ళు చేసిందేమిటంటే చరిత్ర నుండి వ్యాఖ్యానాన్ని బహిష్కరించి రాజవంశాల చరిత్రస్థానాన, కొంచెం రాజవంశాల చరిత్ర, కొంచెం ఆర్థికరంగం చరిత్ర, కొంచెం పాలనావ్యవస్థ గురించి, కొంచెం సాహిత్యాన్ని గురించి కళలను గురించీ, చెప్పడం. సమాజంలో హెచ్చుతగ్గులూ పాలకపాలితులూ అన్న తేడాలను చూడకుండ 'సృష్టిలో మానవులంతా సమానులే' (all men are created equal) అని ప్రకటించడమే ప్రజాస్వామ్యం అనుకున్నట్టు, సమాజంలో అన్నిరంగాలనూ సమాంతరంగా నిలబెట్టి అన్నిటి చరిత్రనూ సమాంతరంగా, పరస్పర సంబంధాలు లేకుండ, చెప్పడమే శాస్త్రీయత (objectivity) అనుకుంటుంది బూర్జువా దృక్పథం. ఆ పద్ధతినే తుచతప్పకుండ పాటించారు కంభంపాటి సత్యనారాయణగారు. కావాలంటే చివరి అయిదు ప్రకరణాల శీర్షికలు చూడండి: కుతుబ్‌షాహి రాజవంశం, కుతుబ్‌షాహిల పాలనావ్యవస్థ, కుతుబ్‌షాహిల ఆర్థిక నిర్మాణం, కుతుబ్‌షాహీ యుగమతము- సమాజస్థితి, కుతుబ్‌షాహి యుగ సాహిత్యం - కళలు. వీటిలో ఏది ప్రధానం, ఏది అప్రధానం? ఏది నిర్ణాయకం, ఏది నిర్ణయించబడేది? పైగా ఈ వరసలోనే ఎందుకు చెప్పాలి? రాజవంశం తన పాలనావ్యవస్థనూ ఆర్థికనిర్మాణాన్నీ ఎంచుకుంటుందనీ, అటుతర్వాత మతము, సమాజస్థితి, సాహిత్యం, కళలు, రూపం తీసుకుంటాయనీ, దీని అర్థంకాదా? ఉత్పత్తిశక్తులేవీ, ఉత్పత్తిసంబంధాలేవీ, వైరుధ్యాలేవీ, వర్గపోరాటమేదీ, 'స్పష్టమయిన, విశిష్టమయిన' సిద్ధాంతమేదీ?

వ్యాఖ్యానించుకోలేకున్నా కనీసం ఉత్పత్తిరంగం చరిత్రచెప్పుకుందాం. భారత దేశఫ్యూడలిజంలో కనీసం మూడుదశలున్నాయి. మొదటిదశ క్రీ.శ. తొలిశతాబ్దాలలో మొదలయినట్టుంది (అంతకుపూర్వం ఎటువంటివ్యవస్థ ఉండేదో చెప్పడంకష్టం. 'బానిసవ్యవస్థ' ఉండేదని తీర్మానించాలంటే చరిత్రను అమర్యాదగా బలాత్కరించాల్సి ఉంటుంది). ఈదశలో గ్రామీణప్రాంతాలలో వర్గవిభజన అంతగాలేదు. వర్ణవ్యవస్థ బలపడిందిగాని కులవ్యవస్థ ఇంకా ఏర్పడలేదు (కనీసం ముదరలేదు). భూమి సాధారణంగా గ్రామసభల ఆధీనంలోవుండి రైతులకు దున్నుకునేందుకు పంచబడేది. గ్రామీణ స్వయంసంపూర్ణత అప్పుడప్పుడే ఏర్పడుతోంది. రైతులనుండి అదనపు ఉత్పత్తిని శిస్తురూపంలో సామంతులు, చిల్లరరాజులు, చక్రవర్తులు, ఒకసోపానంగా

(hierarchy) ఏర్పడి దోచుకునేవారు. కోశాంబి దీనిని (Feudalism from above అన్నాడు. ఈదశలోనే మనుధర్మశాస్త్రము, భగవద్గీత రాయబడ్డాయి, రెండూగూడా అంకుర రూపంలోని భూస్వామ్యసమాజపు సిద్ధాంతగ్రంథాలే.

అయితే క్రమంగా రాజులు, సామంతులు, భూదానాలుచేయడం మొదలు పెట్టారు. దానితో గ్రామీణప్రాంతాలలో ఒక భూస్వామ్య వర్గం ఏర్పడింది. ఈ భూదానాల గురించివిస్తృతమయిన సమాచారం సేకరించిన పరిశోధకుడు ఆర్. ఎస్. శర్మ మొదట్లో ఇవన్నీగూడ బ్రాహ్మణులకూ గుళ్ళకూఇచ్చిన అగ్రహారాలరూపంలో వుండేవనీ, తరువాతికాలంలో అధికార్లకు రొక్కపుజీతంబదులు జాగీర్లివ్వడంగూడ మొదలయిందనీ అంటాడు. సత్యనారాయణగారి పుస్తకం మొదటిభాగం చదివితేగూడ ఇదే అభిప్రాయం ఏర్పడుతుంది. అయితే శర్మఅన్నట్టు అగ్రహారదానాలు పుణ్యకార్యం కింద జమకట్టబడటంవల్ల వాటిని లోహపుశాసనాలలో ప్రకటించగా, అధికార్లకిచ్చిన జాగీర్లను ఎక్కువకాలం నిలవుండని పత్రాలలోప్రకటించి ఉండవచ్చును. ఆ కారణంగా మనకులభ్యమయ్యే సమాచారమంతా అగ్రహారదానాల గురించేకావచ్చు. అదెట్లాగున్నా, 7-8 శతాబ్దాలనాటికి గ్రామీణ ప్రాంతాలలోనే ఒక దోపిడీవర్గం ఏర్పడి గ్రామీణభూస్వామ్యం (Feudalism from below) ఆవిర్భవించింది ఇది రెండవ దశ. ఈ అగ్రహారీకులకూ జాగీర్దార్లకూ సాధారణంగా తమకు ఈనాంగా ఇవ్వబడ్డ భూమినుండి పన్నువసూలుచేసుకొని అనుభవించే హక్కుమాత్రమే ఉంటుంది. ఒక్కొకసారి వెట్టిచేయించుకునేహక్కుగూడ ఇవ్వబడుతుంది. అయితే వాళ్ళు దానితో తృప్తిచెందక తమ ఈనాంలో కొంతభూమిని స్వంతంచేసుకోవడం, దాన్నిదున్నుతున్న రైతులను తమకింద కౌలుదార్లుగా మార్చుకోవడం, చాలాతర్చుగా జరిగేవి. కాబట్టే ఆర్. ఎస్. శర్మచూపించినట్టు, ఈ దశలోనూ తరువాతిదశలోనూ రాయబడ్డ ధర్మశాస్త్రాలలో (నారద, గౌతమ, ఇత్యాది) మనుధర్మశాస్త్రంలోలేని భూమితగాదాల ప్రస్తావనవుంది.

ఈ దశలోగూడ, అగ్రహారాలకింద, జాగీర్లకింద, ఉన్నభూమిని మినహాయిస్తే మిగిలిన భూమి ఇంకా గ్రామసభల అధీనంలోనే వుండేది. పన్నువసూలుదార్లు రెడ్డి, సుంకరి, గౌడ, సుంకాధికారి - గ్రామసభల ఉద్యోగులేతప్ప ప్రభుత్వాధికార్లు కారు. పన్నుగుత్తదార్లు (జమీందార్లు) అంతకంటే కాదు. కాని వాళ్ళజీతంగూడ ఈనాంలరూపంలోను, కానుకల (నజరానాల) రూపంలోను, ఉండడంచేత వాళ్ళకూ కొంత భూస్వామ్యస్వభావం ఉండేది. ఈ కాలంలోనే దేశంలో చాలా ప్రాంతాలలో

ప్రాంతీయ భాషలలో సాహిత్యం రావడం మొదలయింది. చిల్లర భూస్వాములూ అగ్రహారీకులూ జాగీర్దార్లూ పుట్టుకొచ్చి పాలకవర్గానికి కొంత విస్తృతి ఏర్పడడంతో ప్రాంతీయభాషల ప్రాధాన్యత పెరగడం సహజం, అయితే ఈ వర్గానికి ఏరకమయిన అభ్యుదయ స్వభావమూ లేకపోవడంతో ఆ సాహిత్యం అనువాద సాహిత్యం మాత్రమే కాగలిగింది. ఈ దశ కాకతీయుల తరువాతి కాలంవరకు నడిచినట్లుంది. ఈ కాలంలో పట్టణప్రాంతాలలో వ్యాపారమూ వృత్తిపరిశ్రమలూ లేకపోలేదుగాని, అవి అంతగా విస్తరించలేదు. స్వయంపోషక గ్రామాలకు ఉత్పత్తి విధానం స్టేటస్ ఇచ్చి దానికి 'ప్రాచ్య ఉత్పత్తి విధానం' (Asiatic Mode of production) అన్న పేరు తగిలించిన సత్యనారాయణగారు ఈ వ్యాపారస్తంభనకు స్వయంపోషక గ్రామీణవ్యవస్థను కారణంగా చూపారు. 'స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థే తలసరిసరుకుల ఉత్పత్తిని పెరగకుండ అణచివుంచింది' (పేజీ 91) ఇది కోశాంబి నుండి అజ్ఞాతంగా అరువు తెచ్చుకున్న సూత్రీకరణ. Per-capita commodity production పెరగకుండడం భారతదేశ ఫ్యూడలిజానికీ యూరోపియన్ ఫ్యూడలిజానికీవున్న ముఖ్యమయిన తేడా అని కోశాంబి అన్నాడు. అయితే సామాన్యంగా కఠోరమయిన శాస్త్రీయప్రమాణాల్ని అనుసరించే కోశాంబి ఏ వివరణా ఏ నిరూపణా లేకుండచేసిన ఏకైక సూత్రీకరణ ఇది (నాకుతెలిసి) సత్యనారాయణగారుగూడ అటువంటి ప్రయత్నమేదీ అవసరం లేదనుకున్నట్టుంది.

అటుపైన (అంటే బహమనీ- విజయనగర- కళింగ గజపతులకాలంలో) మూడవదశ మొదలయింది. ఈదశలో వచ్చిన మొదటిమార్పు, పైనవివరించిన భూస్వామ్య సమాజపు క్రమపరిణామంలో భాగమే. గ్రామసభల అధికారం క్రమంగా క్షీణించి భూమిపై వ్యక్తియాజమాన్యం, స్వంతఆస్తి, విస్తృతంగా ఏర్పడ్డాయి (పేజీ 163-64). 14వ శతాబ్దం చివరినాటికి గ్రామసభలు పూర్తిగాక్షీణించాయని సత్యనారాయణగారి అంచనా (పేజీ195). గ్రామఅధికార్లు గ్రామసేవకులుకాక ప్రభుత్వ అధికార్లయ్యారు. బ్రాహ్మలకు అగ్రహారాలు, జీతానికిబదులు జాగీర్లు ఇవ్వడంమాత్రమే కాకుండ ఇంకొక రెండురకాల భూస్వాములుగూడ ఏర్పడ్డారు. మొదటిది యూరోపియన్ ఫ్యూడల్ ప్రభువులనుపోలిన సైనికజాగీర్దార్లు. యుద్ధంవచ్చినప్పుడు రాజుకు సైన్యాన్ని సమకూర్చిపెట్టే ఒప్పందంతో 'ఇక్తా'లు అనబడే జాగీర్లుపొందిన వాళ్లు వీళ్ళు. (గతంలో సామంతులు ఈ కర్తవ్యం నిర్వహించేవారు) ఆ జాగీర్లనుండి పన్నువసూలుచేసి దానితో సైన్యాన్నిపోషిస్తారు. పన్నువసూలేకాక, భూమిని సాపు

చేయించుకొని స్వంతంచేసుకోవడం, లేదా గ్రామభూములను ఆక్రమించుకొని రైతులతో వెట్టి, కౌలు, చేయించుకోవడంగూడకద్దు. రెండవది పన్నుగుత్తదార్లు, ఒక ప్రాంతం నుండి పన్నువసూలుచేసి ప్రభుత్వానికిచ్చే హక్కును గుత్తకుతీసుకున్న వాళ్ళు వీళ్ళు. వీళ్ళకే ఆభూమిపై యాజమాన్యం గూడ ఇచ్చి ఈ పద్ధతిని మరింత పటిష్ఠం చేసింది తరువాతి కాలంలో బ్రిటిష్ జమీందారీ వ్యవస్థ.

ఈ మార్పులు చాలావరకు ముస్లింలు వచ్చిన తరువాత ఏర్పడ్డవన్నది కేవలం కాకతాళీయమే. ఫ్యూడలిజం ముదిరేకొద్దీ ఆదిమసమాజపు అవశేషమయిన గ్రామ సభలు నశించడం, పలురకాల భూస్వాములు పుట్టుకురావడం అనివార్యం. అయితే ముస్లింలు మనదేశానికి తీసుకవచ్చిన మార్పుగూడ ఒకటుంది.

అరబ్బులది వ్యాపారనాగరికత. ఎడారిమయమయిన వారిదేశంలో వ్యవసాయిక సమాజంపుట్టే అవకాశం లేదు. పశ్చిమానకొని తూర్పున అమ్ముతూ, తూర్పున కొని పశ్చిమాన అమ్ముతూ, ఈ దళారీ వ్యాపారంలో తమ జీవనాన్ని సంపాదించుకున్న సంచారతెగలు ఆనాటి అరబ్బులు. ఇస్లాం వాళ్ళమతం. ఈ మారకవ్యాపారానికి అనుబంధంగా పట్టణప్రాంతాలలో వృత్తిపనుల పరిశ్రమలు బాగా అభివృద్ధిచెందాయి. గృహనిర్మాణంలో, బట్టలనేతలో, పట్టుపురుగుల పెంపకంలో, తాము కొంత సాంకేతిక అభివృద్ధిని సాధించారు. కొంత తరువాతికాలంలో చైనానుండి నేర్చుకున్నారు. మనదేశానికి అరబ్బులు, ఇతరముస్లింలు (ముఖ్యంగా పర్షియన్లు), రావడంతో ఈ వృత్తిపరిశ్రమల నాగరికత దిగుమతిఅయి, అప్పటికే ఇక్కడ కొంతఅభివృద్ధిచెంది వుండిన పారిశ్రామిక- వ్యాపారరంగం మరింతబలపడి, స్వయంసమృద్ధ గ్రామీణ వ్యవస్థకు ఒక పారిశ్రామికకవచం తొడగబడింది. ముస్లింలరాకకుఉన్న ఈ సామాజిక ప్రభావం కారణంగానే మనదేశంలో దిగువకులాలనుండి ముస్లింమతం పుచ్చుకున్న వాళ్ళలో వృత్తిపనివారేఎక్కువ, రైతులుతక్కువ. అందులోనూ వస్త్రపరిశ్రమకు సంబంధించిన కులాలవాళ్ళే ఎక్కువ. ఈ ప్రభావానికి సంబంధించిన వివరాలను, దాని వల్ల మనదేశ ఫ్యూడల్‌వ్యవస్థలో వచ్చినమార్పులను, అన్వేషిస్తూ గత పదిసంవత్సరాలుగా అలీఘడ్ విశ్వవిద్యాలయ చరిత్రశాఖవారు (ఇర్ఫాన్ హబీబ్, ఇక్తిదర్ అలంఖాన్, తదితరులు) చాలా పరిశోధనలు జరిపారు. ఈ పవిత్ర భారతదేశానికి వస్త్రపరిశ్రమలో సాంకేతిక అభివృద్ధి ముస్లింలుతెచ్చారని అభిప్రాయపడ్డ పాపానికి బ్రాహ్మణ చరిత్రకారులచేత తిట్లుగూడతిన్నారు. ఆ పరిశోధన లేవీ సత్యనారాయణగారి దృష్టికి వచ్చినట్లులేవు. అయితే ఈ దశలో వచ్చిన వ్యాపార,

పారిశ్రామిక, విస్తరణగురించి మాత్రం వివరంగానే చెప్పారు. విజయనగర రాజ్యంలో, వృత్తిపనివాళ్ళ నుండి, వర్తకులనుండి, వసూలయినపన్ను మొత్తం పన్నులో సగంవుండేదని అంచనావేసారు. దీనిగురించి నాకొక అనుమానం వుంది. నిలవఉండే పంటలు పండించే భూమిమీద పన్ను వస్తురూపంలో వసూలుచేసేవారు కాబట్టి అది రొక్కపుపన్నులో చేరదు. అటువంటప్పుడు రొక్కపుపన్నులో వృత్తి పనివారు, వర్తకులూ, ఇచ్చుకున్నది సహజంగానే ఎక్కువ ఉంటుంది- పారిశ్రామిక వాణిజ్యవిస్తరణతో సంబంధం లేకుండ. ప్రతి గ్రామంలోను సంతలు జరిగేవని 'ఆముక్తమాల్యద' అంటున్నదనీ, దాన్నిబట్టిగూడ వ్యాపారం విస్తరించినట్టూ స్వయం సంపూర్ణ గ్రామవ్యవస్థ బలహీనపడ్డట్టూ తెలుస్తుందని రచయిత అన్నారు (పేజీ 220). ఇది వాస్తవమే అయితే చాలా ఆసక్తికరమయిన విషయం. అంతకుముందు సంతలు జరిగేవికావా? సంతలలో అమ్మకంజరిగేవి స్వయంపోషక గ్రామాలలో ఖర్చుకాగా మిగిలిన సరుకులుకావా? సంతలలో అమ్మకంకోసమే ప్రధానంగా ఉత్పత్తిచేయడం కొంతమేరకయినా సరే విజయనగరకాలంలో మొదలయిందా? రాజవంశాల అర్థరహితమయిన చరిత్ర గురించి అంతంతసమాచారం సేకరించడానికి వెచ్చించిన శ్రమలో సగం ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఉపయోగించి ఉంటే బాగుండేది.

ఈకాలంలో వృత్తిపనివాళ్ళ శ్రేణులూ (craft guilds) వర్తకశ్రేణులూ (traders guilds) బలపడ్డాయి. వృత్తిపనివాళ్ళ శ్రేణులు వర్తక శ్రేణులకులోబడి ఉండేవని రచయిత అభిప్రాయం (పేజీ 222). ఈ వర్తకశ్రేణులు పట్టణప్రాంతాలలో పన్నువసూలును గుత్తకుతీసుకోవడంగూడ జరిగేది. అంటే గ్రామాలలోని జమీందార్లవంటి రెవెన్యూ గుత్తదార్లకు వీళ్ళు పట్టణరూపమన్నమాట. రాజ్యంనలు మూలలకూ ఆహారధాన్యాలు, సుగంధద్రవ్యాలు, వస్త్రాలు, రవాణాకావడమేకాకుండ, విదేశీవ్యాపారంగూడ బాగా జరిగేదికాబట్టి ఈ రెవెన్యూ గుత్తదార్లకు కావలసినంత గిరాకీ. నిజానికి- వ్యాపారం ఉన్నా లేకున్నా- ఫ్యూడల్ ప్రభుత్వాలకు పన్నువసూలును మించిన వ్యాపకం మరొకటిలేదు. పారిశ్రామికఉత్పత్తి, మారకం, ఎక్కువగా వుండవుకాబట్టి ఇవాళ్టిలాగ excise మీద, sales tax మీద ప్రభుత్వాలునడవ్వు, పాలక వర్గాల వినోదాలూ విలాసాలూసాగవు. రకరకాలపన్నులు- మనకు అమానుషంగాను హాస్యాస్పదంగాను కనిపించేవి- సేకరించాలి, విజయనగరరాజులు ఏటా తమక్షత్రియ ధర్మ నిర్వహణార్థం నడిపేయుద్ధాలకోసం పదివేలగుర్రాలు దిగుమతిచేసుకునేవారట. ప్రజలను ఎంతగా, ఎన్నెన్నిరకాలుగా, దోచుకుంటే ఈవిలాసాలుసాధ్యం? అందుకే

పెళ్ళికిపన్ను, పిల్లలుపుడితేపన్ను, గుళ్ళోమొక్కుతుంటేపన్ను, గుండుగీక్కుంటే పన్ను, ప్రభుత్వానికి అర్జీపెట్టుకుంటేపన్ను, అన్నిటికీపన్నే. మరి రవాణా సౌక ర్యాలు, ప్రసారసౌకర్యాలు, అపరిణతంగావున్న ఆరోజుల్లో పాలకవర్గాలకు జీవ ధాతువయిన ఈపన్నుల సేకరణకూడ పెద్దసమస్యే. ఇంగ్లండు, జర్మనీవంటి చిన్న దేశాలలో ఏమోగాని, మనబోటివిశాలమయినదేశాలలో ఆ సమస్య చాలాజటిలమయినది. ఈకారణంగానే, యూరప్ భూస్వామ్యంలోని సైనిక జాగీర్దార్లకంటే మనదేశ భూస్వామ్య సమాజంలో రెవెన్యూగుత్తదార్లకు ప్రాధాన్యతఎక్కువ.

దాదాపు సంపూర్ణంగా అభివృద్ధి చెందిన ఫ్యూడలిజం, సాంకేతికంగా కొంత అభివృద్ధిచెందిన వృత్తిపరిశ్రమలూ, దానితోటి వ్యాపారవిస్తరణ– ఇవీ విజయనగరా నికీ గజపతులకూ బహమనీలకూ పునాది. పునాదిలో ఈపాటి అభ్యుదయం ఉండడం వల్లేకాబోలు ఆకాలంలో అనువాద సాహిత్యం కాకుండ స్వతంత్ర సాహిత్యం వచ్చింది. అది ఫ్యూడల్ సాహిత్యమే, కాని పూర్తిగా దిగజారిన సాహిత్యం కాదు. ఆపాటి అభ్యుదయాన్ని కూడ కోల్పోయిన తరువాతే ప్రబంధ సాహిత్యం చాటుసాహిత్యమో అంతఃపుర సాహిత్యమో అయింది.

వీళ్లతరువాత వచ్చిన గోల్కొండ కుతుబ్‌షాహీల పాలనలో, పైనపేర్కొన్న వృత్తిపరిశ్రమల విస్తరణా, వ్యాపారవిస్తరణా కొనసాగాయి. ముఖ్యంగా, డచ్, బ్రిటిష్, ఈస్టిండియా కంపెనీలు ఏర్పడ్డతరువాత యూరప్‌కు వస్త్రాల ఎగుమతి విరి విగాసాగింది. ఈ విదేశీవ్యాపారంలో భారతదేశానిదే పైచేయి. వాణిజ్యసమతూకం (balance of trade) భారతదేశానికే అనుకూలంగా ఉండడంచేత విదేశాలనుండి బంగారం దిగుమతి అయ్యేది. తమదేశాలనుండి బంగారమంతా ఇండియాకు వెళ్ళి పోతోందనీ, కాబట్టి ఇండియాతో వ్యాపార సంబంధాలు తెంచుకోవాలనీ, ఫ్రాన్సువంటి పాశ్చాత్యదేశాల మేధావులు తమ ప్రభుత్వాలకు సలహా ఇచ్చినట్టు క్లాడ్ అల్వారెస్ అంటాడు. ఈ వ్రాపారంలో భాగంగా మచిలీపట్నం, నర్సాపురం దేవులగాము. నౌకా నిర్మాణకేంద్రాలుగాను ప్రసిద్ధి చెందాయి.

'ఇవన్నీ చూస్తే, కుతుబ్‌షాహీలకాలంలో గ్రామ స్వయంపూర్ణత్వం శిథిల మవుతూ అమ్మకానికై సరుకులతయారీ పెద్దఎత్తున ప్రారంభమయిందని.... అర్థమవు తుంది' అని రచయిత అభిప్రాయం (పేజీ 298), గ్రామీణ స్వయం సంపూర్ణతను దేశీయవ్యాపారమే తప్ప విదేశీవ్యాపారం దెబ్బతీయలేదు కాబట్టి ఇందులో కొంత అతి శయోక్తి ఉందిగాని, ఈ పారిశ్రామిక, వ్యాపార, విస్తరణవల్ల కుదరికులాలకు

ముఖ్యంగా వస్త్రఉత్పత్తిదార్లకు- సమాజంలో స్థానంపెరిగింది. ఆర్థికంగా కొంత బలపడి వాళ్లు వర్ణవ్యవస్థలో తమకున్న అధోస్థానాన్ని నిరసించారు. సాహిత్యంలో ఆ నిరసనను వ్యక్తపరిచిన వాడు వేమన.

అటుతరువాత బ్రిటిష్‌వాళ్ళకు భారతదేశం వలసగామారడం, వాళ్ళతమ రెవెన్యూ అవసరాలకోసం భూమిసంబంధాలలో కొన్నిమార్పులు తీసుకరావడం, ఇదంతా తరువాతికాలంకథ. ఆ కథను పుస్తకం మూడవభాగంలోచెప్తారు కాబోలు సత్యనారాయణగారు. ఫ్యూడల్ కాలంలాగాకాకుండ వలసకాలాన్ని గురించి విస్తృతమయిన పరిశోధనలు జరిగాయి. వాటిని దృష్టిలోవుంచుకుని మూడవభాగాన్నయినా శాస్త్రీయంగారాస్తే తెలుగువాళ్లకు ఎనలేనిసేవచేసిన వారవుతారు.

చివరిగా రెండుమాటలుచెప్పాలి. వ్యాఖ్యానించే ప్రయత్నం లేకపోవడం ఒక లోపమయితే, భారతదేశఫ్యూడలిజానికి ప్రత్యేకమయిన లక్షణాలను పట్టించుకోలేకపోవడంపుస్తకంలో మరొకలోపం. మొదటిభాగాన్ని సమీక్షించిన ఒక విమర్శకుడు కులవ్యవస్థను పట్టించుకోనందుకు సత్యనారాయణగారిని తప్పుపట్టడం జరిగింది. ఆ విమర్శ రెండవభాగానికి మరింత బాగావర్తిస్తుంది. ఎందుకంటే ఈ కాలంలో కులవ్యవస్థ బాగామునిరి ఉత్పత్తిసంబంధాలలో భాగంగా తయారయింది. నిజానికి స్వయంసంపూర్ణగ్రామాలలో వ్యవసాయేతరఉత్పత్తిలో కులవ్యవస్థ ఉత్పత్తిసంబంధాల పాత్ర నిర్వహించింది. వ్యావసాయిక ఉత్పత్తి సంబంధాలలోగూడ దానిపాత్ర తక్కువేంకాదు, భారతదేశ ఫ్యూడలిజంలో కులం ఒక ఉత్పత్తి సంబంధం అనడానికి చాలామంది మార్క్సిస్టులు సాహసించడంలేదుగాని అది కాదనలేనివాస్తవం.

భక్తిఉద్యమాల గురించి గూడ చాలా గందరగోళంవుంది. ఆ చిక్కువిడదీయడం అంత సులభంకాదుగాని, రెండు విషయాలు చెప్పకతప్పదు. భక్తిఉద్యమాలను కేవలం ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా సామాన్యప్రజల నిరసనను వ్యక్తపరిచిన ఉద్యమాలుగా అర్థంచేసుకోవడం తప్పు. ఆ అంశం వాటిలో లేకపోలేదుగాని అదే వాటి ప్రధానస్వభావంకాదు. భూస్వామ్య సమాజానికి భక్తి చాలాముఖ్యం పెట్టుబడిదారీ దోపిడీకి ఆర్థిక ప్రగతిని సాధించగలదనే లౌకిక సమర్థనవుంది. అది సాధించగల ప్రగతి పాక్షికం, సంక్షోభమయం అన్నది వేరేవిషయం. ఆ విషయాలు లోతుగా వెళ్తేగాని అర్థంకావు. కాని భూస్వామ్య దోపిడీకి ఆపాటి లౌకికసమర్థనగూడ సాధ్యంకాదు. దోచుకోబడే శ్రామికుడు దోచుకునే వాడిపట్ల 'నీ బాంచన్' అనే గుడ్డిభక్తిని ప్రదర్శించకపోతే భూస్వామ్య దోపిడీ నడవదు. అందుకే, దేనినీ ప్రశ్నించని

భక్తితత్వం భూస్వామ్య సమాజానికి అనువయిన భావజాలం. అయితే మనదేశంలో ఫ్యూడలిజం ఒక్కనాడు ఏర్పడక దశలుదశలుగా, అంచెలంచెలుగా, ఏర్పడింది కాబట్టి ఈ భక్తితత్వంగూడ ఒక్కనాడు మొలవకుండ 10 వ శతాబ్దం నుండి 14-15 శతాబ్దాల వరకు భక్తి ఉద్యమాల పరంపర రూపంలో సమాజాన్ని ఆవరించింది. ముదురుతున్న ఫ్యూడలిజానికి సమాంతరంగా ముదురుతున్న భక్తిభావంగానే వాటిని అర్థంచేసుకోవాలి. అంతేగాని 'ఫ్యూడలిజం' అన్నది మార్పులేని వ్యవస్థగాను అందులోవచ్చే ఉద్యమాలన్నీ ఫ్యూడల్ పీడననుండి ప్రజలకు ఉపశమనం ఇచ్చేవిగాను అర్థం చేసుకోవడం చాలా మొరటు వ్యాఖ్యానం. అదే వాస్తవమయితే కాకతీయులు శైవాన్నీ, విజయనగర ప్రభువులు వైష్ణవాన్నీ, కళింగగజపతులు చైతన్యాదితత్వాన్నీ ఎందుకు ఆదరించారో, భక్తిసిద్ధాంతాలకు వ్యతిరేకమయిన జైనమతాన్ని కాకతీయులెందుకు సాయుధంగా నాశనం చేసారో అర్థంకాదు.

మరయితే ఆనాటి భక్తిఉద్యమాలలో కొన్ని 'ప్రజాస్వామిక' లక్షణాలు లేవా అంటే ఉన్నాయి. దానికి రెండు కారణాలుగూడ ఉన్నాయి. ఒకటి, ఫ్యూడలిజం ముదరడం అంటే చిల్లర భూస్వాములు ఏర్పడడం. ఇట్లాఏర్పడ్డ చిల్లరభూస్వాములలో బ్రాహ్మణ మతంచేత శూద్రులుగా పరిగణించబడ్డవారు (నేటి రెడ్లు, వెలమలు, మొదలయినవారు) ఉండడంచేత, ఈ ఉద్యమాలకు వర్ణవ్యవస్థపట్ల వ్యతిరేకత ఉండడం సహజం. రెండవది, సమాజంలో వచ్చే ఏనూతనమార్పయినా తన కర్తవ్యాన్ని మించిన ఆదర్శాలను చరిత్రలోకి తెస్తుంది. బుద్ధుడినుండి ఫ్రెంచి బూర్జువా విప్లవ తాత్వికులవరకు తమ పరిధిలోలేని సర్వమానవ సమానత గురించి, సౌభ్రాతృత్వాన్ని గురించి విజాయితీతో మాట్లాడినవారే.

అనువాదం సరళంగానేవుంది, కొన్ని మినహాయింపులతో. 'పరిశ్రమలతో, పరిశ్రకంతో' అనేబదులు 'పరిశ్రమలూ, వర్తకమూతో' అనకతప్పదా, నవలా రచనలో చేయితిరిగిన మహీధర రామమోహనరావుగారికి ? సంక్షిప్తీకరణ గురించి ఆంగ్ల మూలం చూస్తేగాని చెప్పలేం.

— కె. బాలగోపాల్

ఆంధ్రుల సంస్కృతి, చరిత్ర - II. కంభంపాటి సత్యనారాయణ, సంక్షిప్తానువాదం : మహీధర రామమోహనరావు, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ (మార్చి 1982), పేజీలు: 354 + xxiv, 1/8 డెమీ, వెల రు. 14-00 ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 3-6-694, హిమాయత్‌నగర్, హైదరాబాద్ 500 029

సముద్రం నా తీరం

మండుతూ అగ్నిగోళం నుంచి నేను విరిగిపడ్డపుడు
వెలుగుతూ సూర్యబింబం నుంచి నేను కరిగిపడ్డపుడు
సముద్రంలో రంగరించింది నా రక్తమే
మట్టినై చల్లారకుండా
మనిషినై చల్లారకుండా
నాలో ప్రవహిస్తున్నది సముద్రమే

సముద్రం మట్టిలో నాలో
చెయిపెట్టి కెలుకు
ధాతువులు ధాతువులు జీవధాతువులు
ఋతువులు అవస్థలు వ్యవస్థలు
జలరాశుల్లో రాశిపోసిన సంపదలు
మట్టిపాతరలో తవ్వితీసిన ద్రవ్యరాశులు
నా శ్రమఊహాలు సృష్టించిన ఉత్పత్తులు

సముద్రాన్ని మథించింది నేను
భూమిని తలకిందులు చేసింది నేను
నన్ను నేను బంధించుకున్నది నేను

అలమీద గాలిమీటితే
ఆకుమీద వెన్నెలపాకితే
సెలయేటి గలగల అంచున వెలుగు మెరిస్తే
నేల పులకించి పుష్పిస్తే
స్వంతం చేసుకున్నది నేను
స్వతంత్రం కోల్పోయింది నేను

కాలికిందమట్టిని అణచిపెట్టి
సముద్రాన్ని శాసించాలనుకున్నాను
దేశాలను ద్వీపాలను జయించాను
ద్వేషాలను పాపాలను పోషించాను

సముద్రం దొంగనో స్మగ్లర్‌నో
సామ్రాజ్యవాదినై
నా సముద్రానికి నేను పరాయివాణ్ణయాను

నా సముద్రంలోని ఉప్పును విప్పును దాచుకున్నాను
జాలరి నెత్తుటివేడినీ
చెమటలోని రుచినీ దోచుకున్నాను

సముద్రాలకు సరిహద్దులు గీసిందినేను
సముద్రాలకు ముద్రలు వేసిందినేను
పేర్లు పెట్టిందినేను
దారులు మళ్ళించిందినేను

అఖాతాలను సముద్రంలోసృజించి
శాంతిమహాసముద్రాలను అన్వేషించిందినేను
బంగారంకోసం ద్వీపాలను ఎడారులను శోధించి
యుద్ధస్థావరాలకోసం
సముద్రాలను బాధించిందినేను

నీరువిరిగి విద్యుత్తు పుట్టినచోట
చీకటిసముద్రం వెలుగు అలలైనచోట
నక్షత్రకాంతి సముద్రదర్పణంలో ప్రతిఫలించినచోట
వెన్నెలలు కాసినచోట
ఆకాశమంతసూర్యుడు
అర్ణవమంతా ఒళ్ళువిరుచుకున్నచోట
అణువునుపగలగొట్టి చూసిందినేను
సముద్రానికి గర్భస్రావం మందుతాగించిందినేను

తరాలుగా అంగవైకల్యంతో పుట్టిందినేను
సముద్రానికి తినిపించినవిషాన్ని
గాలిలోకలుపుకుని తింటున్నదినేను
సామ్రాజ్యవాద యుద్ధపరిష్వంగంలో
శాంతిసముద్రాన్నై సంక్షోభపడుతున్నదినేను

నా రక్తం నాకిప్పుడు సరుకు
నా సముద్రం నాకిప్పుడు సరుకు
నా నేలతల్లిని ఎన్నిసార్లు అమ్ముకున్నానో
మళ్ళీ మళ్ళీ యుద్ధాలతో
మార్కెట్‌కు ఎగదోస్తున్నాను

నా లోహితాస్యుణ్ని చంపుకున్నాను
నా చంద్రమతిని అమ్ముకున్నాను
రాజ్యంకోసం రహస్తంత్రాల్ని
రక్తబంధాలను తెంచుకున్నాను
నాలో పులకించిన వేలను
పోటెత్తిన సముద్రాలను
వంచించాను

నీరాన్ని పంచుకున్నాను
తీరాన్ని పెంచుకున్నాను
అలలమీద విఘా వేసే పనికి
అంతటా తల్లిని కిరాయికి పెట్టుకున్నాను

* * * *

సముద్రాన్ని అర్థంచేసుకున్నది నేను
సముద్రాన్ని ఆవాహన చేసుకున్నది నేను
తుఫానులకు ఎదురీది
వాయుగుండాల నుంచి ప్రాణవాయువుల్ని
కాపాడింది నేను

తిమింగిలాలను లొంగదీసి
మొసలికన్నీళ్ళను పసిగట్టి
మిలమిల మెరిసే చిరుచేపల కళ్ళనూ
సముద్రం నీళ్ళనూ సంరక్షించింది నేను
సముద్రం దగ్గరికి తీరాన్ని వేసి

ప్రకృతికీ నాకూ
దూరాన్ని తగ్గించింది నేను
మా మధ్య పరచుకున్న పొగమంచును ఛేదించి
పగసెగలను ఛేదించి
సముద్రాన్ని సముద్రంగా చూసింది నేను

సముద్రం
బానిసల్ని మింగేసే బడబాగ్ని కాదు
బడబాగ్నిని మింగేసే బానిసల తిరుగుబాటు
సముద్రం
నాభూమి నడుముకు చుట్టిన వడ్డాణం కాదు
రాచరికాన్ని రద్దుచేసిన రక్తపాతవిప్లవం
సముద్రం
ఈస్టిండియా కంపెనీల్ని మోసేవలసకాదు
వలసలను అంతంచేసే దేశాలస్వాతంత్ర్యకాంక్ష

బాంబుల్ని మింగి ఆత్మహత్యచేసుకునే
పెట్టుబడిదారీ స్వేచ్ఛ కాదు సముద్రం
పెట్టుబడిదారీని మట్టుబెట్టే బోల్షివిక్ విప్లవం

తనకూ చంద్రునికీ అనుబంధం
శరజ్జ్యోత్స్న కాదు యుద్ధస్థావరాలని
తననూ గ్రహాలనూ
గామాకిరణాలో లేజర్ కిరణాలో
కలుపుతున్నాయవి
పిల్లొచ్చిగుడ్డునెక్కిరించినట్లు
సామ్రాజ్యవాదం ఇవ్వాళ ప్రకటిస్తే
సముద్రం పెదవులచాటున నవ్వుకున్నది

ఇవ్వాళ సముద్రం
సామ్రాజ్యవాద మరణశయ్యలాగున్నది

ఇవ్వాళ సముద్రం
కల్లోలపక్వల్వరీలాగున్నది

సముద్రం పొంగుతున్నది
సముద్రం ఉప్పొంగుతున్నది
చంద్రుణ్ణి గ్రహాలనూచేరదీసి
భూమిచెక్కిలిపై నా చెమటచుక్కను
తననెత్తుటిచుక్కగా ద్రు (ధ్రు)వీకరించి
సముద్రం నాదిగాకుండానే నాదవుతుంది
సముద్రం అందరిదవుతుంది

భూమి నాదిగాకుండానే నాదవుతుంది
భూమి అందరిదవుతుంది
ప్రకృతి నాదవుతుంది
ప్రకృతి నాకర్థమవుతుంది

సముద్రం అలలమీద తేలిపోతూ నేను
నాకలల్లో వెలిగిపోతూ సముద్రం
సముద్రంలో నేనొక నీటిచుక్కను
నాలోసముద్రం ఒక చెమటచుక్క

చెమటంతా నెత్తురుఅని తెలిసిపోయింది
నెత్తురంతా చలనమని తెలిసిపోయింది
చలనమంతా ఘర్షణని తెలిసిపోయింది
ఘర్షణంతా మార్పుకని తెలిసిపోయింది

సముద్రతీరాన తూర్పుప్రసవించి
అలలపొత్తిళ్లలో రేపునాకర్థమయింది

అలలకేసరాల్లో పరాగమై నేను
నా కలల పరిమళమై సముద్రం

సముద్రం నా భావనావిద్యుత్తు
సముద్రం నాభవిష్యత్తు

పాలస్తీనాకోసం

నందిని సిధారెడ్డి

రక్తంచెల్లించాల్సే ఉంటుంది-
ఎవరు ఏమట్టిని విముక్తం చెయ్యటానికైనా
ఎంతో కొంతరక్తం చెల్లించాల్సేఉంటుంది.
పాలస్తీనా! ఆయుధం వెనక్కితీసుకోవద్దు!
పాలస్తీనా మృతలఆకాశమ్మీద విచార జలదవిహారం చూశాను,
ఎక్కుపెట్టిన పిఎల్ఓ కంటికొనల్లో సూర్యాస్తమయం చూశాను.
విచారం ఘోరం
క్షణంక్షణం పెరిగివిరిగే కొండచరియ-
పాలస్తీనా! నీ చూపుడువేలు మడవొద్దు!
సామ్రాజ్యవాదం దాహంతీరదు-
జియోనిస్టుమృగాల దాహంతీరదు-
అన్నివైపుల్నుంచి మెలమెల్లగా
రంపపు కోరలల్లుతూ రాక్షసహేళచేస్తాయి
విమాననయనాల్తో ఆకాశంమీద ఎగర్తూ
అంచుఅంచూ బీభత్సంచేస్తాయి
దిగ్బంధంలో బీరూట్ దిక్కుదిక్కూనా పేరుపేరునా హృదయవిదారకంగా
ఆక్రోశిస్తుంది
వీధులన్నీ గాయపడి విలపించి విలపించి అలసిపోతాయి
రెండుచంకల్లో
రెండుపసిశోకాల బాలజ్వాలల్ని ఎత్తుకుని
ఒంటరిగా, దీనంగా, ఆర్తింగా ఒకమాతృశోకం పరుగెత్తుతుంది,
అలానా, బెగిన్ దాహంతీరదు-
బెగిన్ వీపెముక నోరుచాచే కిరాయికోరల సామ్రాజ్యవాద దాహంతీరదు-
పాలస్తీనా! ఆయుధం వెనక్కితీసుకోవద్దు!
శత్రువుబుల్లెట్లు శరీరాన్ని చీల్చినా
లేతఉదయానికి కమలిచ్చి కనుమూసినతల్లి తొమ్మిదినెల్ల గెరిల్లాగీతం
ఆగిపోవద్దు!
పాలస్తీనా! నీచూపుడువేలు మడవొద్దు!
శత్రువు ఇక్కడా విడిపెట్టడు.

విమానదాడులు ఇక్కడా కలవరపెడతాయి.
ఇన్ని వేలమైళ్ళ దూరానికైనా పాలస్తీనాపాపల ఆరనిదుఃఖనదులు వినబడతాయి.
'మత్ రో బచ్చే' అంటూ పాపల్ని ఓదార్చే ఫైజ్‌అహ్మద్ ఫైజ్ వినబడతాడు
'ఐషల్‌నాట్ కాంప్రమైజ్,
టు ది లాస్ట్ పల్స్ ఇన్ మై వెయిన్స్ ఐషల్ రెసిస్ట్!'[1]
కాసిం అక్షరాల్లో గెరిల్లా కదలికల కదనయాత్ర వినబడుతుంది
'టెల్ యువర్ చిల్డ్రన్ వాట్ ఇజ్రాయిల్ హాజ్ డన్
'టెల్ యువర్ చిల్డ్రన్ వాట్ ది అరబ్స్ హావ్ డన్'
'టెల్ యువర్ చిల్డ్రన్ వాట్ ది వరల్డ్ హాస్ డన్'[2]
పోస్టర్ రాతలమీంచి పొంగుతున్న 'అయూబ్' ఆవేదన వినబడుతుంది
దహన నిశ్శబ్దాల మీంచి శోకళకలాల మీంచి
యుద్ధకెరటాలు వినబడతాయి
ఆక్రందనలూ పరుగులూ నినాదాలూ వినిపించి కలవరపాటుతో ఇక్కడ నిద్రపట్టదు
పాలస్తీనా! నీచూపుడువేలు మడవొద్దు!
నీ చూపుడువేలు తరాల్నుంచీ దశాబ్దాల్నుంచీ మరుగుతున్న క్రోధం
నీ చూపుడువేలు గర్జించే పాలస్తీనా స్వేచ్ఛానేత్రం
నీ చూపుడువేలు ఏకధాటిగా పాడుతున్న బాణం
కొమ్మమీదవాలి ఆకుల్ని జాగృతం చేస్తున్న పక్షి
నీ కనుపాపలు ఆయిల్‌టాంకులు!
పాలస్తీనా పౌరుల జాబిలి మిలమిలలు!
వాతావరణాన్ని సూచించే రాడార్లు!
మీకు యుద్ధాన్ని కవిత్వం చెయ్యటం తెలుసు!
మీకు కవిత్వాన్ని వంచి నారిసంధించటం తెలుసు!
మీకు సముద్రాల్ని అరచేతుల్తో ఆవహించటం తెలుసు!
మీకు నయనాటవిలో నెత్తుటిచెట్లు నాటటం తెలుసు!
పాలస్తీనా! ఆయుధం వెనక్కితీసుకోవద్దు!
ప్రపంచ హృదయం కంఠనాళం విప్పి నీవిముక్తిగీతానికి పల్లవిపాడుతుంది
పాలస్తీనా! ఆయుధం వెనక్కితీసుకోవద్దు!
ఇజ్రేల్ కార్నివోరస్ కోరల్నుంచి నీమట్టిని విముక్తం చెయ్యటానికి
నువ్వెంతైనా రక్తం చెల్లించాల్సే ఉంటుంది

---

1. నేను రాజీపడను, నా రక్తనాళాల్లో చివరినాడి ఆడేవరకూ నేను ప్రతిఘటిస్తూనే ఉంటాను.

2 ఇజ్రాయిల్ ఏం చేసిందో మీ పిల్లలకు చెప్పండి. అరబ్బులేం చేసారో మీ పిల్లలకు చెప్పండి, ప్రపంచం ఏం చేసిందో మీ పిల్లలకు చెప్పండి.

పుస్తకస్వీకారం

1. రెండునదులు నవల - అరుణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ (మార్చి 1981), 184 + iv పేజీలు, 1/8 క్రౌన్, ఎనిమిది రూపాయలు ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 520 004

2. లయ - జింబో, వఝల శివకుమార్, పి.ఎస్. రవీంద్ర, వారాల ఆనంద్, అలిశెట్టి ప్రభాకర్ ల కవితలు, పోయెట్రీ ఫోరమ్, వేములవాడ ప్రచురణ (మే 1982), 62 పేజీలు, 1/8 డెమీ, మూడు రూపాయలు, ప్రతులకు: కళానికేతన్, 9-1-18, వేములవాడ, కరీంనగర్ 505 302

3. కార్టూన్ లలో మార్క్స్, అంగ్లమూలం: ర్యూస్, తెలుగుసేత: కె. బాలగోపాల్ హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ (జూన్ 1982) 152 పేజీలు, 1/8 డెమీ, పదిరూపాయలు, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 3.6.694, హిమాయత్ నగర్, హైదరాబాద్ 500 029

4. సరోజ్ దత్తా కవితలు (హిందీలో) సంపాదకుడు: కంచన్ కుమార్, ప్రోగ్రెసివ్ పబ్లికేషన్స్ ప్రచురణ (జులై 1982) 48 పేజీలు, 1/8 డెమీ, మూడు రూపాయలు.

5. A Critique of Soviet Economics - Mao-tse Tung Progressive Publications (July 82) 158 pages, 1/8 demy, Ten rupees.
ఈ రెండు పుస్తకాల ప్రతులకు: ప్రోగ్రెసివ్ పబ్లికేషన్స్, నం. 5, దులీచంద్ క్వార్టర్స్, బేర్ సరాయ్, న్యూఢిల్లీ 110 016

6. జానకివిముక్తి - 3, (ఆఖరిభాగం) మొదటి, రెండో సంపుటాలు - రంగనాయకమ్మ, స్వీట్ హోమ్ పబ్లికేషన్స్ (జులై 1982), 652 పేజీలు, 1/8 క్రౌన్, ఒక్కొక్క సంపుటం 15 రూపాయలు.

7. కనువిప్పు - నాటిక - బాబు, అరుణా పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ (మార్చి 1981), 40 పేజీలు, 1/8 క్రౌన్, మూడు రూపాయలు, ఈ రెండు పుస్తకాలూ ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్, ఏలూరురోడ్, విజయవాడ 520 002

8. గతితార్కిక భౌతిక మానవతావాదం, త్రిపురనేని మధుసూదనరావు, విరసం, నెల్లూరుజిల్లా యూనిట్ ప్రచురణ (ఆగస్ట్ 1982), 36 + iv పేజీలు, 1/8 డెమీ, రెండు రూపాయలు, ప్రతులకు: బి. వి. ప్రసాద్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, వెంకటగిరి టవున్, నెల్లూరు.

సృజనలో విరసం తొమ్మిదో మహాసభల రిపోర్ట్ చూసాను. 'కొయ్యగుర్రం' కావ్యం చివర తాను (నగ్నముని) పాతరాతియుగం (పనిముట్టుపట్టుకొని)లోకి, పోతా ననడంని refer చేస్తూ యిది Return to State of nature philosophy అనీ, వెనక్కిపోవడం, పాతరాతియుగంలోకిపోవడం ప్రగతిశీలదృష్టికాదనీ కనుక అదీ పునరుద్ధరణవాదంలో చేరుతుందనీ అన్నాను. ఇది రిఫర్ చేయకుండా 'నగ్నముని రాసిన కొయ్యగుర్రం'అనే కావ్యాన్నికూడా పెడధోరణులకోవలోకి చేర్చడాన్ని గురించి చలసాని ప్రసాద్ (లేక మరెవరైనా) అభ్యంతరం తెలిపారు' అన్నదాంట్లో నేనెందుకు అది పునరుద్ధరణవాదమౌతుందో carry చేయదుగనక, educate చేసే బదులు, 'నగ్నముని'పై సింపతీని కలుగచేస్తుంది. నా ఉద్దేశ్యంఅదికాదు. 'పాత రాతి యుగం పనిముట్టుపట్టుకొని చరిత్ర చీకటికోణాలగుహల్లోకి వెళ్ళిపోయే' నగ్నముని ఫిలాసఫీని expose చేయదలుచుకున్నది- పచ్చగాబతుకుదామనుకుంటున్న భూస్వామ్య సాహిత్య సంస్కృతులకు సామ్రాజ్యవాదాలు ఎరువేయడంవల్ల 'పునరుద్ధరణవాదం' సాహిత్యంలో ప్రధాన ప్రమాదకరధోరణిఅనీ, ఇస్మాయిల్‌వరకూ అన్ని పెడధోరణులు పునరుద్ధరణవాదాన్ని బలపరిచేవి (ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా) కావడంవల్ల పునరుద్ధరణవాదంలోని భాగాలే ఈ అన్ని పెడధోరణులని (అవ్వాళ్ళ ప్రస్తావించినవి) కనుక 'పునరుద్ధరణవాదం' శీర్షికనే వీటినీ ప్రస్తావించడం, విశ్లేషించడం (ఎంతవరకు సఫలతచెందానో) జరిగింది. 'పరిశీలక్' యిదిగమనించినట్టు లేక ఆ వుపన్యాసశీర్షిక 'సాహిత్యంలో పెడధోరణులు'అనివుంటే బాగుండేట్టు యిష్టపడినట్టున్నాడు. శీర్షికపేరు బాగుండడానికి కాకుండా ANALYSE చేయడానికుద్దేశించినటు ఫీలౌతూన్నా-

'సమ్మ'

(నాలుగో కవర్ తరువాయి)

గుర్తులన్ని తూట్లుబడె
ఏలునీది, కన్నుసీదెరో -ఓ పోలీసన్న
పేగునీదె, కడుపునీదెరో -ఓ పోలీసన్న
॥నాసా॥

నేనుసమ్మె చేసినప్పుడు
సమ్మెనాప నిన్నుదించె
నీవుసమ్మె చేసినప్పుడు
సి ఆర్ పి ని దించినారు
సి.ఆర్.పి. సమ్మెచేస్తె
మిలటరీని దించినారు
మనలో మనమె కాల్చుకుంటెరో
-ఓ పోలీసన్న
సర్కారోడు మురిసిపోయెరో
-ఓ పోలీసన్న ॥నాసా॥

నన్నుకాల్చి సంపినోడు
నిన్నుకాల్చి సంపనుండు
నువ్వునేను ఏకమయ్యెరో - ఓ పోలీసన్న
మనల కాల్చేటోనికాల్చుదాముర్రో
-ఓ పోలీసన్న ॥నాసా॥

(బొంబాయి, హర్యానా పోలీసుల న్యాయమైన ఆందోళనకు మద్దతుగా....
'జననాట్యమండలి పాటలు' నుంచి)

SRJANA Telugu Monthly Sep. 82 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.

ఓ పోలీసన్న

నాసా కింద-మీసా కింద
నిన్నుజైల్ల-బెట్టినారు
నీకు నాకు తేడలేదయ్యో- ఓ పోలీసన్న
పోరుదప్పు దారిలేదయ్యో- ఓ పోలీసన్న
॥నాసా॥

తన్నుడుకాడ-గుద్దుడుకాడ
తిట్టుడు కాడ - కొట్టుడుకాడ
అన్నింటికి ముందుగుంటివా-
ఓ పోలీసన్న
ఆకలితో సస్తవెందుకో- ఓ పోలీసన్న
॥నాసా॥

చాలిచాలని బతుకులాయె
చాపురాక బతుకుటాయె
పంటికింద మెతుకులేదు
కంటినిండ కునుకులేదు
కుప్పలోలె అప్పుపెరిగెనా- ఓ పోలీసన్న
కుంపటోలె బిడ్డ బెరిగెనా - ఓపోలీసన్న
॥నాసా॥

చాపుకైన లెక్కచెయక
సమ్మెనాప దుంకుతావు
కత్తుల కత్తులు లేపుకున్న
కొట్లాటల నాపుతావు
కండ్లుబగ్గున మండిపోంగ
టియెర్‌గ్యాసు వొదులుతావు
నీ బతుకంతా రిస్కేనన్నో- ఓ పోలీసన్న
రిస్క్అలవెన్సు ఎందుకులేదో
-ఓ పోలీసన్న ॥నాసా॥

కండ్లముందు వొచ్చినోడు
కారులెక్కి తిరగవట్టె
ఎఫ్.ఐ.ఆర్ రాయరాదు
ఎస్.ఐ.గా రానేవొచ్చె
ముప్పయ్యేండ్లు గడిసిపాయెరో
-ఓ పోలీసన్న
మూడుపట్టీలు రాకపాయెరో
-ఓ పోలీసన్న ॥నాసా॥

మంత్రివెనక మంత్రిమారె
మారలేదు నీ బతుకులు
బుడ్డపైస పెంచినారు
పెద్దపైసా గుంజినారు
నీ టోపినెక్కరు మార్చినారురో
-ఓ పోలీసన్న
నీకుటోపిపెట్టినారురో -ఓ పోలీసన్న
॥నాసా॥

నీ బిడ్డెల చేతులార
చెట్లాకుగట్టేసినావు
ఫైర్ అని ఆర్డరిస్తే
పటా పట్ కాల్చినావు
గుర్తులన్ని గుర్తుకొస్తె

(మిగతా మూడవ కవర్‌లో)

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs. 20-00